ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 11.03.2025 | సంపుటి : 11 | సంచిక : 239 | పేజీలు : 12 | వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# నిధులు అధికంగా ఇచ్చినట్టు నిరూపించండి

## కిషన్‌రెడ్డికి సన్మానం చేస్తాం: సీఎం రేవంత్

రాష్ట్ర అవసరాల కోసం 39 కాకుంటే 99 సార్లు ఢిల్లీకి వెళ్తాం
కుదరకపోతే అక్కడ ధర్నా కూడా చేస్తాం



- కేంద్రమంత్రులు హైదరాబాద్‌కు వచ్చి సమీక్షలు పెడితే ఆయన ఎందుకు రాలేదు?
- కేసీఆర్ బాధపడతాడని రాలేదా అని నిలదీసిన ముఖ్యమంత్రి

ప్రాజెక్టులకు బడ్జెట్‌లో పరిమిత నిధులు
అందుకే కేంద్రం సాయం కోరుతున్నాం
మోడీ హామీ మేరకు నిధులు అడుగుతున్నాం
పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్‌కు సున్నా రావటానికి కారణం నేనే
కేసీఆర్‌ను కుర్చీల్లోంచి దించిందీ నేనే
పదేళ్లలో ప్రాజెక్టులు కట్టిఉంటే ఇప్పుడు ఏపీతో సమస్య వచ్చేది కాదు
అభివృద్ధిని అన్ని ప్రాంతాలకు విస్తరించాలి
మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ వెల్లడి

**హైదరాబాద్(జనంసాక్షి):** ప్రాజెక్టులకు బడ్జెట్‌లో పరిమితమైన కేటాయింపులు ఉంటాయని.. అందుకే కేంద్ర ప్రభుత్వాన్ని నిధులు అడుగుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో ప్రధాని మోదీ ఇచ్చిన హామీ మేరకే నిధులు ఇవ్వాలని కోరుతున్నట్లు సీఎం చెప్పారు. 39 సార్లు కాకుంటే 99 సార్లు దిల్లీ పోతాం.. తప్పేంటని సీఎం ప్రశ్నించారు. సందర్భం వస్తే నిధుల విషయంలో దిల్లీలోనైనా ధర్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సీఎల్పీలో సీఎం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.'తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ భయపెడతారనే ప్రభుత్వానికి బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సహకరించడంలేదని సిఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. మనోహర్ లాల్ ఖట్టర్ వచ్చేది కూడా కిషన్ రెడ్డికి తెలియదా? అని ప్రశ్నించారు. ఆర్‌ఆర్‌ఆర్ ఇచ్చామని మోదీ అన్నారని, అదే ఇవ్వమంటున్నామని రేవంత్ అన్నారు. 'జైపాల్ రెడ్డి తెచ్చిన మెట్రో కనిపిస్తోంది..కిషన్ రెడ్డి తెచ్చిన

మిగతా 2లో..

*ప్రాజెక్టులకు బడ్జెట్‌లో పరిమితమైన కేటాయింపులు ఉంటాయి.. అందుకే కేంద్ర ప్రభుత్వాన్ని నిధులు అడుగుతున్నాం. గతంలో ప్రధాని హామీ మేరకే నిధులు ఇవ్వాలని కోరుతున్నాం. 39 సార్లు కాకుంటే 99 సార్లు దిల్లీ పోతాం.. తప్పేంటి? నిధుల విషయంలో దిల్లీలోనైనా ధర్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం*
*- సీఎం రేవంత్ రెడ్డి*

# గ్రూప్-1 ఫలితాలు విడుదల

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో 563 గ్రూప్-1 ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన మెయిన్స్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ పరీక్షలో అభ్యర్థులు పొందిన ప్రాథమిక మార్కుల వివరాలను టీజీపీఎస్సీ సోమవారం మధ్యాహ్నం వెల్లడించింది. గతేడాదిలో జరిగిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 21,093 మంది హాజరైన విషయం తెలిసిందే. టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో అభ్యర్థులు తమ టీజీపీఎస్సీ ఐడీ, మెయిన్స్ హాల్‌టికెట్ నంబర్, పుట్టిన తేదీ వివరాలతో పాటు క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి పేపర్ల వారీగా మార్కులను పొందొచ్చు.గతేడాది అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్ -1 సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం ఏడు పేపర్లుగా నిర్వహించిన ఈ పరీక్ష వాల్యుయేషన్ ప్రక్రియను పూర్తి చేసిన అధికారులు..

మిగతా 2లో..






ప్రణయ్ హత్య కేసులో నల్గొండ కోర్టు

# సంచలన తీర్పు

## ఏ2 సుభాష్‌శర్మకు ఉరిశిక్ష..

## మిగిలిన వారికి యావజ్జీవ శిక్ష



**నల్గొండ(జనంసాక్షి):** ఆంధ్రా,తెలంగాణలో సంచలనం సృష్టించిన మిర్యాలగూడ పెరుమాళ్ల ప్రణయ్ హత్య కేసులో తుది తీర్పును సోమవారం నల్లగొండ కోర్టు వెల్లడించింది. ఏ2 సుభాష్ శర్మకు ఉరిశిక్ష విధిస్తూ న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. నిందితులు అందరికీ యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ ఎస్సీ, ఎస్టీ సెషన్స్ రెండో అదనపు న్యాయ స్థానం కీలక తీర్పు వెలువరించింది. 302, 120 ఐపీసీ, 109, 1989 సెక్షన్ ఐపీసీ ఇండియన్ ఇండియన్ ఆర్మ్ యాక్ట్ 1959 ప్రకారం

మిగతా 2లో..

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

- ఓటర్ల జాబితా అవకతవకలపై అట్టుడికిన పార్లమెంట్
- ఈ అంశపై చర్చ జరగాలి: రాహుల్
- డీలిమిటేషన్, జాతీయ విద్యా విధానంపై డీఎంకె నిరసన
- పార్లమెంట్ ఆవరణలో ఆందోళన



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఓటర్ల జాబితాలో అవకతవకలపై సోమవారం పార్లమెంట్ అట్టుడికింది. ఈక్రమంలోనే స్పీకర్ సభను వాయిదా వేసి తిరిగి ప్రారంభించారు. ప్రధాన్ వ్యాఖ్యలపై డీఎంకే నిరసన వ్యక్తంచేసింది. అనంతరం ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడారు. ఓటరు జాబితాలో అవకతవకలు జరిగాయన్న అంశాన్ని ఆయన లేవనెత్తారు. దీనిపై దేశవ్యాప్తంగా ఆందోళనలు

మిగతా 2లో..

# తెలంగాణలో కచ్చితంగా ఉపఎన్నికలు వస్తాయ్

అందుకే ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉన్నాం
ఫార్ములాఈ రేసు కేసులో మళ్లీ నోటీసులు వచ్చే అవకాశం
అబద్ధాలతో పాలనను సాగించలేం : కేటీఆర్



**హైదరాబాద్(జనంసాక్షి):** అబద్ధాలతో పాలన ఎక్కువకాలం సాగించలేమని.. దానిని ప్రజలు గ్రహించినప్పుడు మూల్యం తప్పదని మాజీమంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణలో కచ్చితంగా ఉప ఎన్నికలు రాబోతున్నాయని తెలిపారు. అందుకే ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉన్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్ సోమవారం నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తమకు ఉన్న బలంతోనే ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీ చేస్తున్నామని తెలిపారు. అప్పుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పదేపదే అబద్ధాలు చెబుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఇంకా ఎన్నేళ్లు అబద్ధాలు చెబుతారని రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్ సమావేశాల తీరు కూడా అబద్ధాలు, బుకాయింపులతోనే సాగుతుందని ఆరోపించారు. ఫార్ములా ఈ కార్ రేసులో మళ్లీ తనకు నోటీసులు ఇస్తారని అభిప్రాయపడ్డారు.

మిగతా 2లో..

## అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరవుతారు

2లో

గవర్నర్ ప్రసంగం,బడ్జెట్ సమావేశాల రోజుల్లో వస్తారు: కేటీఆర్

సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో

# పూర్తి చేస్తాం

పాత ప్రాజెక్టుల నిర్వహణపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలి
నీటిపారుదల శాఖ, పౌర సరఫరాల శాఖ ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



**హైదరాబాద్(జనంసాక్షి):** ప్రాధాన్యత క్రమంలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, వీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం లో జరిగిన సాగునీటిపారుదల శాఖ, పౌర సరఫరా ల శాఖ ప్రీ బడ్జెట్ సమావేశంలో వారు పలు అంశాలు చర్చించారు.ఎస్ ఎల్ బి సి ప్రాజెక్టు ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని, ఒంఖీఖ లో ఐదవ పంపు ఏర్పాటు చేసుకునే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు పూర్తిగా స్టడీ చేసి గోదావరి నీటితో పాలేరు రిజర్వాయర్ ను పరిపుష్టం చేసే పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. గోదావరి పరిధిలో బస్వాపూర్ మొదలు సింగూరు వరకు, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఏదుల నుంచి వట్టెం - ఏదుల కాలువలు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు.డిండి ఎత్తిపోతల పథకం పరిధిలో చివరి దశకు చేరుకున్న ప్రాజెక్టులను పూర్తి చేయడంపై అధికారులు దృష్టి సారించాలని ఇరువురు మంత్రులు ఆదేశించారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో వివిధ ప్రాజెక్టుల కింద ఉన్న భూ సేకరణ, పాత ప్రాజెక్టుల నిర్వహణ, క్యాపిటల్ వర్క్స్ పై దృష్టి సారించాలని అధికారులకు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులను ఆధునికరించుకోవడం, కాలువలకు లైనింగ్ ద్వారా ప్రాజెక్టుల జీవితకాలం పెరుగుతుందని, అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుందని మంత్రులు తెలిపారు. గత పది సంవత్సరాల పాటు పరిపాలించిన వారు


మిగతా 2లో..

పీజీ మెడికల్ రిజర్వేషన్లపై పిటిషన్..

## కొట్టేసిన సుప్రీంకోర్టు

**హైదరాబాద్(జనంసాక్షి):** మెడికల్ విద్యకు సంబంధించి పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన తెలంగాణ మెడికల్ కాలేజెస్ రూల్స్ 2017లోని కొన్ని నిబంధనలను సవాల్ చేస్తూ హైకోర్టు మాజీ

మిగతా 2లో..



కేవీ ప్రవేశాల్లో ఎంపీల కోటా

## పునరుద్ధరించే ప్రతిపాదనలేదు

కేంద్రం మరోసారి క్లారిటీ

వార్త 2లో



# నామినేషన్ల షురూ..

కాంగ్రెస్ తరపున దాఖలు చేసిన అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, విజయశాంతి
సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం నామినేషన్ దాఖలు
హాజరైన ముఖ్యమంత్రి రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి
బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన దాసోజ్ శ్రవణ్



**హైదరాబాద్(జనంసాక్షి):** ఎమ్మెల్యేల కోటాలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఆ పార్టీ నేతలు విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అట్టహాసంగా నామినేషన్ల కార్యక్రమం సాగింది. వీరికి సిఎం సహా మంత్రులు సంతకాలు చేశారు. మరోవైపు సీపీఐ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నెల్లికంటి సత్యం నామపత్రాలు

మిగతా 2లో..

## అటవీ సంపదను దోచుకునేందుకే 'ఆపరేషన్ కగార్'

వెంటనే ఆపాలని మావోయిస్టుల డిమాండ్

**ఛత్తీస్‌గడ్(జనంసాక్షి):** అటవీ సంపదను కేంద్ర ప్రభుత్వం దోచుకునేందుకు ఆపరేషన్ కగార్‌ను తీసుకొచ్చిందని మావోయిస్టులు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సౌత్ బస్తర్ డీ.వీ.సీ.ఎం సభ్యుడు మొడీయం దినేష్ అతని భార్య కళ పార్టీ డబ్బుతో పారిపోయి పోలీసులకు లొంగిపోయారు. ఇరవై ఏళ్ల ఉద్యమ జీవితంలో ఉన్న దినేష్ పార్టీకి ద్రోహం చేశారని మావోయిస్టులు లేఖలో ప్రస్తావించారు. తీవ్రమైన అణచివేతకు గురైన

మిగతా 2లో..

భారత్‌తో దెబ్బతిన్న సంబంధాలను

# బలపరుచుకుంటాం

కెనడా నూతన ప్రధాని మార్క్ కార్నీ కీలక వ్యాఖ్యలు
తమ దేశం ఎన్నటికీ అమెరికాలో భాగం కాబోదని స్పష్టం




**ఒట్టావా(జనంసాక్షి):** కెనడా అధికార లిబరల్ పార్టీ నూతన నేతగా ఎన్నికయిన మార్క్ కార్నీ భారత్-కెనడా సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రూడో అధికారంలో ఉన్న సమయంలో భారత్‌తో దెబ్బతిన్న సంబంధాలను తిరిగి పునరుద్ధరిస్తానన్నారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ఆవిధంగా కృషి చేయడానికి ఎదురు చూస్తున్నానని పేర్కొన్నారు. న్యూదిల్లీతోనే కాకుండా సారూప్యత కలిగిన దేశాలతోనూ వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. భారత్‌పై తన వైఖరిని ఇదివరకే ఓ ఇంటర్వ్యూలో ఆయన స్పష్టం చేసిన విషయం తెలిసిందే. తాజా వ్యాఖ్యలు ఆయనకు భారత్‌పై ఉన్న సానుకూల ధోరణిని వ్యక్తపరుస్తున్నాయి. దశాబ్దాల తరబడి మిత్రదేశాలుగా ఉన్న భారత్, కెనడాల మధ్య సంబంధాలు ఇటీవల బాగా దెబ్బతిన్నాయి. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో నిరుడు తమ పార్లమెంటులో మాట్లాడుతూ.. ఖలిస్థానీ ఉగ్రవాది

మిగతా 2లో..



## ఎక్కడ చూసినా శవాలగుట్టలే..

ప్రతీకార హత్యలతో అట్టుడుకుతున్న సిరియా

**లెబనాన్(జనంసాక్షి):** సిరియాలో అంతర్యుద్ధం తీవ్ర స్థాయిలో జరుగుతున్నట్లు నివేదికలు వస్తున్నాయి. గత 48 గంటల్లోనే 745 ప్రతీకార హత్యలు చోటుచేసుకొన్నాయి.చాలా ప్రాంతాల్లోని మైనార్టీలైన అలావైట్లను అణచివేసే దిశగా ఈ దాడులు జరుగుతున్నాయి. గురువారం అసద్ మద్దతుదారులపై హెచ్‌టీఎస్ ప్రభుత్వానికి అనుకూల సాయుధులు దాడులు చేయడంతో ఘర్షణలు మొదలయ్యాయి.

మిగతా 2లో..

## జెలెన్‌స్కీకి కొంచెమైనా కృతజ్ఞత లేదు

పిల్లాడి నుంచి చాక్లెట్ లాక్కొన్నంత తేలిగ్గా అమెరికా నుంచి సొమ్మును తీసుకున్నాడు
మరోసారి విరుచుకుపడ్డ ట్రంప్



**న్యూయార్క్(జనంసాక్షి):** తమ దేశం నుంచి వందల బిలియన్ల డాలర్లు తీసుకొన్నా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి కృతజ్ఞత లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి విరుచుకుపడ్డారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చాక్లెట్ లాక్కొన్నంత తేలిగ్గా అమెరికా నుంచి సొమ్మును జెలెన్‌స్కీ తీసుకొన్నట్లు అభివర్ణించారు. "అతను (ఉక్రెయిన్ అధ్యక్షుడు) పసిబిడ్డ నుంచి చాక్లెట్ లాక్కొన్నంత తేలిగ్గా బైడెన్ సర్కారు నుంచి సొమ్ములు తీసుకొన్నారు. ఇక రష్యా విషయంలో అత్యంత కఠినంగా ఉన్న అధ్యక్షుడిని నేను. దాని పైప్‌లైన్ ఆపి ఆంక్షలు విధించాను. జావెలిన్ క్షిపణులు అందజేశాను. కానీ, పుతిన్‌తో కూడా మంచి సంబంధాలున్నాయి.

మిగతా 2లో..

ఫోన్ ట్యాపింగ్ కేసులో..

## తీర్పు వాయిదా

**హైదరాబాద్(జనంసాక్షి):** ఫోన్ ట్యాపింగ్ కేసుపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ముందస్తు బెయిల్ కోరుతూ రాధాకిషన్ రావు దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. తీర్పును కోర్టు వాయిదా వేసింది. గతంలో చక్రధర్‌గౌడ్ ఫిర్యాదుతో ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ఫోన్ ట్యాపింగ్‌పై పంజాగుట్టలో నమోదైన రెండో ఎఫ్‌ఐఆర్‌పై ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని రాధాకిషన్ రావు వేసిన పిటిషన్‌పైన సుదీర్ఘ వాదనల తర్వాత వాదనలు ముగిశాయి.

మిగతా 2లో..

జనంసాక్షి www.janamsakshi.org
మంగళవారం 11.03.2025

## ప్రాధాన్యత క్రమంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

కేవలం ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి సారించి, రాష్ట్రంలో ఉన్న పాత ప్రాజెక్టుల నిర్వహణ అంశాన్ని గాలికి వదిలేయడంతో అవి ప్రమాదంలో పడే పరిస్థితి ఎదురైందని వివరించారు. పాత ప్రాజెక్టులను కాపాడుకునేందుకు మెయింటెనెన్స్ పనులు చేసుకుంటూనే, కేంద్ర నుంచి వివిధ పథకాల ద్వారా నిధులు రాబట్టేందుకు ఉన్న అవకాశాలను త్వరితగతిన పరిశీలించాలని మంత్రులు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక లీగల్ టీం ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని మీడియం, మైనర్ ప్రాజెక్టుల గేట్ల పరమతులు పూర్తి చేయాలని ఆదేశించారు. కాలువలను బలోపేతం చేసుకునే పనులపై దృష్టి పెట్టాలని సూచించారు.గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు అడ్డగోలుగా ఎక్కువ వడ్డీ రేట్లు కు అప్పులు తేవడంతో ఆ భారం ప్రస్తుత ఖజానా నిర్వహణపై పడుతుందని తెలిపారు. గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు 10% వడ్డీ రేటుకు అప్పులు తేగా ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ వడ్డీ రేట్లు 8 శాతానికి తగ్గించేందుకు అధికారులు మంచి ప్రయత్నం చేశారని మంత్రులు తెలిపారు. గృహ జ్యోతి పథకం కింద 500 కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. ఈ పథకం నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా పౌర సరఫరాల శాఖ, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, సాగునీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్య దాస్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా,ఈఎన్సీ జనరల్ అనిల్, స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఆర్& ఆర్ కమిషనర్ విజయ్ కృష్ణారెడ్డి, ఈఎన్సీ విజయ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరవుతారు

**హైదరాబాద్(జనంసాక్షి):**ఈ అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరవుతారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగనున్నాయి. తొలిరోజు ఉభయసభల సభ్యులను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. గవర్నర్ ప్రసంగానికి కెసిఆర్ హాజరవుతారని చెప్పారు. బడ్జెట్ ప్రసంగంలోనూ కేసీఆర్ పాల్గొంటారని వెల్లడించారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్ ఇవాళ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కేటీఆర్.. మీడియాతో చిట్‌చాట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎల్లుండి జరగబోయే అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరవుతారని తెలిపారు. తర్వాత కొన్ని కార్యక్రమాలకు కూడా కేసీఆర్ వస్తారని పేర్కొన్నారు. కానీ కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడమే మంచిదని ఒక కొడుకుగా తన అభిప్రాయమని చెప్పారు. కేసీఆర్ స్థాయికి కాంగ్రెస్‌లో ఎవరూ సరిపోరని అన్నారు. వాళ్ల పిచ్చి మాటలు, పనికిమాలిన దూషణలు, కారుకూతలు వినడానికి కేసీఆర్ రావద్దనేది కొడుకుగా తన అభిప్రాయమని వివరించారు.బీఆర్ఎస్ సభకు వరంగల్ అనువైన ప్రాంతమని కేటీఆర్ తెలిపారు. అన్ని రకాల రవాణా సదుపాయం ఉందని పేర్కొన్నారు. ప్లీనరీ విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. దీనిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున రెండు సభలు పెడితే ఇబ్బంది అని భావించామని తెలిపారు.

## ఎక్కడ చూసినా శవాలగుట్టలే..

ఈక్రమంలో అసద్ మద్దతుదారులను వెతికి మరీ చంపుతున్నట్లు ఓ బాధితుడు వెల్లడించాడు. వీధుల్లో శవాలు పడి ఉన్నాయని.. మగవారిని ఇళ్ల పైకప్పు మీదకు చేర్చి కాల్చేస్తున్నారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. బనియాస్ అనే ప్రాంతంలో రోహిబ్ కమెల్ అనే వ్యక్తి కుటుంబంతో కలిసి బాత్రూమ్‌లో దాక్కొని ప్రాణాలు కాపాడుకొన్నాడు. ఈ విషయాన్ని అతడే ఓ ఆంగ్ల వార్తా సంస్థకు వెల్లడించాడు. "మా పొరుగు వారిపై సాయుధ మిలిటెంట్లు దాడులు చేస్తుండటంతో.. మేము లైట్లు ఆర్పేసి.. దాక్కొన్నాము. వీధుల్లో మృతదేహాలున్నాయి. ఈ పిల్లలు ఏం తప్పు చేశారు. అసద్ పాలన అంతం కావడానికి వీరు కూడా మద్దతు పలికారు" అని కమెల్ వెల్లడించాడు. ఇక సమీర్ హైదర్ అనే బాధితుడు మాట్లాడుతూ తన ఇంటిలోకి సాయుధులు చొచ్చుకొచ్చి తన ఇద్దరు సోదరులు, అల్లుడిని హత్య చేసినట్లు వెల్లడించాడు. వాస్తవానికి అతడు అలావైట్ వర్గానికి చెందినా.. సుదీర్ఘకాలంగా అసద్‌ను వ్యతిరేకిస్తూ వచ్చాడు. దాదాపు పదేళ్లు జైల్లో గడిపాడు.ఇక రేవు నగరమైన లటాకియాలో పరిస్థితి ఘోరంగా ఉంది. అక్కడ ప్రభుత్వ సాంస్కృతిక కేంద్రం అధిపతి యాసిర్ సబౌహ్‌ను గుర్తుతెలియని దుండగులు కాల్చి చంపారు. అతడి ఇంటి ఎదుటే మృతదేహాన్ని పడేశారు. ఈ తీర ప్రాంత నగరంలో అలావైట్లు అత్యధికంగా ఉంటారు. ప్రస్తుతం అక్కడే అత్యధిక హింస చోటుచేసుకుంటోంది.

### పీజీ మెడికల్ రిజర్వేషన్లపై పిటిషన్ .. కొట్టేసిన సుప్రీంకోర్టు

న్యాయ మూర్తి జస్టిస్ వి ఈశ్వరయ్య దాఖలుచేసిన పిల్‌ను సుప్రీం కోర్టు కొట్టేసింది. ఈ పిల్‌ను విచారించిన జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మసీహ్‌లతోకూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. విచారణ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానిస్తూ.. 'పిటిషనర్ ఉద్దేశం మంచిదే అనడంలో ఎలాంటి సందేహం లేదని పేర్కొంది. అయితే కోర్టు నిర్ణయాలతో తీవ్రంగా ప్రభావితమయ్యే ఇతర అభ్యర్థుల వాదనలు వినకుండా ఇలాంటి విషయాలపై నిర్ణయం తీసుకోలేమని స్పష్టం చేసింది. ఆల్ ఇండియా బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్ అధ్యక్షుడి హోదాలో జస్టిస్ ఈశ్వరయ్య ఈ పిల్ వేసినట్లు సమాచారం. పీజీ మెడికల్ అడ్మిషన్లలో మెరిట్ ఆధారంగా సీట్లు పొందిన రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులను ఓపెన్ కేటగిరీలో సీట్లు పొందడానికి అనుమతించకుండా రిజర్వ్‌డ్ కేటగిరీలో ఎంచుకోవాలని నిబంధన విధించారు. దీంతో రిజర్వ్‌డ్ కేటగిరీలో సీట్లు తగ్గిపోతున్నాయని, ఈ నిబంధనను మార్చాలని ఆయన సుప్రీంకోర్టును కోరారు. ఈ అంశాన్ని పరిశీలించిన ధర్మాసనం ఇందులో విభిన్న సంక్లిష్టమైన అంశాలు ఉన్నాయని, ఎవరైనా బాధితులు వ్యక్తిగతంగా కోరితే కోర్టు ఆ విషయాలను పరిగణనలోకి తీసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

## నిధులు అధికంగా ఇచ్చినట్టు నిరూపించండి

మెట్రో ఎక్కడనిధ్వజమెత్తారు. ప్రాజెక్టులు ముందుకెళ్లకుండా అడ్డుకుంటోంది బిజెపి ఎంపిలేనని మండిపడ్డారు. మూసీకి నిధులు తెస్తే కిషన్ రెడ్డికి సన్మానం చేస్తానని రేవంత్ సవాల్ చేశారు. అఖిలపక్ష సమావేశానికి పిలిస్తే కిషన్ రెడ్డి రాలేదని ఆరోపించారు. తెలంగాణకు కావాల్సిన అనేక అంశాలను క్లియర్ చేసుకుని వచ్చానని, కులగణన ప్రభావం వల్లే అన్ని పార్టీలు బిసిలకు టికెట్లు ఇచ్చాయన్నారు. మెట్రో తెచ్చానన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డినే నిధులు అడుగుతున్నాం. ఎన్‌హెచ్ భూసేకరణకు అడ్డుపడుతున్నది ఈటల కాదా? భూసేకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది అని అన్నప్పుడు మాతో కదా చర్చించాలి. కేంద్ర మంత్రులు హైదరాబాద్ వచ్చి సమీక్షలు పెడితే కిషన్ రెడ్డి ఎందుకు రాలేదు. కేసీఆర్ బాధపడుతారని కిషన్‌రెడ్డి రాలేదా? పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సమీక్ష పెడితే ఎందుకు రాలేదు? ఇతర రాష్ట్రాలకు ఇచ్చిన ప్రాజెక్టులు తెలంగాణకు ఎందుకు ఇవ్వలేదు. హైదరాబాద్ అభివృద్ధిని ఇతర ప్రాంతాలకు విస్తరించాలని మేం భావిస్తున్నాం. రాష్ట్రానికి నిధులు రాకూడదని భారాస చూస్తోంది. రాష్ట్రాభివృద్ధి, కేంద్ర నిధులపై చర్చకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సిద్ధం కావాలి. చర్చకు నేను, భట్టి విక్రమార్క రావడానికి సిద్ధంగా ఉన్నాం. అధిక నిధులు ఇచ్చినట్లు నిరూపిస్తే కిషన్‌రెడ్డికి సన్మానం చేస్తాం అని అన్నారు. భారాస హయాంలో పదేళ్లలో ప్రాజెక్టులు కట్టిఉంటే.. ఇప్పుడు ఏపీతో సమస్య వచ్చేది కాదు. మందకృష్ణ మాదిగ అంటే నాకు గౌరవం ఉంది. పోటీ పరీక్షల ఫలితాలకు.. రిజర్వేషన్లకు ఎలాంటి సంబంధం లేదు. మందకృష్ణ భాజపా నేతలా మాట్లాడితే ఎలా? గతంలో ఎప్పుడో వచ్చిన నోటిఫికేషన్లకు ఎస్సీ వర్గకరణ అంశం వర్తించదు. ఏదైనా చేయాలని చూస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయి. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏం మాట్లాడుతున్నారో నాకు తెలియదు. కేటీఆర్, కిషన్‌రెడ్డి కలిసి తిరుగుతున్నారని నేను చెబుతున్నా' అని సీఎం పేర్కొన్నారు. అఖిల పక్ష సమావేశానికి పిలిస్తే కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సికింద్రాబాద్‌లో ఉండి కూడా రాలేదని.. కేసీఆర్ బాధపడుతారని కేంద్రమంత్రి సహకరించడం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సబర్మతి, యమునా, గంగా ప్రక్షాళనకు నిధులు ఇస్తున్న కేంద్రం మూసీకి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కుల గణన ప్రభావమే అన్ని పార్టీలు బీసీలకు టికెట్లు ఇచ్చాయన్నారు. హరీష్ రావు మోసం వల్లే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓడిపోయామని విమర్శించారు.'నేను రాష్ట్ర ముఖ్యమంత్రిని. కేసీఆర్‌ను ఓడించింది నేను. కేసీఆర్‌ను గుండుసున్నా చేసింది నేను. కేసీఆర్‌ను బండకేసి కొట్టింది నేను. అడ్డగోలుగా మాట్లాడడంలో కేసీఆర్‌కు మించినవాళ్ళు ఎవరున్నారు.కేటీఆర్ స్థాయి ఏంటి. కేసీఆర్‌కు బలుపు తప్ప ఏముంది. తండ్రీ కొడుకులకు బలుపు తప్పా ఏముంది.అసెంబ్లీలో అధికారపక్షం కంటే ప్రతిపక్షానికి ఎక్కువ సమయం ఇస్తున్నాం' అని ముఖ్యమంత్రి అన్నారు. ప్రతిపక్షం లేని రాజకీయాలు చేయాలని తాము అనుకోవడం లేదన్నారు. వాళ్ళు మూసేసిన ధర్నా చౌక్ మేం తెరిచామన్నారు. విమర్శలు చేస్తే పరిశీలించుకుంటామని.. సలహాలు ఇస్తే తప్పకుండా స్వీకరిస్తామని వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వీలైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు. జీతభత్యాలు తీసుకొని పని చేయని వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. పార్టీ నిర్ణయాలు ప్రెసిడెంట్ తీసుకుంటారని.. అభ్యర్థుల ఎంపిక విషయంలో పూర్తి స్వేచ్ఛ పార్టీ అధ్యక్షుడికి ఉంటుందని తెలిపారు. పదేండ్లలో అప్పులు, తప్పులు తప్పా కేసీఆర్ ఏం చేయలేదన్నారు. అప్పుల విషయంలో కేసీఆర్ తప్పుడు లెక్కలు చూపెట్టారని దుయ్యబట్టారు. కేసీఆర్ చేసిన అప్పులు, తప్పులు కాగ్ రిపోర్ట్ అసెంబ్లీలో బయట పెడుతామన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు దుర్మార్గులని మండిపడ్డారు. తెలంగాణలో శవాలు లేస్తున్నాయని తెలియగానే తీన్మార్ డాన్సులు చేస్తున్నారని.. పంటలు ఎండితే ప్రతిపక్షాలు సంతోష పడుతున్నాయని విమర్శించారు. ప్రజలు ఇబ్బందులు పడితే బాధపడాలని.. ఇంత దుర్మార్గులు ప్రపంచంలో ఎవరైనా ఉంటారా అని అన్నారు. రోజమ్మ పెట్టిన రొయ్యల పులుసు తిన్నది ఎవరని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రాజెక్టులు పూర్తి చేస్తే ఈ తలనొప్పులు ఉండకపోయేదన్నారు. ప్రగతి భవన్‌కు పిలిచి పంచభక్ష పరమాన్నాలు పెట్టింది ఎవరన్నారు.

## నామినేషన్లు షురూ..

దాఖలు చేశారు. సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శాసనసభలో ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని బట్టి కాంగ్రెస్‌కు 4, భారాసకు ఒకటి దక్కనున్నాయి. తమకు వచ్చే నాలుగులో ఒక సీటును పొత్తు ధర్మం ప్రకారం సీపీఐకి హస్తం పార్టీ కేటాయించింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో సీపీఐతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుని కొత్తగూడెం సీటును కేటాయించింది. అప్పుడు తమకు రెండు అసెంబ్లీ సీట్లు ఇవ్వాలని సీపీఐ పట్టుబట్టింది. కానీ కొత్తగూడెం ఒకటే ఇచ్చి భవిష్యత్తులో ఎమ్మెల్సీ సీటు ఇస్తామని కాంగ్రెస్ సీపీఐకి హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే తాజాగా సీటును కేటాయించింది. ఇకపోతే బిఆర్ఎస్ నుంచి దాసోజ్ శ్రవణ్ నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట కెటిఆర్, హరీష్ రావు, తలసాని శ్రీనివాసయాదవ్ తదితరులు వచ్చారు. మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి తదితరులు కూడా హాజరయ్యారు. దాసోజు గతంలో గవర్నర్ కోటాలో నియిమితులయినా గవర్నర్ ఆలస్యంతో ఆగిపోయింది.ఐదుసీట్లకు ఐదుగురే నామినేషన్లు వేయడంతో ఏకగ్రీవం కానున్నాయి. ఎన్నికలు నిర్వహించే అవకాశం రాకపోవచ్చు. ఇదిలావుంటే అసెంబ్లీలో ప్రస్తుతమున్న ఎమ్మెల్యేల బలం ప్రకారం కాంగ్రెస్ పార్టీకి 4 ఎమ్మెల్సీ సీట్లు దక్కనున్నాయి. అయితే పొత్తులో భాగంగా ఒక ఎమ్మెల్సీ సీటును సీపీఐకి కేటాయించింది. ఒక్క ఎమ్మెల్సీకి 21 మంది ఎమ్మెల్యేల ఓట్లు అవసరం. ఇదిలా ఉంటే.. ఎమ్మెల్సీ టికెట్ మాజీ ఎంపీ విజయశాంతికి దక్కడం చర్చనీయాంశంగా మారింది. తొలి నుంచి ఎమ్మెల్సీ రేసులో రాములమ్మ పేరు లేదు. చివర్లో అనూహ్యంగా ఆమె పేరు తెరపైకి వచ్చింది. విజయశాంతి నేరుగా ఢిల్లీలోనే పార్టీ అగ్రనేతలతో చర్చలు జరిపి ఎమ్మెల్సీ టికెట్ సాధించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ కోసం టికెట్ త్యాగం చేసిన వారికి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలో పార్టీ హైకమాండ్ ప్రియారిటీ ఇచ్చింది. పార్టీ ఆదేశాల మేరకు అద్దంకి దయాకర్ తుంగతుర్తి అసెంబ్లీ టికెట్ వదులుకోగా.. విజయ శాంతి మెదక్ ఎంపీ టికెట్ రేసు నుంచి తప్పుకున్నారు. ఈ క్రమంలోనే వీరి త్యాగాలను గుర్తించిన అధిష్టానం.. ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చింది. సీపీఐ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నెల్లికంటి సత్యంను ఆ పార్టీ ప్రకటించింది. రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించిన తర్వాత ఆయన పేరును రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రకటించారు.ప్రస్తుతం సీపీఐ నల్గొండ జిల్లా కార్యదర్శిగా, పార్టీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడిగా ఉన్నారు. సత్యం పేరును ఆ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి పల్లా వెంకట్‌రెడ్డి ప్రతిపాదించినట్లు సమాచారం. సీనియర్‌నేత చాడ వెంకట్‌రెడ్డి పేరునూ ప్రతిపాదించగా.. తాను పోటీలో ఉండటం లేదని ఆయన ప్రకటించారు. దీంతో సత్యం పేరును సీపీఐ రాష్ట్ర కార్యవర్గం ఖరారు చేసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మునుగోడు స్థానంలో పోటీ చేయాల్సిందేనని సీపీఐ నల్గొండ జిల్లా నాయకత్వం పట్టుబట్టింది. పొత్తులో భాగంగా కాంగ్రెస్ కొత్తగూడెం స్థానాన్ని కేటాయించిందని వివరిస్తూ భవిష్యత్తులో వచ్చే ఎమ్మెల్సీ స్థానాన్ని ఇస్తామని

## ప్రణయ్ హత్య కేసులో నల్గొండ కోర్టు సంచలన తీర్పు

శిక్ష విధించింది. శిక్ష తగ్గించాలని న్యాయమూర్తిని ఈ సందర్భంగా నేరస్తులు వేడుకున్నారు. హార్ట్ పేషెంట్, కుటుంబ సభ్యుల ఆరోగ్యం, చిన్న పిల్లలు ఉన్నారని కొందరు నేరస్తులు న్యాయ స్థానానికి తెలిపారు. ఉగ్రవాది అస్గర్ అలీకి సుపారీ.. అయితే ఏ2 సుభాష్ శర్మకు నల్గొండ కోర్టు ఉరిశిక్ష విధించింది. ప్రణయ్ హత్యలో సుభాష్ శర్మ కీలకపాత్ర పోషించాడు. సుభాష్ శర్మకు ఉరిశిక్ష విధిస్తూ నల్గొండ కోర్టు తీర్పు వెలువరించింది. ఇప్పటికే జైల్లో ముగ్గురు నిందితులు శిక్ష అనుభవిస్తున్నారు. ఉగ్రవాది అస్గర్ అలీకి సుపారీ ఇచ్చి ప్రణయ్‌ను అమృత తండ్రి హత్య చేయించాడు. ఏడుగురితో ఓ గ్యాంగ్‌ను అస్గర్ అలీ ఏర్పాటు చేశాడు. గుజరాత్ మాజీ హోంమంత్రి హరెన్ పాండ్యా హత్య కేసులో నిందితులతో కలిపి అస్గర్ అలీ గ్యాంగ్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కాగా.. పెరుమాళ్ల ప్రణయ్ హత్యకేసులో నల్లగొండ ఎస్సీ, ఎస్టీ జిల్లా సెషన్‌కోర్టు కీలక తీర్పు వెలువరించింది. 2018 సెప్టెంబర్ 14వ తేదీన హత్యకు ప్రణయ్ గురయ్యాడు. గర్భవతిగా ఉన్న భార్య అమృతను నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని ఆస్పత్రికి తీసుకువెళ్లి.. తిరిగి వస్తుండగా.. దుండగులు ప్రణయ్‌పై కత్తులతో దాడి చేసి హతమార్చారు. తన కూతురిని కులాంతర వివాహం చేసుకున్నాడనే కక్షతో సుఫారీ గ్యాంగ్‌తో ప్రణయ్‌ను మారుతీరావు హత్య చేయించాడు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసుశాఖ అన్ని కోణాల్లో విచారణ పూర్తిచేసి 1600పేజీల్లో చార్జిషీట్ నివేదికను రూపొందించింది.

### గ్రూప్ 1 ఫలితాల విడుదల

మార్కుల వివరాలను తాజాగా అభ్యర్థుల లాగిన్‌లలో అందుబాటులో ఉంచారు. ఈ మార్కులను మార్చి 16 సాయంత్రం 5గంటల వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు మెయిన్స్‌లో సాధించిన మార్కుల షీట్‌లను డౌన్‌లోడ్ చేసుకొని రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పూర్తయ్యే వరకు దాచి ఉంచాలని టీజీపీఎస్సీ సూచించింది.మరోవైపు, అభ్యర్థులకు తమ మార్కుల రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించింది. అభ్యర్థులు టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో మార్చి 10 నుంచి 24వ తేదీ సాయంత్రం 5గంటల వరకు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి మార్కుల రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికోసం కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రీకౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత అభ్యర్థులందరి మొత్తం మార్కులను కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచుతారు. తుది జనరల్ ర్యాంకింగ్స్ జాబితాను విడుదల చేసి.. దాని ఆధారంగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలవనున్నారు. నోటిఫికేషన్‌లో సూచించినట్లుగా అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఇతర డాక్యుమెంట్లు సిద్ధంగా ఉంచుకోవాలని టీజీపీఎస్సీ సూచించింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో తీర్పు వాయిదా

తీర్పును న్యాయస్థానం వాయిదా వేసింది. చక్రధర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాధాకిషన్‌రావుతో పాటు మాజీ మంత్రి హరీష్ రావు సహా పలువురిపై కేసు నమోదు అయ్యింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ రాధాకిషన్ రావు తన వాదనలు వినిపించారు.

## జెలెన్‌స్కీకి కొంచెమైనా కృతజ్ఞత లేదు

రష్యా విషయంలో నన్ను మించి కఠినంగా ఎవరూ లేరు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.మరోవైపు ఉక్రెయిన్ వీలైనంత తొందరగా యుద్ధం ముగించాలన్న ఒత్తిళ్లు డోజ్ సారథి మస్క్ వైపు నుంచి కూడా పెరిగాయి. తాజాగా తాను స్టార్ లింక్ ఇంటర్నెట్ సేవలను నిలిపేస్తే కీవ్ సేనలు కుప్పకూలుతాయని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో ఉక్రెయిన్ ఓటమి అనివార్యమని వ్యాఖ్యానించారు. వాస్తవికతతో ఆలోచించేవారు, అర్థం చేసుకునేవారు ఎవరైనా ఈ యుద్ధాన్ని ఆపాలని కోరుకుంటారని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత ట్రంప్ తాజా కామెంట్లు రావడం గమనార్హం.ఇటీవల ఖనిజాల ఒప్పందం కోసం అమెరికాలోని శ్వేతసౌధానికి వచ్చిన జెలెన్‌స్కీ అక్కడ వాగ్వాదం జరగడంతో సంతకాలు చేయకుండానే వెళ్లిపోయారు. .ఇటీవల ఖనిజాల ఒప్పందం కోసం అమెరికాలోని శ్వేతసౌధానికి వచ్చిన జెలెన్‌స్కీ అక్కడ వాగ్వాదం జరగడంతో సంతకాలు చేయకుండానే వెళ్లిపోయారు. ఆ తర్వాత అమెరికా నుంచి కీవ్‌కు సైనిక, ఇంటెలిజెన్స్ సాయాలు నిలిచిపోయాయి. మరోవైపు ఇదే అదునుగా రష్యా దాడులను తీవ్రతరం చేసింది.ఇక ట్రంప్ తొలిసారి అధికారంలో ఉన్న సమయంలో రష్యా గ్యాస్ పైప్‌లైన్‌పై ఆంక్షలు విధించారు. వాస్తవానికి దీనినుంచి ఐరోపాలోని జర్మనీకి గ్యాస్ సరఫరా అవుతుంది.

## పంటల పరిరక్షణే ప్రభుత్వ కర్తవ్యం

### వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్,తుమ్మల

**హైదరాబాద్(జనంసాక్షి):**చేతికొచ్చిన పంటను కాపాడడం రాష్ట్ర ప్రభుత్వ కర్తవ్యమని మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.సాగునీటి విషయంలో అసత్య ప్రచారాలు ఎక్కువ ఔతున్నాయని ఈ విషయంలో నీటిపారుదల శాఖాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ వాస్తవాలను ప్రజలకు సోదాహరణంగా వివరించాలని ఆయన అధికారులను ఆదేశించారుసోమవారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయం నుండి సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి,రాష్ట్ర వ్యవసాయ శాఖా కార్యదర్శి రఘునందన్ రావు టి.ఎస్.ఎస్.పి.డి.సి.ఎల్ సి.యం.డి ముషారఫ్ తదితరులతో కలసి రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లు,ఎస్.పిలు,వ్యవసాయ శాఖాధికారులు ,విద్యుత్ శాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారుఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్ పంట మరో 15 రోజుల్లో చేతికి రానున్నందున



ఆయా జిల్లాల అధికారులు సమన్వయంతో కలసి క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ రైతాంగానికి తోడ్పాటు నందించాలని ఆయన సూచించారుయాసంగి పంటకు సాగు నీరు చివరికంటూ అందించేందుకు నీటిపారుదల శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో ఇప్పటి వరకు ఎటువంటి అవాంతారాలు లేవని ఆయన ప్రకటించారు.కాలువల నీటి సరఫరా అంశంలో ఎప్పటికప్పుడు విద్యుత్ శాఖాధికారుల సహా కారాన్ని తీసుకోవాలన్నారువ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో నిజ నిజాలు తెలుసుకోకుండా పంట నష్టం గురించి జరుగుతున్న ప్రచారం సత్య దూరమన్నారు.బోర్లు ఎండి పోవడమో,మోటార్లు కాలి పోవడం వంటి పరిణామాలతో పంట నష్టం జరుగుతుందంటూ జరుగుతున్న అసత్య ప్రచారాన్ని రాజకీయంగా వినియోగించుకునేందుకు కొన్ని శక్తులు రంగంలోకి దిగాయన్నారు.ఇటువంటి విషయంలో అధికారులు తక్షణమే రంగంలోకి దిగి నివారణ చర్యలు చేపట్టాలన్నారుప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం రబీ పంట విషయంలో ప్రభుత్వ యంత్రాంగాన్నిఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూనే వీడియో కాన్ఫరెన్స్ ల ద్వారా సమగ్ర సమాచారం తెప్పిస్తున్నామన్నారు.అందులో భాగంగానే నీటిపారుదల శాఖతో సమన్వయం చేసుకుని అన్నపూర్ణ సాగర్ నుండి రంగనాయక సాగర్ కు 1.5 టి.యం.సి నీటిని విడుదల చేయడంతో పాటు పంప్ హౌజ్ ల మరమ్మతులు చేపట్టినట్లు ఆమె వివరించారు.

## భారత్‌తో దెబ్బతిన్న సంబంధాలు బలపరుచుకుంటాం

హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనక భారత్ ఏజెంట్ల హస్తం ఉండొచ్చని చేసిన వ్యాఖ్యలు ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు రాజేశాయి. భారత్ వెంటనే వాటిని తిప్పికొట్టింది. అనంతరం ఇరుదేశాలు పరస్పరం దౌత్యవేత్తలను తిప్పి పంపివేశాయి. ఆ క్రమంలోనే వరసగా జరిగిన కొన్ని పరిణామాలతో ఉభయదేశాల దౌత్య, వాణిజ్య సంబంధాలు క్షీణించాయి. ఈనేపథ్యంలో కెనడాకు నూతన ప్రధానిగా అధికార లిబరల్ పార్టీ నేత మార్క్ కార్నీ ఎన్నికవ్వడం.. ఆయన భారత్‌కు అనుకూలంగా ఉండడంతో భవిష్యత్తులో ఇరుదేశాల మధ్య సంబంధాలు మెరుగయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కెనడాలో అధికార లిబరల్ పార్టీ నేతగా మార్క్ కార్నీ ఎన్నికయ్యారు. దీంతో తదుపరి ప్రధానిగా ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఓ మీడియా సమావేశంలో ప్రసంగిస్తూ.. కెనడాను తమ దేశంలో 51వ రాష్ట్రంగా చేర్చుకుంటామని పలు సందర్భాల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన బెదిరింపులపై స్పందించారు. ఒట్టావా ఏవిధంగానూ.. ఏరూపంలోనూ అమెరికాలో భాగం కాదని ఆయన వ్యాఖ్యానించారు. తమ దేశం అప్పటికీ, ఇప్పటికీ బలంగా ఉందన్నారు. వాణిజ్యం అయినా, క్రీడలు అయినా చివరికి విజయం సాధించేది కెనడాయేనని అని పేర్కొన్నారు. "కెనడాను తమలో కలుపుకొని.. దేశంలో ఉన్న వనరులు, నీరు, భూమి వంటి వాటిని తమ స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతో అగ్రరాజ్యం ఉంది. ఈ విషయంలో వారు విజయం సాధిస్తే, మన జీవన విధానాన్ని పూర్తిగా నాశనం చేస్తారు. కాబట్టి ట్రంప్‌ను ఎప్పటికీ ఈ విషయంలో విజయం సాధించనివ్వను.

## అటవీ సంపదను దోచుకునేందుకే ఆపరేషన్ కగార్

వారు శత్రువుకు లొంగిపోతారని మావోయిస్టులు తెలిపారు. త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని 'ఆపరేషన్ కగార్' యుద్ధాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. సౌత్ సబ్ జోనల్ బ్యూరో పేరుతో మావోయిస్టులు లేఖ విడుదల చేశారు. కాగా.. దండకారణ్యం, ఛత్తీస్‌గఢ్ అడవుల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని గత కొంత కాలంగా మావోయిస్టులు కోరుతున్న విషయం తెలిసిందే. దండకారణ్యంలో ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టులను, ఆదివాసీలను కేంద్ర ప్రభుత్వం హత మారుస్తోందని, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని మావోయిస్టులు డిమాండ్ చేశారు. ఆదివాసీలను లేకుండా చేసి అడవుల్లో ఉన్న అపారమైన ఖనిజ సంపదను బహుళజాతి సంస్థలకు అమ్ముకోవడానికి కేంద్ర ప్రభుత్వం చూస్తోందని, దీనిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

జరుగుతున్నాయని పేర్కొన్నారు. "ఓటరు జాబితాపై దేశవ్యాప్తంగా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ జాబితాపై చర్చలు జరగాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి" అని కాంగ్రెస్ అగ్రనేత పేర్కొన్నారు.డీలిమిటేషన్ అంశంపై సోమవారం పార్లమెంట్ ఆవరణలో డిఎంకె నిరసన చేపట్టింది. డిఎంకె తిరుచ్చి శివ సహా పలువురు ఇతర పార్టీల ఎంపిలు ఈ నిరసనలో పాల్గొన్నారు. ఆందోళనలో భాగంగా తిరుచ్చి శివ మీడియాతో మాట్లాడారు. డీలిమిటేషన్ పక్రియకు బదులుగా ప్రత్యామ్నాయాన్ని చేపట్టాలని కేంద్రాన్ని అభ్యర్థించారు. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలపై తీవ్ర ప్రభావం పడుతుందని మండిపడ్డారు.రాజ్యాంగం ప్రకారం.. జనాభా ఆధారంగా డీలిమిటేషన్ కసరత్తు 2026లో జరగనుందని అన్నారు. 42వ సవరణ మరియు 84వ సవరణల ప్రకారం.. జనాభా నియంత్రణ పురోగతిని పరిగణించాల్సి వున్నందున 25 సంవత్సరాల తర్వాత చేపట్టాలని నిర్ణయించారని అన్నారు. ఆ ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే.. తమిళనాడు సహా అన్ని దక్షిణాది రాష్ట్రాలు ప్రతికూలంగా ప్రభావితమవుతాయని పునరుద్ఘాటించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాన్ని రూపొందించాలని అభ్యర్థిస్తున్నామని అన్నారు. జనాభా ఆధారంగా డీలిమిటేషన్ చేపడితే తమిళనాడు సహా పలు రాష్ట్రాలు చాలా సీట్లను కోల్పోవలసి వుంటుందని అన్నారు. తమిళనాడు 39 సీట్ల నుండి 31కి, కేరళ 20 నుండి 12కి పడిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు 30 నుండి 40కి పెరుగుతాయని, దీంతో పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాలు సమాన ప్రాతినిధ్యాన్ని కోల్పోతాయని అన్నారు.జాతీయ విద్యా విధానంపై ఆందోళన.. లోక్‌సభలో డీఎంకే లబ భాజపా కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానాన్ని తమిళనాడు అధికార పార్టీ డీఎంకే వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ అంశాన్ని లోక్‌సభలో డీఎంకే ఎంపీలు లేవనెత్తడంతో గందరగోళ వాతావరణం నెలకొంది. ఎంపీల చర్యపై స్పందించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మండిపడ్డారు. దీంతో స్పీకర్ ఓం బిర్లా సభను వాయిదా వేసి.. తిరిగి ప్రారంభించారు.కొత్త విద్యా విధానాన్ని తమిళనాడులో అమలుచేయడంపై డీఎంకే ఎంపీలు నిరసిస్తూ వెల్ వైపు వెళ్లడంతో కేంద్రమంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. జాతీయ విద్యావిధానంపై చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. "విద్యార్థుల భవిష్యత్తుతో డీఎంకే చెలగాటమాడుతోంది. వారంతా నిజాయతీ లేనివారు. విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఇచ్చేందుకు డీఎంకే సిద్ధంగా లేదు. భాష పరమైన వివాదాలు సృష్టించడమే వారు పనిగా పెట్టుకున్నట్లున్నారు. రాజకీయాలు చేస్తున్నారు. వారి చర్యలు ప్రజాస్వామ్య వ్యతిరేకం" అని ఆరోపించారు.

## తెలంగాణలో కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయ్

ఈ నెల 16వ తేదీన అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టి.. 17వ తేదీన తనకు నోటీసులు ఇస్తారని అన్నారు. తనను విచారణకు పిలిచి నాటకాలు ఆడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్ రేసు ముమ్మాటికీ లొట్టపీసు కేసే అని పునరుద్ఘాటించారు. ఫార్ములా ఈ కార్ రేసుకు రూ.45 కోట్లు ఖర్చు చేస్తే తప్పు అని అన్నారని కేటీఆర్ అన్నారు. మరి అందాల పోటీలకు రూ.200 ఖర్చు ఎలా చేస్తారని ప్రశ్నించారు. మిస్ వరల్డ్ పోటీలతో రాష్ట్రానికి ఏం లాభం వస్తుందని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. ఈ మొగోడు ఒలింపిక్స్ పెడతానంటున్నాడని.. అందుకు రూ.లక్ష కోట్లు అవసరమవుతాయని తెలిపారు. బీసీలపై అంత ప్రేమ ఉంటే ఢిల్లీలో జంతర్ మంతర్‌లో కూర్చొని ఆమరణ దీక్ష చేయాలని రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.
రేవంత్‌రెడ్డి వల్లే కోవర్టుల టాపిక్ తెచ్చిన రాహుల్
రేవంత్‌రెడ్డికి ఢిల్లీలో పనిపోయిందని.. అక్కడ ఎవరూ రేవంత్‌రెడ్డిని ఖాతరు చేయడం లేదని.. ఆయన గురించి తెలిసినందువల్లే రాహుల్‌గాంధీ కోవర్టుల టాపిక్ తీసుకొచ్చారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్ సోమవారం ఉదయం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కేటీఆర్ , హరీష్ రావు పాల్గొన్నారు. అనంతరం కేటీఆర్ మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. దాసోజు శ్రవణ్‌ను గతంలోనే టీఆర్ఎస్ ప్రతిపాదించిందని.. 2023లో అప్పుడు బీజేపీ ఆపిందన్నారు. ఆయన గతంలో టీఆర్ఎస్‌ను వీడకపోతే ఎప్పుడో ఎమ్మెల్సీ అయ్యేవారని అన్నారు. పట్టుబట్టి బీజేపీ ఆపిందని... ఇప్పుడు వారు ఆపినప్పటికీ దాసోజుకు బీఆర్ఎస్ అవకాశం ఇచ్చిందని మాజీ మంత్రి అన్నారు. రేవంత్ రెడ్డిది ఢిల్లీలో ఏమీ నడుస్తలేదన్నారు. సాక్షాత్తు రాహుల్ గాంధీ గుజరాత్‌లో రేవంత్‌ను ఉద్దేశించి తమ పార్టీలో బీజేపీకి కోవర్టులు ఉన్నారని అన్నారన్నారు. రేవంత్ జుట్టు ఢిల్లీలో ఉందని.. ఆయన స్థానంలో ఎవరు ఉన్నా అదే పరిస్థితి ఏర్పడుతుందన్నారు.. 'ఒక లీడర్‌గా , మాజీ మంత్రిగా, కేసీఆర్ బిడ్డగా, ఆయన అభిమానిగా.. నా వ్యక్తిగత అభిప్రాయం మేరకు ఈ చిల్లర గాళ్ళ ముందుకు రావాల్సిన అవసరం లేదు. కేసీఆర్ వస్తారా లేదా అన్నది ఆయన వ్యక్తిగతం' అని చెప్పుకొచ్చారు. త్వరలో తెలంగాణాలో పది ఉప ఎన్నికలు రాబోతున్నాయని సంచలన ప్రకటన చేశారు. తమకు ఈ మేరకు సమాచారం ఉందన్నారు. అందులో భాగంగానే ఎమ్మెల్సీ ఎన్ని కలకు దూరంగా ఉన్నామన్నారు. బీజేపీ సోషల్ మీడియాలో ఎక్కువ.. సొసైటీలో తక్కువ అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణాలో ఆర్‌ఆర్‌టాక్స్ నడుస్తోందన్న మోడీ ఎందుకు విచారణ చేయలేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డిమీద మోడీకి ఎందుకు అంత ప్రేమ అని నిలదీశారు. కిషన్ రెడ్డి నిస్సహాయుడన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై తమ పార్టీ పునరాలోచనలో పడిందని

# నేనెవరి సింపతీ మీద రాజకీయాల్లోకి రాలేదు

- రాజకీయంగా ఫైట్ చేస్తా
- త్వరలో సినిమాల్లో కూడా నటిస్తున్నా : జగ్గారెడ్డి




**హైదరాబాద్, మార్చి 10 (జనంసాక్షి) :** తాను సింపతీ మీద రాజకీయాల్లోకి రాలేదని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు. సోమవారం ఢిల్లీలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... రాజకీయాల్లో ఫైట్ చేస్తానని.. త్వరలో సినిమాల్లోకి రానున్నట్లు ప్రకటించారు. అతి త్వరలో ఒక ప్రేమ కథ చిత్రంలో ప్రత్యేక పాత్ర పోషించనున్నట్లు ఆఫ్ ది రికార్డ్‌లో ఆయన వెల్లడించారు. సినిమాలో మాఫియాను ఎదురించి ఆడపిల్ల పెళ్ళి చేసే వ్యక్తి అతనే జగ్గారెడ్డి అని అన్నారు. ఈ మధ్య కాలంలో ఓ వ్యక్తి తన దగ్గరకు వచ్చి ఒక కథ ఉంది అని చెప్పారన్నారు. 'ఆ కథలో మీ పాత్ర ఉందని అన్నారు. ఆ సినిమాలో నటిస్తా అని చెప్పాను. ఈ కథలో నా ఒరిజినల్ క్యారక్టర్ కూడా ఉండబోతుంది. ఈ ఉగాదికి సినిమా కథ విని.. వచ్చే ఉగాదికి సినిమా పూర్తి చేస్తాం. పీసీసీ, సీఎం అనుమతి తీసుకొని నటిస్తాను' అని వెల్లడించారు. ఇక సినిమా పేరును కూడా ప్రకటించేశారు జగ్గారెడ్డి. అదే 'జగ్గారెడ్డి...వార్ ఆఫ్ లవ్' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు తెలిపారు. ఇక రాజకీయ అంశాలపై మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక చూసి మైండ్ బ్లాక్ అయిందన్నారు. తాను రాజకీయంగా షాక్‌లో ఉన్నట్లు తెలిపారు. తన షాక్‌కు కాలం సమాధానం చెబుతుందన్నారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు జట్టి కుసుము అని తెలిపారు. అనుకోకుండా ఢిల్లీకి తెలంగాణ నుంచి నేతలు రాలేదన్నారు. 2017లో రాహుల్ గాంధీ సంగారెడ్డి సభను తానే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాటి కష్టాలు పరిణామాలు చెప్పాలని అనుకున్నానని.. దానిపై రాహుల్ గాంధీని కలిసేందుకు ఢిల్లీకి వచ్చినట్లు వెల్లడించారు. రాహుల్ గాంధీని సమయం అడిగానని అన్నారు. కుసుమకు ఎమ్మెల్సీ ఇవ్వాలని పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, డిప్యూటీసీఎ భట్టి విక్రమార్కకు చెప్పానన్నారు. తాను ఢిల్లీకి వచ్చి కుసుమ అంశం మాట్లాడాలని అనుకున్నానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ అంశాన్ని ముందే చెప్పినట్లు తెలిపారు. తాను ఢిల్లీకి వచ్చినప్పుడు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ,కేసీ వేణుగోపాల్ లేరని జగ్గారెడ్డి వెల్లడించారు.

# సిపిఐలోనూ సామాజిక న్యాయం!

(ఎండి.మునీర్, ప్రత్యేక ప్రతినిధి, జనంసాక్షి)



సీపీఐ ఈ ఒక్క ఎమ్మెల్సీ పదవికి నెల్లికంటి సత్యం పేరును ఖరారు చేసి బీసీ సామాజిక వర్గంపై, పార్టీలో కమిట్మెంట్‌తో పని చేసే వారికి గౌరవం కల్పించింది. ఉన్న ఒక్క ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కమ్మ కాబట్టి, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకట్ రెడ్డికి ఎమ్మెల్సీ ఇస్తే అది కూడా అగ్ర కులాలకు ఇచ్చినట్లు అవుతుందని కూడా పార్టీ ఆలోచించినట్లు ఉంది. సీపీఐలో నెల్లికంటికి ఎమ్మెల్సీ ఇవ్వడంతో హర్షం వ్యక్తమవుతోంది. అయితే అనేక మంది సీనియర్ నేతలున్నప్పటికీ నెల్లికంటి సత్యం పేరు ఎమ్మెల్సీగా ఖరారు చేయడంతో అందరూ ఆయన ఎవరన్నది గూగుల్‌లో సెర్చ్ చేస్తున్నారు. అయితే సీపీఐతో నెల్లికంటి సత్యానికి సుదీర్ఘ అనుబంధం ఉంది. అయితే దీంతో పాటు ఆయన పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ నల్లగొండ జిల్లాలో పార్టీ బలోపేతానికి నెల్లికంటి సత్యం కృషి చేశారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ఉన్నత విద్యను చదివి...నల్లగొండ జిల్లాకు చెందిన నెల్లికంటి సత్యం ఉన్నతవిద్యను చదివారు. పొలిటికల్ సైన్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సు పూర్తి చేశారు. ఆయన బీసీ సామాజికవర్గానికి చెందిన నేత. 1985 నుంచి సీపీఐలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. 1985 నుంచి 2000 సంవత్సరం వరకూ ఏఐవైఎఫ్ నల్లగొండ జిల్లా కార్యదర్శిగా, అధ్యక్షుడిగా వివిధ హోదాల్లో పనిచేశారు. ఎన్నో విద్యార్థి ఉద్యమాలను నిర్వహించారు. తర్వాత 2010 నుంచి 2016 వరకూ మునుగోడు మండల కార్యదర్శిగా కూడా పనిచేశారు. 2020 నుంచి జిల్లా కార్యదర్శిగా కూడా పనిచేసిన నెల్లికంటి సత్యం పార్టీ ఆదేశాలను తూచ తప్పకుండా అమలు చేస్తూ నల్లగొండ జిల్లాలో ఏ కార్యక్రమం జరిగినా విజయవంతంగా జరపడంలో సక్సెస్ అయ్యారు. మునుగోడు ఎన్నిక సమయంలో...అయితే నెల్లికంటి సత్యం 2023 ఎన్నికల్లో మునుగోడు నుంచి పోటీ చేయాలని భావించారు. కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా అక్కడ పోటీ చేయాలని ఆదేశించింది. దానికి నెల్లికంటి సత్యం సిద్ధమవుతున్న సమయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు కొత్త గూడెం స్థానం దక్కడంతో ఇక మునుగోడు నుంచి నెల్లికంటి సత్యం తప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో నెల్లికంటి సత్యానికి అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇచ్చిన అధినాయకత్వం ఈ మేరకు అవకాశం ఇచ్చింది అని కూడ అంటున్నారు. మొత్తానికి ఇక సిపిఐ, కాంగ్రెస్ తెలంగాణ లో హమ్ సాత్ సాత్ అనే పరిస్థితి ఏర్పడింది!

# బొగ్గు గనుల వేలంలో బిఎంఎస్ చెప్పిందే నిజమైంది!

- నాడు వేలంపాటు వద్దని తప్పు చేసిన సంఘాలు కార్మికులకు క్షమాపణ చెప్పాలి

(ప్రత్యేక ప్రతినిధి/ జనం సాక్షి)



రాజకీయ ప్రేరేపితంగా ఎఐటియుసి, ఐఎన్టియుసి కార్మిక సంఘాలు కేసిఆర్ ప్రభుత్వంతో కలిసి సింగరేణి యాజమాన్యాన్ని వేలంలో పాల్గొనకుండా అడ్డుకోవడం వల్ల సింగరేణి సంస్థ గత ఐదు సంవత్సరాలుగా భారీగా నష్టం జరిగిందని బిఎంఎస్ నాయకులు ఆరోపించారు. ప్రతి ఏడాది 5000 కోట్ల టర్నోవర్ నష్టం, 1000 కోట్ల నికర లాభ నష్టం చవిచూసిందన్నారు. నేటికీ రాజకీయ ప్రేరేపిత విషవలయాల నుండి ఎఐటియుసి, ఐఎన్టియుసిలకు జ్ఞానోదయం కలిగిందని, కానీ సంస్థకు, కార్మికులకు జరిగిన నష్టానికి వారు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం బిఎంఎస్ భవన్, కొత్తగూడెం యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఏఐబికెఎంఎస్ కార్యదర్శి పి.మాధవ నాయక్, జెబిసిసిఐ, వై.సారంగపాణి (యూనియన్ ప్రధాన కార్యదర్శి), జీవి కృష్ణారెడ్డి (కార్పొరేట్ ఏరియా ఉపాధ్యక్షులు), వద్దేపల్లి కుమారస్వామి (అర్జి టూ ఏరియా ఉపాధ్యక్షులు), ఉట్ల గణేష్ (కార్పొరేట్ ఏరియా సెక్రటరీ), భూక్య శ్రీను (ఫిట్ సెక్రటరీ), కృష్ణ (ఏఎల్పి ఫిట్ సెక్రటరీ), ఇనుపనూరి నాగేశ్వరరావు (కాంట్రాక్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి), ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నా రు. పి.మాధవ నాయక్ మాట్లాడుతూ 2019 నుంచి బిఎంఎస్ అనేక వేదికలపై బొగ్గు గనుల వేలంపాటలో పాల్గొంటేనే సింగరేణికి లాభం అని చెబుతూ వచ్చిందని, బిఎంఎస్ జాతీయ నాయకులు, బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జ్ కొత్త కాపు లక్ష్మారెడ్డి నాయకత్వంలో, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి, సింగరేణి బొగ్గు గనులు కేటాయించాలని కోరగా, వేలంపాటలో పాల్గొంటేనే గనులు సింగరేణికే కేటాయిస్తామని హామీ ఇచ్చారు. బిఎంఎస్ ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ, గత బిఆర్ఎస్ తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఏఐటియూసి, ఐఎన్‌టియూసి కార్మిక సంఘాలు సహా కొన్ని జాతీయ కార్మిక సంఘాలని చెప్పుకునే వాళ్ళు గత కేసిఆర్ ప్రభుత్వ విషవలయంలో పడి రాజకీయ కారణాలతో కేంద్రం ప్రభుత్వం ప్రైవేటీకరిస్తుందనే తప్పుడు ప్రచారం చేసి కార్మికులను తప్పుదోవ పట్టించాయని, దాంతో కోయగూడెం ఓసి జెవిఆర్,ఓసి-3గనులు ప్రైవేట్ సంస్థల చేతిలోకి వెళ్లిపోయాయని, ఈ పరిస్థితికి బాధ్యులైన కార్మిక సంఘాలు కార్మికులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తోందని, సింగరేణి యజమాన్యంపై గత కేసిఆర్ ప్రభుత్వం, ఈ కార్మిక సంఘాలు తీవ్ర ఒత్తిడితో వేలం లో పాల్గొనకుండా చేసి, జెవిఆర్ ఓసి -3, కోయగూడెం ఓసి-3, వేలం ద్వారా అరబిందో, అవంతిక అనే ప్రైవేట్ కంపెనీలకు అప్పగించిందని, జెవిఆర్ ఓసి (ఓవర్ బర్డన్) ఓపెన్ కాస్ట్ కోసం తీసిన మట్టిని వేయడానికి అవసరమైన స్థలం అందుబాటులో లేకపోవడం వల్ల ఉత్పత్తి ప్రారంభం కాలేదని, కోయగూడెం ఓసి-3, 1 ఆఫ్ 70 చట్టం ప్రకారం, ప్రైవేట్ సంస్థలు ఉత్పత్తి చేయడం గిరిజన చట్టాలకు విరుద్ధమని అన్నారు. సారంగపాణి మాట్లాడుతూ, ఏఐటియూసి మరియు ఐఎన్‌టియూసి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి చేసి సింగరేణికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు ట్రాన్స్కో, జన్కొ నుండి రావలసిన బకాయిలు 35,645 కోట్ల వసూలు చేయాలని డిమాండ్ చేశారు. విషయాన్ని ఒక సంయుక్త ప్రకటనలో జి.వి. కృష్ణారెడ్డి,ఉపాధ్యక్షులు ఉట్ల గణేష్, కార్యదర్శి కార్పొరేట్ ఏరియా సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ పేర్కొన్నారు.

# 15 నెలల్లో 15 వేల కోట్ల అప్పు

- అంత అప్పు తెచ్చి ఆడపిల్లలకు ఒక్క స్కూటీ కూడా ఇవ్వలేదు
- లక్ష 50 వేల కోట్ల అప్పు తెచ్చి కూడా ఒక్క మహిళకూ 2500 ఇవ్వడం లేదు
- అప్పులు, ఖర్చులపై శ్వేత పత్రం విడుదల చేయాలి
- కేసీఆర్ పదేళ్లలో 50 లక్షల కోట్ల సంపద సృష్టించారు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత




**హైదరాబాద్, మార్చి 10 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసి బడా కాంట్రాక్టర్లకు దోచిపెడుతున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. 15 నెలల పాలనలో రేవంత్ రెడ్డి సర్కారు 15 వేల కోట్ల అప్పులు చేసిందని ఎండగట్టారు. కానీ పేద ప్రజలకు ఒక్క మంచి పనీ చేయలేదని, ఒక్క హామీని కూడా అమలు చేయలేదని, మరి ఈ డబ్బులన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. అప్పులు, ఖర్చులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడుతూ.... తెలంగాణ గొప్పగా, ఉన్నతంగా ఉందంటూ జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పదేళ్లలో కేసీఆర్ చాటిచెప్పి పెట్టుబడులను ఆహ్వానిస్తే... ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం రాష్ట్ర పరిస్థితి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బాగలేదని అబద్దాలు చెబుతున్నారని, ఇలాంటి వ్యక్తి మన రాష్ట్రానికి రెడ్డి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టకరమని మండిపడ్డారు. దాంతో దేశంలో ఉన్న అన్ని పత్రికలు కూడా తెలంగాణ ఆర్థిక సంక్షోభంలో ఉందని రాశాయని, ఇది బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్రం పట్ల, ప్రజల పట్ల రేవంత్ రెడ్డికి గౌరవం లేదని విరుచుకుపడ్డారు. ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కనీసం రూ 500 కోట్లు కూడా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపట్టడానికి (మూలధన వ్యయం) ఖర్చు చేయలేకపోతున్నామని, రాష్ట్రానికి రూ 5500 కోట్ల కంటే ఎక్కువ ఆదాయం రావడం లేదని అని అబద్దాలు చెప్పారని గుర్తు చేశారు. కానీ రాష్ట్రానికి నెలకు రూ 18 వేల కోట్లు వస్తున్నాయని, రూ 6 వేల కోట్లు ఖర్చవుతున్నాయని, దాదాపు రూ 12 వేల కోట్లు రాష్ట్రానికి మిగులుతున్నాయని వెల్లడించారు. సగటున దాదాపు రూ 3 వేల కోట్లు మూలధన వ్యయంగా ఖర్చు చేస్తున్నారని, కానీ ముఖ్యమంత్రి మాత్రం అందుకు విరుద్ధంగా ప్రకటనలు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాలు ముఖ్యమంత్రికి తెలియదా లేక అవగాహన లేదా..? అన్నది చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయకుండా తప్పించుకోవడానికి ముఖ్యమంత్రి దొంగ లెక్కలు చెబుతున్నారని మండిపడ్డారు. తప్పుడు లెక్కలతో సొంత రాష్ట్రాన్ని అవమానిస్తున్న ముఖ్యమంత్రి వైఖరిని తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రికి సామాజిక స్పృహ, దృక్పథం లేదని, హామీలు అమలు చేయాలన్న నియ్యత్ లేదని, భవిష్యత్తు పట్ల దూరదృష్టి లేదు పేదల కడుపునింపాలన్న ఆలోచన లేదని మండిపడ్డారు. 15 నెలల్లో పేదలకు ఒక్క మంచి పనీ చేయలేదని, కానీ బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం నిరంతరం కొనసాగుతుందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యత పెద్దవాళ్లపై ఉందని, పేద వాళ్లపై లేదని విమర్శించారు. 2023 నవంబరు నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్షా 50 వేల కోట్లు అప్పు చేసిందని, అంటే సగటున నెలకు రూ 10 వేల కోట్లు అప్పు తెస్తున్నారని, మరి ఈ డబ్బులన్నీ ఏం చేస్తున్నట్లని ప్రశ్నించారు. మహిళలకు నెలకు రూ 2500 ఇవ్వడం లేదు, రైతు రుణ మాఫీ, రైతు భరోసా పథకం సంపూర్ణంగా అమలు కాలేదు, వరికి బోనస్ బోగస్ అయింది.. ఈ డబ్బులు ఎక్కడికి పోతున్నాయని నిలదీశారు.

# ఓసీ -3 ప్రధాన రహదారిపై భూ నిర్వాసితుల ధర్నా

- సంఘటన స్థలానికి చేరుకున్న సింగరేణి అధికారులు, పోలీసులు



**గణపురం ,మార్చి 10( జనం సాక్షి):** సింగరేణి ఓపెన్ కాస్ట్ ప్రభావిత గ్రామమైన పరుశురాంపల్లికి సింగరేణి న్యాయం చేయాలని పరశురాంపల్లి గ్రామస్తులు సోమవారం ఓసి త్రీ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. గ్రామస్తులు అందరూ ఏకమై ప్రధాన రహదారి పై టెంట్ వేసి నిర్వాసితులు ధర్నా చేశారు. ఓపెన్ కాస్ట్ లో గ్రామంలోని రైతులకు సంబంధించిన 90 శాతం వ్యవసాయ భూములు కోల్పోయి ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలకు కూడా ఉపాధి కల్పించడంలో సింగరేణి సంస్థ పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామంలో కేవలం ఇండ్లు మాత్రమే మిగిలాయని ఇక్కడి నుండి ఇతర ప్రాంతాలకు కూలీలకు వెలుతూ జీవనం కొనసాగిస్తు న్నామని తెలిపారు.గ్రామం వాహనాల రద్దీ, దుమ్ము కాలుష్యం, బ్లాస్టింగ్ వైబ్రేషన్ తో ఎంతోమంది అనారోగ్యాలకు గురవుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని నిర్వాసితులు తెలిపారు..గ్రామంలో బోర్లు ఎత్తిపోయి తాగునీటికి కుడా ఇబ్బందులు పడుతున్నామ న్నారు. ఓసి 3 కి ఈ రహదారి నుండి నిత్యం వందలాది భారీ వాహనాల దుమ్ము దూలితో కాస్త వున్న పంటలు కూడా చేతికి రాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

### గ్రామానికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కల్పించాలి

గ్రామానికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తూ 2012లో భూములు తీసుకుని సంవత్సరాలు గడుస్తున్నా తమ గ్రామాన్ని ఆర్ఆర్అండ్ ప్యాకేజీ కల్పించడం లేదని నిర్వాసితులు అన్నారు. ఎన్నిసార్లు సింగరేణి అధికారులకు, జిల్లా కలెక్టర్కు విన్నవించుకున్నా పట్టించుకున్నా పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వ్యవసాయ భూములు తీసుకునే ముందు గ్రామాన్ని తీసుకుని పునరావాసం కల్పిస్తామని అప్పటి సింగరేణి అధికారులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద తరలించే వరకు తగ్గేదే లేదని భీష్మించుకు కూర్చున్నారు. సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి, చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్ గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని చెప్పినా వారు వినలేదు. తమకు న్యాయం చేసేంతవరకూ ఇక్కడ నుండి కదిలేది లేదని గ్రామస్తులు తేల్చి చెప్పారు.లిఖిత పూర్వకంగా గ్రామస్తులు దరఖాస్తు రాసిస్తే ఉన్నతధికారుల దృష్టికి తీసుకువెళ్లి నెల రోజుల్లో సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి గ్రామస్తులకు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ధర్నాను విరమించారు.

# రైల్వే బోర్డు చైర్మన్‌తో ఎంపీ వద్దిరాజు భేటీ

- ఖమ్మం రైల్వే సమస్యలపై వినతి



**ఖమ్మం, మార్చి 10 (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లాకు సంబంధించిన పలు పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, ఇతర సమస్యలపై రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సోమవారం రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్ తో భేటీ అయ్యారు. ఢిల్లీలోని రైల్ నిలయంలో జరిగిన ఈ భేటీలో ఎంపీ రవిచంద్ర రైల్వే సమస్యలను ప్రస్తావించారు. పలు స్టేషన్లను ఆధునీకరించడంతో పాటు.. కొత్త ప్లాట్ ఫాం లను విస్తరించడం, కోవిడ్ కు ముందు రద్దు చేసిన రైళ్ల పునరుద్ధరణ, అదనపు హాల్టింగ్ లు, కొత్త రైళ్ల మంజూరు వంటి ప్రధాన సమస్యలపై బోర్డు చైర్మన్ తో చర్చించారు. ఎంపీ రవిచంద్ర ప్రస్తావించిన సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామని బోర్డు చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై ఆయన బోర్డు చైర్మన్ కు విజ్ఞాపన అందజేశారు.


# ఫార్మసీ విభాగంలో బయ్య చంద్ర ప్రకాష్‌కు డాక్టరేట్



**వరంగల్ ఎంజీఎం, మార్చి 10(జనంసాక్షి):** వరంగల్ నగరంలోని ఉర్సు సుభాష్ నగర్ ప్రాంతానికి చెందిన బయ్య చంద్రప్రకాష్ కు జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ వారు ఫార్మసిటికల్ సైన్సెస్ విభాగంలో డాక్టరేట్ ప్రకటించారు. కాకతీయ విశ్వవిద్యాలయం సీనియర్ ఫార్మసీ ఆచార్యులు డాక్టర్ మంద సారంగపాణి పర్యవేక్షణలో "డిజైన్ అండ్ క్యారెక్టర్జేషన్ ఆఫ్ న్యూ కెమికల్ ఎంటిటీస్ ఫర్ యాంటీ క్యాన్సర్ ఆక్టివిటీ" అనే అంశంపై పరిశోధన చేసి సమర్పించిన పరిశోధనా గ్రంథానికి జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ వారు డాక్టరేట్ ప్రకటించారు. ప్రస్తుతం బొల్లికుంట వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న బయ్య చంద్రప్రకాష్ ను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. కమల్ యాదవ్ తో పాటు ఇతర అధ్యాపకులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

# మిలియన్ మార్చ్‌కు నేటితో 14 ఏళ్లు

- నాటి పరిస్థితులను గుర్తుచేసుకున్న కేటీఆర్, హరీశ్‌రావు



**హైదరాబాద్, మార్చి10 (జనంసాక్షి) :** తెలంగాణ మలిదశ ఉద్యమంలో అత్యంత కీలకమైన ఘట్టాల్లో ఒకటైన మిలియన్ మార్చ్‌కు నేటితో 14 ఏళ్లు పూర్తి అయిన నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు నాటి సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు. అప్పటి కాంగ్రెస్ పాలకుల ఆంక్షలకు తట్టుకొని.. నిర్భంధాలకు ఎదురొడ్డి.. అరెస్టులను ఎదురించి.. లక్షలాది తెలంగాణ ఉద్యమకారులు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ట్యాంక్ బండ్‌పై గర్జించిన అపురూప సన్నివేశాలు ఇప్పటికీ కళ్ల ముందు మెదులుతున్నాయని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో వివిధ పోరాట రూపాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ అమరవీరులకు జోహార్.. జై తెలంగాణ అని వ్యాఖ్యానించారు. 'మిలియన్ మార్చ్'తో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడ్డ సందర్భమని హరీశ్‌రావు అన్నారు. ఆంక్షల పద్మవ్యూహాన్ని బద్దలుకొట్టుకుని లక్షలాదిగా జనం తరలివచ్చారని గుర్తుచేసుకున్నారు. స్వరాష్ట్ర సాధన కోసం ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమ ప్రస్థానంలో అదో కీలక ఘట్టమని వ్యాఖ్యానించారు. ప్రపంచ ప్రజా ఉద్యమాల సరసన తెలంగాణ ఉద్యమాన్ని నిలిపిన అసలు సిసలు ప్రజా విప్లవమని అన్నారు. ఆంక్షలు, నిర్బంధాల కట్టడిని చిత్తడి చేసి జలమార్గం గుండా టాంక్ బండ్ చేరుకొని, మిలియన్ మార్చ్ లో పాల్గొని నేటికీ 14 ఏళ్లు పూర్తయ్యాయని అన్నారు. ఆ అపురూప దృశ్యాలు ఇప్పటికీ కళ్ళ ముందు కదలాడుతున్నాయని చెప్పారు. నాటి ఉద్యమ పోరాటాలు ఇంకా రగిలిస్తూనే ఉన్నాయని అన్నారు. స్వరాష్ట్ర సాధన కోసం కేసీఆర్ గారి నాయకత్వంలో తెలంగాణ ప్రజలు చూపిన తెగువకు, పోరాటానికి సెల్యూట్ అని అన్నారు. ప్రాణాలు సైతం అర్పించిన అమరులకు జోహార్ తెలిపారు.

# ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు 200 కోట్లు కేటాయింపు

- సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన కాంగ్రెస్ శ్రేణులు



**మంచిర్యాల ప్రతినిధి, మార్చి 10 (జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని రెబ్బనపల్లి గ్రామంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు 200 కోట్లు కేటాయించినందుకు సీఎం ,డిప్యూటీ సీఎం ,ఎమ్మెల్యే చిత్రపటాలకు కాంగ్రెస్ శ్రేణులు పాలాభిషేకం చేశారు. సోమవారం మంచిర్యాల జిల్లా దండేపల్లి మండల కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుల చిత్ర పటాలకు కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేసి, సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్ మాట్లాడుతూ....తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి రాష్ట్రంలో 11600 కోట్లు నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు .మంచిర్యాల జిల్లాలో నిర్మించే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి 200 కోట్లు కేటాయించారని అందులో 400 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తారని పేర్కొన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడంలో ముందుంటుందని అన్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద ఐదు నియోజకవర్గాలను గుర్తించగా అందులో మంచిర్యాల నియోజకవర్గానికి స్కూల్ రావడం సంతోషకరమని తెలిపారు. విద్యారంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని అన్నారు. మన మంచిర్యాల నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ రావడానికి కృషి చేసిన మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## ఈజిప్టు ప్రతిపాదనలకు అందరి సమ్మతి

ఈజిప్టు చేసిన ఈ ప్రతిపాదనను అందరూ అంగీకరించారు అయితే అంత ముందు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదన ఎలా ఉండిందంటే గాజాను పాలసీనువులందరూ ఖాళీ చేయాల్సిందే. జోర్డాన్ కు వెళ్లాలి, లాంటివి మూర్ఖపు ప్రతిపాదనలని ఇరాన్ పేర్కొనడం జరిగింది. ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను ఎవరు కూడా నమ్మే పరిస్థితి లేదు. నిజానికి 1948, 1967 గాజాలో పాలనను ఈజిప్ట్ చూసి ఉన్నది. గాజాలో శాంతి స్థాపన, పాలస్తీనీయుల రక్షణ రక్షణ, తదితర విషయాలపై ఈజిప్టు ప్రతిపాదనలను అరబ్దేశాలు ఏకగ్రీవంగా అంగీకరించాయి. దీంతో ఇప్పుడు ట్రంపు ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. అంటే అతిశయోక్తి కాదు. అన్నీ కలిసి వస్తే గాజాలో ఎన్నికలు కూడా నిర్వహించే పరిస్థితి వస్తుందని మూడో'గాజా' పునర్నిర్మాణ ప్రతిపాదనలో ఈజిప్టు పేర్కొనడం జరిగింది.

# మానని గాయాల మధ్యన రంజాన్ ఉపవాసాలు



ఇజ్రాయిల్ ఏకపక్ష యుద్ధం కారణంగా మొత్తం సర్వనాశనం అయిపోయిన పాలస్తీనీయుల 'గాజ 'పట్టిలో మానని ఇంకా ఎన్నో గాయాల మధ్యన పవిత్రమైన రంజాన్ ఉపవాస దీక్షలను ఎంతో సంతోషంగా పాటించడం కనిపిస్తుంది. దాదాపు లక్ష మంది ఇక్కడ ప్రాణాలు కోల్పోయారు. 80% ఇండ్లు పక్క భవనాలు నేలమట్టమయ్యాయి. మొత్తం మట్టిలో కలిసిపోయిన గాజాలో మట్టిని తొలగిస్తూ అక్కడనే బతికున్న వారంతా రమదాన్ వేడుకలను జరుపుకుంటున్నారు.

### జనవరి రెండు నుంచి యుద్ధ విరమణ

ఈ ఏడు జనవరి రెండు నుంచి యుద్ధ విరమణ అమల్లోకి వచ్చింది మూడు విడతలలో ఈ యుద్ధ విరమణ కొనసాగుతుంది. పరస్పరం అమాస్ ఇజ్రాయిల్ వద్ద ఉన్న ఖైదీలను విడుదల చేస్తున్నారు. అక్టోబర్ ఏడు 2023 నుంచి ఈ యుద్ధం మొదలైంది. అమెరికా జోక్యంతోని యుద్ధ విరమణ అటు ఇజ్రాయిల్ ప్రధాని నే తన్యహూ ఒక అంగీకారానికి వచ్చారు. ఇంకా కొన్ని షరతులను హమాస్ పాటించడం లేదననే నెపంతో ఇజ్రాయిల్ గాజాలో వంట సామాగ్రి మంచి నీరు లాంటివి కూడా అందకుండా అక్కడక్కడ వాటిపై ఆంక్షలు విధిస్తున్నారు. పరిస్థితి కొంత అయినా వెసలుబాటు లభించిందని, అభిప్రాయంతో అదే మట్టిలో అటు ఇటుగా జరిపి అందులోనే ఉపవాస దీక్షలను పాటించడం జరుగుతున్నది. భక్తిశ్రద్ధలతో పవిత్రమైన రంజాన్ ఉపవాస దీక్షలో పాలు పంచుకుంటున్నారు. తాము కష్టాల్లో ఉంటేనేమి దేవుడి కోసం తమ ప్రార్థనలు దీక్షలు ఆపేది లేదంటూ భక్తులు పెద్ద ఎత్తున దీక్షలో పాల్గొంటున్నారు. పిల్లలు, వృద్దులు కూడా దీక్షలో పాల్గొంటున్నారు. రమదాన్ వేడుకలు ఘనంగా జరుపుకుంటామని, వారి వద్ద ఏమి కనిపించినప్పటికీ, భౌతికంగా వారి వద్ద ఎలాంటి వస్తువులు సౌకర్యాలు, అందుబాటులో లేనప్పటికీ,ఉన్నదాంట్లోనే సర్దుకుని ఒక నమ్మకంగా పాలస్తీనియులు రంజాన్ దీక్షలలో పాల్గొనడం విశేషం. వారిని చూస్తే ఏడాదిన్నర కాలంగా గాయాలతో గాజా పడిన ఘోష,విషాద దృశ్యాలు మన కండ్ల ముందు తచ్చాడినట్లు ఉంటుంది.గాజాను మొత్తంగా ఇజ్రాయిల్ ధ్వంసం చేయడం జరిగింది. ఆ తర్వాత కూడా అక్కడి ఖనిజాల కోసం ఆ ప్రాంతాన్ని కైవసం చేసుకోవడం కోసం అటు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటు ఇజ్రాయిల్ ప్రధాని నేతన్యహు ఇంకా కుట్రలు పన్నుతూనే ఉన్నారు. హమాస్ యుద్ధ షరతులను పాటించడం లేదని చెబుతున్నారు.

### ట్రంప్ దుర్బుద్ధి ప్రతిపాదనలకు నో.

ఇదిలా ఉండగా మొత్తంగా గాజాను స్వాధీనం చేసుకునే దుర్బుద్ధితో ఉన్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదనలను అరబ్దేశాలు ఏమాత్రం అంగీకరించలేదు. ఈజిప్టు అధ్యక్షుడు చేసిన కొన్ని ప్రతిపాదనలను ఈ నెల నాలుగున జరిగిన ఒక సమావేశంలో అరబ్దేశాలతో పాటు గాజా వైపు నిలుచుండి మద్దతిస్తు న్న దేశాలన్నీ ఆర్థికంగా సహాయం చేయడానికి గాజాను పునర్ నిర్మించడానికి నిర్ణయించాయి. ఈజిప్టు ప్రతిపాదన ప్రకారం గజా పునర్నిర్మాణానికి 53 వేల కోట్ల ఆర్థిక వనరులు అవసరం ఉంటుంది. ఇందులో అక్కడ కూల్చివేతల వల్ల విధ్వంసాల వల్ల పేరుకుపోయిన మట్టిని తొలగించడం రోడ్లను ఏర్పాటు చేయడం తదితరుముల కోసం 300 కోట్లు. మంచినీరు, నాలుగు లక్షల ఇండ్ల నిర్మాణం ఇతర సౌకర్యాల కోసం మూడు వేల కోట్ల వరకు ఖర్చు అవుతుంది. ఇండ్ల నిర్మాణానికి 30 నెలల సమయం పడుతుంది. మూడో దశలో ఎయిర్పోర్ట్ ఇతర సౌకర్యాల ఏర్పాటు జరుగుతుంది. విద్యుత్తు సరఫరా మంచినీరు ఇతర సౌకర్యాలు అన్నీ కూడా కలగడానికి సమయం పడుతుంది.

### 6 నెలల్లో ప్రోగ్రెస్.

వెంటనే పనులు ప్రారంభిస్తే ఆరు నెలల లోపు గాజాలో పునర్నిర్మాణ పనుల లో ప్రోగ్రెస్ కనిపిస్తుంది. అంటే అతిశయోక్తి కాదు. అయితే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అటు ఇజ్రాయిల్ ప్రధాని నేతన్యహులు ఈ విషయంలో మరేమైనా కుట్రలు కుహకాలు చేస్తారా? వేచి చూడాల్సిందే.



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,



# బొగ్గు గనుల భద్రతా ఆడిట్!

## పార్లమెంటులో ప్రశ్న, బొగ్గు మంత్రి సమాధానం

బొగ్గు గనుల భద్రతా ఆడిట్ గురించి రాజ్యసభలో ఒక ప్రశ్న లేవనెత్తబడింది. ఈ అంశాన్ని ఎంపీ ఎం. మహమ్మద్ అబ్దుల్లా లేవనెత్తారు. బొగ్గు గనులలో భద్రతా ఆడిట్‌ల అమలు ప్రస్తుత స్థితి గురించి మరియు అవి ఎంత తరచుగా నిర్వహించబడుతున్నాయని మొహమ్మద్ అబ్దుల్లా బొగ్గు మంత్రిని అడిగారు? కార్మికులను ప్రమాదకరమైన పరిస్థితుల నుండి రక్షించడానికి బొగ్గు తవ్వకాలను ఆధునీకరించడానికి మరియు యాంత్రీకరించడానికి ఏ చర్యలు తీసుకున్నారు? ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో బొగ్గు తవ్వకాల వల్ల పర్యావరణంపై కలిగే ప్రభావంపై ప్రభుత్వం ఏదైనా అధ్యయనం చేసిందా మరియు బొగ్గు తవ్వకాల రంగంలోని కార్మికుల సంక్షేమం మరియు నైపుణ్యాభివృద్ధిని మెరుగుపరచడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ఒక లిఖితపూర్వక సమాధానం సమర్పించారు, అది ఈ క్రింది విధంగా ఉంది:

**(ఎ) :** బొగ్గు మంత్రిత్వ శాఖ డిసెంబర్ 2023లో జారీ చేసిన "సేఫ్టీ హెల్త్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఆడిట్" మార్గదర్శకాల ప్రకారం, ఏటా భద్రతా ఆడిట్ నిర్వహిస్తారు. 17.12.2024న, బొగ్గు మంత్రిత్వ శాఖ ఆడిట్ నివేదికలను సమర్పించడానికి సేఫ్టీ ఆడిట్ మాడ్యూల్‌ను కలుపుకొని "నేషనల్ కోల్‌మైన్ సేఫ్టీ రిపోర్ట్ పోర్టల్"ను ప్రారంభించింది.

**(బి):** డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ , ఆధునీకరణ, యాంత్రీకరణ, అత్యవసర ప్రతిస్పందన మరియు తరలింపు ప్రణాళికను పరిగణనలోకి తీసుకుని, పాత బొగ్గు గనుల నిబంధనలు, 1957ను "బొగ్గు గనుల నిబంధనలు 2017"గా పునరుద్ధరించింది/ సవరించింది. పైన పేర్కొన్నవి కాకుండా, కార్మికులను ప్రమాదకర పరిస్థితుల నుండి రక్షించడానికి బొగ్గు తవ్వకాన్ని ఆధునీకరించడానికి మరియు యాంత్రీకరించడానికి బొగ్గు కంపెనీలు తీసుకున్న ప్రధాన చర్యలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

1. సాంప్రదాయ ఓపెన్‌కాస్ట్ మైనింగ్ పద్ధతి ద్వారా సాంకేతికంగా ఆర్థికంగా లాభదాయకం కాని బొగ్గు సీమ్‌లను వెలికితీసేందుకు అండర్ గ్రౌండ్ గనులలో కంటిన్యూయస్ మైనర్, పవర్డ్ సపోర్ట్ లాంగ్‌వాల్ సర్ఫేస్ మైనర్, ఓపెన్‌కాస్ట్ గనులలో ఎక్సెన్ట్రిక్/ వర్టికల్ రిప్పర్లు మరియు హైబ్రిడ్ హై వాల్ మైనింగ్ వంటి బ్లాస్ట్-ఫ్రీ మైనింగ్ టెక్నాలజీల పరిచయం.
2. ఎన్విరాన్‌మెంటల్ టెలిమోనిటరింగ్ సిస్టమ్, గ్యాస్ క్రోమాటోగ్రాఫ్ ద్వారా అండర్ గ్రౌండ్ గని పర్యావరణం యొక్క నిజ సమయ పర్యవేక్షణ త్వరిత మరియు ఖచ్చితమైన గని గాలి నమూనా కోసం ఉపయోగించబడుతుంది.
3. మెకనైజ్డ్ రూఫ్ బోల్టింగ్ సిస్టమ్ అంటే యూనివర్సల్ డ్రిల్లింగ్ మెషిన్ (క్వాడ్, రెసిన్ క్యాప్సూల్‌తో కూడిన ట్విన్ బోల్టర్ సిస్టమ్ మరియు స్ట్రాటా మానిటరింగ్ కోసం అధునాతన పరికరాలు.
4. దుమ్మును తగ్గించడానికి ట్రక్కు-మౌంటెడ్ ఫాగ్ ఫిరంగులు మరియు స్ప్రింక్లర్-కమ్-మిస్ట్ స్ప్రే వంటి దుమ్ము అణిచివేత వ్యవస్థలు.
5. హెవీ ఎర్త్ మూవింగ్ మెషినరీ ఆపరేటర్లకు సిమ్యులేటర్ ఆధారిత శిక్షణ మరియు వర్చువల్ రియాలిటీ శిక్షణా కార్యక్రమాలు.
6. వాలు మరియు ఓవర్‌బర్డెన్ డంప్ స్థిరత్వాన్ని పర్యవేక్షించడానికి టోటల్ స్టేషన్లు, 3డి టెరెస్ట్రియల్ లేజర్ స్కానింగ్ ( మరియు స్లోప్ స్టెబిలిటీ రాడార్ వంటి ఆధునిక సాంకేతికతలు.
7. జిపిఎస్ ఆధారిత ఆపరేటర్ ఇండిపెండెంట్ ట్రక్ డిస్పాచ్ సిస్టమ్ హెవీ ఎర్త్ మూవర్స్ మెషిన్ కదలికలను ట్రాక్ చేయడానికి పెద్ద ఓపెన్ కాస్ట్ లలో జియో-ఫెన్సింగ్.

**(సి) :** కొత్త/విస్తరణ బొగ్గు మైనింగ్ ప్రాజెక్టుల కోసం పర్యావరణ ప్రభావ అంచనా అధ్యయనాలు చేపట్టబడతాయి మరియు పర్యావరణం, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నుండి పర్యావరణ అనుమతి పొందే ముందు /పర్యావరణ నిర్వహణ ప్రణాళిక నివేదికలలో తగిన చర్యలు చేర్చబడతాయి. కార్యాచరణ దశలో, బొగ్గు మైనింగ్ కార్యకలాపాల ప్రభావాన్ని చుట్టుపక్కల పర్యావరణంపై అంచనా వేయడానికి పర్యావరణ పర్యవేక్షణ నిర్వహించబడుతుంది.

ఆమోదించబడిన పర్యావరణ ప్రభావ అంచనా అధ్యయనాలలో పేర్కొన్న విధంగా సురక్షితమైన మరియు ఆరోగ్యకరమైన పని వాతావరణాన్ని నిర్ధారించడానికి అన్ని బొగ్గు గనులు జియోటెక్నికల్ మరియు జియో-మైనింగ్ అధ్యయనాలను పరిగణనలోకి తీసుకుని శాస్త్రీయంగా ప్రణాళిక చేయబడి రూపొందించబడ్డాయి.

**(డి) :** గనుల చట్టం, 1952 కింద రూపొందించబడిన గనుల నియమాలు, 1955, పని ప్రదేశాలలో గని కార్మికులకు సంక్షేమ సౌకర్యాలను అందిస్తుంది. ఈ నియమాలు క్రమం తప్పకుండా ఆరోగ్య తనిఖీలు, ప్రథమ చికిత్స, తగినంత ఆశ్రయం, క్యాంటీన్లు, గనులు మరియు క్రెష్ సౌకర్యాలలో సంక్షేమ అధికారుల నియామకం మొదలైన వాటికి నిబంధనలను నిర్దేశిస్తాయి. గనుల చట్టం, 1952 మరియు దాని కింద రూపొందించిన గనుల వృత్తి శిక్షణ నియమాలు, 1966 ప్రకారం శిక్షణ మరియు పునశ్చరణ శిక్షణ కోసం తగిన నిబంధనలు రూపొందించబడ్డాయి.

బొగ్గు గనుల రంగంలోని కార్మికుల సంక్షేమాన్ని మెరుగుపరచడానికి బొగ్గు కంపెనీలు తీసుకున్న ప్రధాన కార్యక్రమాలలో తగిన గృహ సౌకర్యాలు, స్వచ్ఛమైన తాగునీరు, స్కాలర్‌షిప్‌లు, నగదు అవార్డులు, ముఖ్యంగా ఐ ఐ టిలు మరియు ఎన్ ఐ టిలు వంటి సంస్థలలో చదువుతున్న పిల్లలకు ఆర్థిక సహాయం, తగినంత విద్యా సౌకర్యాలు, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు, ఉద్యోగ సమయంలో మరణిస్తే వివాహిత, విడాకులు తీసుకున్న మరియు వదిలివేయబడిన ఉద్యోగుల కుమార్తెలకు కారుణ్య ప్రాతిపదికన ఉపాధి కల్పించడం మరియు ప్రాథమిక సౌకర్యాలను నిర్ధారించడానికి క్యాంటీన్, క్రెచ్, పిట్ హెడ్ బాత్ మరియు విశ్రాంతి ఆశ్రయం వంటి చట్టబద్ధమైన సంక్షేమ సౌకర్యాలు ఉన్నాయి.

ఇంకా, బొగ్గు గనుల రంగంలో కార్మికుల నైపుణ్యాభివృద్ధిని మెరుగుపరచడానికి తీసుకున్న ప్రధాన కార్యక్రమాలలో నిర్మాణాత్మక వృత్తి శిక్షణ, అధునాతన సిమ్యులేటర్ ఆధారిత శిక్షణ, వర్క్‌మ్యాన్ ఇన్‌స్పెక్టర్లు,భద్రత కమిటీ సభ్యులకు శిక్షణ, మైనింగ్ కార్యకలాపాల యొక్క కీలక రంగాలైన డ్రిల్లింగ్, బ్లాస్టింగ్, పైకప్పు మద్దతు, అగ్నిమాపక భద్రత, అధిక ప్రమాదకర కార్యకలాపాలలో సామర్థ్యం మరియు భద్రతను నిర్ధారించడానికి ప్రత్యేక ఉద్యోగ ఆధారిత శిక్షణను అందించడం వంటివి ఉన్నాయి.



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,



# ఆర్గానిక్ ఫుడ్.. బెల్లం,చక్కెర?

చాలా మంది ఈ మధ్య చక్కెర కన్నా బెల్లం ఆరోగ్యానికి మంచిదని వాదించడం వింటున్నాను. అసలు ఆయుర్వేద వైద్యంలో చక్కెర అనే పదమే ఉండదు. మిరప అనే పదమే ఉండదు మిరియాలు వాడమంటారు. ఈ లిస్టు చాలా ఉంది. ఎందుకంటే నేను అరశతాబ్దానికి మించిన కాలం నుంచీ అన్నిరకాల వైద్యులు, వారి మందులు తిన్న అనుభవం ఉంది.

చక్కెరను చెరకు రసంతో యంత్రాలతో ఎలా తయారు చేస్తారో తెలియదు. కానీ బెల్లం చేయడం బాగా తెలుసు. క్రషర్లో చేరకు వేసి రసంతీసి కొప్పెరలో (పెద్దగా లోతుగా ఉన్న ఇనుప పెనం) కాగబెడతారు. చెరకు మీద బల్లి పోరలాగా లేదా చాక్ పీస్ తో రుద్దినట్లు ఒక పొర ఉంటుంది అదీ, చెరకు కణుపుల్లో అంటిపెట్టుకొన్న కొన్ని క్రిములూ, అలాగే వదిలిన కొన్ని వేర్లలోని మన్నూ, అది బయలు ప్రదేశం కాబట్టి గాలికి చాలా మలినాలు ఆ రసంలో కలిసిపోయి ఉంటాయి. వాటిని అంతా తొలగించడానికి పెనంలో రసం కాగే సమయంలో సోడా పౌడర్ అనే తెల్లని దాన్ని వేస్తారు అప్పుడు "మడ్డి" రూపంలో కొంత పైకి తెలితే దాన్ని జల్లెడవంటి దానితో తొలగిస్తారు. అప్పుడు ఈ రసం మన మురికి నీళ్లలాగా నల్లగా కనిపిస్తుంది.

బాగా కాగి అందులో నీటిశాతం ఆవిరయ్యాక బెల్లం ముద్దగా అంటుకోవడానికి కనీసం ఒక్కో వంటకు( వంట అంటే 25...30 కేజీల బెల్లంగా తయారయ్యే రసం) 200 గ్రాములకు మించి సున్నం వేస్తారు. శాస్త్రీయంగా అయితే అలాగే కాంచి గట్టిపరిచి బెల్లాన్ని చేయాలి. అలా చేస్తే అది పూర్తీ నల్లగా కోడిపియ్యలా వుంటుంది. అది తెల్లగా మనం నిత్యం చూసేదానిలా తయారుకావడానికి హైడ్రస్(దీని శాస్త్రీయ నామం పెద్దగా ఉంది) అనే రసాయన చూర్ణాన్ని కలుపుతారు. నిజంగా అది బెల్లంలో వాడకం నిషేధం. ధరకూడా చాలాచాలా ఎక్కువ. రహస్యంగా తెచ్చి వాడుతారు. ఈ డబ్బా మూత తీసినప్పుడు మనం ముఖం దగ్గరగా పెట్టుకొంటే ఆ రసాయన ఘాటును భరించలేము. ఈ పవుడరు కలిపినప్పుడే నల్లని పాకు తెలుపుతో కూడిన ఎరుపుగా మారుతుంది. అంతే కాదు బెల్లంలోని నానా మలినాలు శుభ్రం కావాలని బట్టల సబ్బు ముక్కలు చేసి వేస్తారు. బాగా బంక కట్టాలని బెండ చెట్లను ఆకులతో సహా తెచ్చి దంచి నీళ్లలో కలిపి వేస్తారు.చెరకు పెరిగే సమయంలో నీరు చాలక ఉంటేనో, ఇసుకపేడు కాకుంటేనో బెల్లం పాకు గట్టిపడి ఉంటకేరాదు. అప్పుడు ఎన్నిరకాల పదార్థాలు కలుపుతారో ఆ వంటల గురికానికే తెలియదు. ఇంతా చేసి పలకల గుంతల్లో పోసి ఆరబెట్టి దుప్పటి మీద చిన్న ఉంటలుగా వేయ డం ఆ తతంగం అంతా దాదాపు ఆరుబయలు వంటి ప్రదేశం. చీమలు, క్రిములు, గాలిద్వారా కలిసే చెత్తా చెదారానికి కొదువే ఉండదు. ఆ తయారీని మీరుగనక చూస్తే హొటల్లో కాళ్లతో చపాతీ పిండి తొక్కడం, దోసెల పెనాన్ని చీపురుతో శుభ్రపరచడం లాగు పరిశుద్ధంగా ఉంటుంది. అది యేమీ చూడక, తెలియ క చక్కెరకన్నా బెల్లమే మంచిదని భావిస్తారు. బెల్లం ఎంత క్షారమైనదో తెలుసుకోవాలంటే అసిడిటీ గనుక ఉంటే మీరు ఒకే ప్రమాణంలో చక్కెరను కొన్నాళ్ళు...బెల్లాన్ని కొన్నాళ్లు వాడి తేడాను గమనించండి.

# రైళ్లలో మిడిల్ బెర్త్‌లను తొలగించాలి



భారతీయ రైల్వేశాఖ ప్రయాణికుల కోసం సౌకర్యవంతమైన అందమైన అత్యాధునిక భోగిలను ఏర్పరుస్తున్నది అతివేగమంతమైన అమృత వందే భారత్ రైళ్ళ ఇంజన్లను కూడా ఆకర్షణీయమైన విధముగా తయారు చేసి నడుపుతున్నది ఇది చాలా హర్షించ దగ్గ విషయం దేశంలో రైళ్లు ప్రవేశపెట్టిన ప్పుడు మూడవ తరగతి భోగీలు కూడా ప్యాసింజర్ రైలులో ఉండేవి ఇందులో కూర్చువడానకి సీట్లు కూడా ఉండేవి కావు కాలానుగుణముగా అవసరాల కు తగ్గట్టుగా ప్రస్తుతం జనరల్ స్లీపర్ థర్డ్ సెకండ్ ఫస్ట్ ఏసీ క్లాస్ భోగిలను నడుపుతున్నారు రైల్వే వ్యవస్థలో అన్ని రంగాలలో కూడా ఆధునిక సాంకేతికతతో కూడిన వ్యవస్థలను నెలకొల్పుతున్నారు గతంలో జనరల్ భోగీల లో కట్టే చెక్కల తో కూడిన సీట్లు ఉండేవి ప్రయాణికులు పడుతున్న కష్టనష్టాలను దృష్టిలో ఉంచుకొని వాటిని కూషన్ సీట్లుగా మార్చినారు ప్రతి విషయంలో కూడా ఎప్పటికప్పుడు అవసరాలను దృష్టిలో పెట్టుకొని అవసరాలకు అనుగుణంగా మార్పులను తీసుకొని వస్తున్నారు కానీ స్లీపర్ థర్డ్ ఏసి క్లాస్ భోగిలలో మార్పులు తీసుకొని రాకపోవడం వలన ప్రయాణికులు భరించరాని కష్టాలు ఎదుర్కొంటున్నారు మారుతున్న ఆహారపు అలవాట్ల వలన శరీరం దృఢంగా ఉండలేకపోవడం తో పాటు కమ్యూనికేషన్ వ్యవస్థలో పెను మార్పులు చోటు చేసుకోవడం వలన ప్రయాణికులు ఐపాడ్లు ల్యాప్ టాప్ లో ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు విరివిగా ఉపయోగించుకుంటున్నారు ఫలితంగా లోయర్ మిడిల్ బెర్త్ లలో ప్రయాణం చేయడం కష్టతరమవుతున్నది ఇంతే గాక అనారోగ్య బారిన పడుటకు ఆస్కారం ఉంటున్నది

స్లీపర్ థర్డ్ ఏసి భోగిలను పూర్తిగా తొలగించి వాటి స్థానంలో టూ టైర్ స్లీపర్ మరియు సెకండ్ ఏసి భోగిలను ఏర్పాటు చేయాలి టిక్కెట్ ధరలు కూడా అధికముగా వసూలు చేయకుండా స్లీపర్ థర్డ్ ఏసి ధరల ప్రకారం నిర్ణయిస్తే ప్రయాణికులు ఎక్కువగా ఆకర్షితులై రైళ్ళలో ప్రయాణం చేయుటకు ఉత్సాహం చూపుతారు ఫలితంగా రైల్వే శాఖకు నష్టాలు కూడా కలగకుండా ఉంటుంది ఈ విషయాన్ని రైల్వే శాఖ సానుభూతితో పరిశీలిస్తుందని ఆశిస్తున్నాను

**దండంరాజు రాంచందర్ రావు**
**9849592958**

## మానవత్వం మటుమాయం

ఈ మతోన్మాద దేశంలో,
బతుకే బరువైపోయింది.
తల్లి భూమి కన్నీరు ముక్కలు రాలుస్తోంది,
విచ్ఛిన్నమైన చరిత్ర ముసుగులో.
హింస పెల్లుబికింది,
రక్తం ఎర్రని తిండి అయింది.
సాటి మనిషి తల తెంచితేనే గెలిచినట్టుగా,
మతం ముసుగులో రాక్షసత్వం
విస్తరించింది.
ప్రతి గడప త్రాచు పెడుతున్న భయమూ,
ప్రతి హృదయాన్నీ పగలగొట్టే క్రూరత.
మాటలు మృత్యువుని మించిన
ఆయుధాలుగా,
నిజాలు నెత్తినకు దుముకుతున్నాయి.
నువ్వు ఈ నేలను ప్రేమించవా?
ఇంకా గుండెని ముక్కలు చెయ్యక
మానవా?
పరాజితమైన మానవత్వం,
కన్నీటిలో తడిసి ప్రశ్నిస్తోంది:
"మతం ముంచిన
ఈ మాయలో,
మానవత్వం మళ్ళీ
పుట్టుకురాదా?"



**-బాలాజీ పోతుల**
**8179283830**

# మేం తురకలమెట్లవుతం ?

అనేక మంది ముస్లింలను గురించిన సంబోధనలో "తురకలు" అనే పదాన్ని విస్తృతంగా ఉపయోగిస్తుంటారు. ఈ పదంలో పరాయి జాతి భావన ఇమిడి వుందని తెలిసినా చాలా తేలిక భావంతో ప్రయోగిస్తారు. తురక అని పిలవటం వల్ల ముస్లింల మనసు ఎంత గాయపడుతుందో, క్షోభ చెందుతుందో గ్రహించక చాలా చులకనగా మాట్లాడుతుంటారు. కొందరు లౌకికవాదులు, ప్రగతిశీలవాదులు సైతం తమకు తెలిసో తెలియకో, అలవాటు గానో ఈ పదాన్ని అలవోకగా వాడుతుంటారు. కొన్ని ప్రాంతాల్లో ఈ పదం ముస్లింలను ఉద్దేశించిన పారిభాషికా పదమైంది. టర్కీ దేశానికి చెందిన తరుష్కులు తురక భాష మాట్లాడ్తారు కనుక వారిని తురకలు అనటంలో పెద్దగా ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. కాని భారత దేశంలో పుట్టి ఇక్కడే మరణించే భారతీయ ముస్లింలను తురకలు అని పిలవటమే ఆక్షేపణీయం. భారతదేశ ముస్లింలు జాతి రీత్యా చూసినా, భాషా పరంగా చూసినా తురుష్కులతో సంబంధం లేనివారు. ఏ ప్రాంతానికి చెందిన ముస్లింలైనా తురకం మాట్లాడరు. ఉర్దూలేదా ఇతర ప్రాంతీయ భాషలు మాట్లాడతారు. అయినా ముస్లింలను తురకలు అనటం హేయమైన విషయం. చరిత్ర మూలాల్లోకి వెళితే భారతదేశం ఏ ఒక్క జాతికీ, మతానికీ చెందినది కాదని తెలుస్తుంది. నదులన్నీ విభిన్న మార్గాలగుండా ప్రవహించి సముద్రంలో కల్సినట్లు నలుదిక్కుల నుండి వచ్చిన జాతులు ఇక్కడి భూమిలో మిళితమై పోయాయి. ఈ గడ్డపై వరుసక్రమంలో స్థిరనివాసం ఏర్పరుచుకున్న జాతుల్ని ఆర్.పి. చందా, గుహలాంటి వారు ఆరు జాతులుగా విభజించారు. అవి నీగ్రిటో, అస్ట్రలాయిడ్లు, బ్రాకీసిఫల్ లేక అల్పైన్లు, ద్రవిడియన్లు, ఆర్యులు, మంగోలియట్లు అనే జాతులుగా విశ్లేషించారు. ఈ జాతులన్నీ పరాయి దేశాల భూమి నుండి ఇక్కడికి వచ్చి స్థిరపడినవే. ఒక కోణంలో పరిశీలిస్తే మొదటగా వచ్చిన నీగ్రిటో జాతికి చెందినవారు ఈ దేశమూలవాసులని అనేకమంది చరిత్రకారుల అభిప్రాయం. వీరే చరిత్రలో సంభవించిన అనేక మార్పుల కారణంగా ఆర్యుల చేత భంగపడి చాతుర్వర్ణ వ్యవస్థ బలీయమైన క్రమంలో అంటరాని వారిగా, దళితులుగా, శూద్రులుగా మిగిలిపోయారు. ఈ దళితులు, శూద్రులే అనాదిగా వివక్షతకు గురౌతూ మలబార్ తీరానికొచ్చిన అరబ్బులు ద్వారా తమకు సమానత్వాన్ని ప్రసాదించిన ఇస్లాంలోకి ప్రవేశించారు. ఆ తర్వాత ఇస్లాంమత ప్రచార నిమిత్తం భారతదేశంలోని వివిధ ప్రాంతాల కొచ్చిన ముస్లిం సూఫీల ప్రభావానికి గురై ఈ దేశ మూలవాసులైన దళితులు, శూద్రులలో అధిక భాగం ఇస్లాం స్వీకరించటం జరిగింది. అరబ్బులకు, తురుష్కులకు చెందిన సంతతి కూడా ఇక్కడ స్థిరపడినవారిలో వున్నారు. వీరు ఇక్కడి ముస్లింలలో కేవలం అతి కొద్ది మంది మాత్రమే. విగ్రహారాధన పట్ల విముఖత పెంచుకున్న అగ్ర వర్ణాల వారు సైతం ఇస్లాం పట్ల ఆకర్షితులై ఇస్లాం స్వీకరించటం కూడా వాస్తవమే.

అయినా మన దేశంలో ఎవరు జాతులుగా, మతాలుగా, కులాలుగా, వర్గాలుగా అభివృద్ధి చెందినా, ఈ భూభాగం పై దాడి చేసి ఇక్కడ పరిపాలించినా అంతా పై ఆరుజాతులనుండి వచ్చినవారే. ఈ దేశానికి వలస వచ్చిన హూణుల్నికాని, కుషానుల్ని కానీ, ఆర్యుల్ని కానీ వారు వచ్చిన దేశాల పేర్లతో పిలవరు వారిని హిందువులుగా పిలుస్తారు. కాని ఈ మట్టి కణాల్లో కణాలైన ఈ దేశ మూల వాసులైన ముస్లింలను మాత్రం "తురకలు" అని పిలుస్తారు. ఇది ఎంత వివక్షతతో కూడిన దుర్మార్గమైన భావజాలమో సరియైన ఆలోచనా దృక్పథం కలిగిన వారు ఆలోచించవల్సిన అవసరం వుంది.

ఆధునిక రాజ్యంలో "జాతి" అనే పదాన్ని ఉపయోగించడంలో విస్తృతమైన అర్థాన్ని ఇచ్చారు. హేస్ అనే రాజనీతి శాస్త్రజ్ఞుడు 'Essays on Nationalism' అనే తన రచనలో రాజకీయ ఐక్యతను, సార్వభౌమాధికారంతో కూడిన స్వాతంత్ర్యాన్ని పొందిన ఒక జాతీయ సముదాయం. "జాతి" అవుతుందని వివరించాడు. ఇదే భావన నేడు దాదాపుగా అన్ని దేశాల్లోనూ ఆమోదింపబడి కొనసాగుతుంది. పౌరులు ఏ మతానికి చెందిన వారైనా జాతీయ భావనతో ఒకే జాతిగా పిలవబడుతున్నారు. కనుక ఈ దేశానికి చెందిన హిందువులైనా, ముస్లింలైనా, క్రైస్తవులైనా మరెవరైనా సరే భారత జాతికి చెందిన వారే. ఇక్కడ నివసిస్తున్న హిందువులతో సహా దాదాపు అన్ని మతాలకు చెందిన ప్రజలు పరాయి దేశాల నుండి ఇక్కడికి వలస వచ్చిన మూల జాతులైన పై ఆరు జాతులకు చెందిన వారే. కనుక ఈ దేశం ఎవరి సొత్తూ కాదు. ముస్లింలను "తురకలు" అని పిలిచే అర్హత ఎవరికీ లేదు. మతం ప్రాతిపదికగా ముస్లింలను పరాయి వారిగా భావించే అధికారం కూడా ఎవరికీ లేదు. ఎందువల్లనంటే ఇక్కడి అన్ని మతాలు, సంస్కృతీ సంప్రదాయా లు పై ఆరు జాతుల నుండి వచ్చినవే. ఇలా విభిన్న కోణాల నుండి పరిశీలించినా ముస్లింలు ఈ దేశమూల వాసులని, ఈ మట్టి పుత్రులని విశదమవుతుంది.



నిజానికి ముస్లింలను "తురకలు" అని పిలవటంలో ఒక భయంకరమైన కుట్ర దాగివుంది. జర్మనీలో నాజీజం మైనార్టీలకు వ్యతిరేకంగా ఎట్టి కుట్రలు పన్నిందో అనే కుట్రల్ని ఇక్కడి ముస్లిం ల కు వ్యతిరేకంగా కొన్ని వర్గాలు కొనసాగిస్తున్నాయి. ఇక్కడి మెజారిటీ ప్రజలైన హిందువులలో ముస్లింలు పరాయి వారనే భావన సృష్టించి తద్వార భీతావహ పరిస్థితులు కల్పించి ముస్లింలను భౌతికంగా, సాంస్కృతికంగా అణిచివేయడమనే తమ వ్యూహంలో భాగంగానే "తురక" అనే ఈ పదాన్ని సృష్టించారు. ఇప్పటికైనా దేశంలోని లౌకికవాదులు మేల్కొని ఫాసిస్టు పోకడలకు చిహ్నంగా నిలిచిన ఈ పదాన్ని వాడటాన్ని నిరోధించాలి. అదృష్టవశాత్తు మనదేశంలోని మెజారిటీ ప్రజలైన హిందువులు, ముస్లింలు లౌకిక భావనల్ని వీడలేదు. వ్యవస్థలో కొన్ని లొసుగులుంటే వుండవచ్చునేమో కాని మొత్తంగా వ్యవస్థ మతతత్వీకరించబడలేదు. ఏవో కొన్ని వర్గాలు తప్ప దాదాపుగా అందరూ శాంతి శ్రేయాలను, లౌకికతను వాంఛిస్తున్నారు.

ఉదయం నుండి సాయంత్రం వరకు స్వేదంలో తడిసి ముద్దవుతూ కార్ఖానాల్లో స్టీరింగ్ చక్రాల్లో, మిషన్ చక్రాల్లో, ఫుట్పాత్ బతుకుల్లో మ్రగ్గిపోతూ శ్రమ జీవులుగా జీవిస్తున్న ముస్లింలను తురకలని కించపర్చటం సాంఘీక నేరంగా పరిగణించాలి. అనుక్షణం వెంటాడుతూ, తల్వారై కుళ్ళ పొడుస్తూ వేధించే ఈ పదాన్ని యస్.సి., యస్.టి., ఎట్రాసిటీ చట్టాల పరిధిలోకి తీసుకురావాలి. తద్వారా మతోన్మాద భావంతో ముస్లింలను కించపరిచే స్వభావం కొంతమేరకైనా తగ్గుతుంది. ఇక్కడి మెజారిటీ ప్రజలు, మైనారిటీ ప్రజలు ఒకే ఆత్మకు రెండు భాగాల వంటి వారు. ఒక భాగాన్ని గాయ పర్చటం ద్వారా మరొక భాగం అభివృద్ధి చెందజాలదు. 'తురక' అనే ఈ పదాన్ని ఉపయోగిం చడం వల్ల అసలే అస్థిత్వ భయాలతో, అభద్రతాభావంతో బతుకులు వెళ్ళదీస్తున్న ముస్లింలు మరింత ఆత్మన్యూన్యతకు గురి కావలసివస్తుంది. భారతీయులమైన మనమందరం సమిష్టి ప్రేమను, సమిష్టిశ్రమను సమిష్టి కృషిని, సమిష్టి శ్రేయోధర్మాన్ని అలవర్చుకున్ననాడే మనం నిజమైన భారతీయులుగా జీవించగలం. తురక అనే పదాన్ని ఉపయోగించే బుద్ధి జీవులూ మేం తురకలమెట్లవుతమో! కొద్దిగా ఆలోచించండి. ఈ మట్టి పుత్రులమైన మమ్మల్ని తురకలని పిలవటం 'భారతీయత' కు వెన్నుపోటు పొడవటమే అని తెల్సుకోండి.

**- కవి కరీముల్లా**
సామాజిక వ్యాసం

# ఎల్ఆర్ఎస్ డబ్బులు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ


- రాయితీపై ప్రతి ఒక్క దరఖాస్తుదారుకు సమాచారం ఇవ్వాలి
- కలెక్టర్ వల్లూరు క్రాంతి



**సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 10 (జనం సాక్షి) :** మార్చి 31వ తేదీలోగా ఎల్ఆర్ఎస్ డబ్బులు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ వర్తిస్తుందని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని ఆడిటోరియంలో జిల్లాలోని ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసిల్దారులు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇరిగేషన్ అధికారులు, పంచాయతీరాజ్ అధికారులు, లేఅవుట్ డెవలపర్ లతో ఎల్ఆర్ఎస్ విధానంపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ గతంలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఈనెల 31వ తేదీ లోపల ఎల్ఆర్ఎస్ డబ్బులు చెల్లిస్తే 25శాంతం వర్తిస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలన జరిపి వార్డుల వారీగా, గ్రామాల వారీగా విభజించాలన్నారు. వచ్చిన దరఖాస్తుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని, దరఖాస్తుదారులకు ఫోన్ చేసి ఈ నెల 31 తేదీలోగా దరఖాస్తు చేసుకుంటే వచ్చే రాని యితీని వివరించాలన్నారు. జీవో నెంబర్ 131 మున్సిపల్ చట్టం ప్రకారం మున్సిపల్ పరిధిలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ప్లాట్లు ,లేఔట్ల లలో ఉన్న దరఖాస్తుదారులకు నూతన ఎల్ఆర్ఎస్ విధానంపై అవగాహన కల్పించి 31 లోగా డబ్బులు చెల్లించలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఇరిగేషన్ అధికారులు మున్సిపల్ అధికారులు పంచాయతీరాజ్ అధికారులు బృందాలుగా ఏర్పడి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పరిశీలన చేయాలన్నారు. దరఖాస్తుదారుడు సమర్పించిన అన్ని వివరాలు సరిగా ఉంటే వెంటనే సంబంధిత దరఖాస్తుదారకు సమాచారం అందించి ఎల్ఆర్ఎస్ డబ్బులు కట్టించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. దరఖాసుదారుడు తన డాక్యుమెంట్లో ఎల్ఆర్ఎస్ కోసం ఎంత దరఖాస్తు చేసుకున్నాడు, క్షేత్రస్థాయిలో ఎంత అందుబాటులో ఉంది అన్న వివరాలు అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి నిర్ధారించుకోవాలన్నారు .క్షేత్ర స్థాయిలో ఉన్న స్థలం డాక్యుమెంట్ లో ఉన్న స్థలం సరిపోలిస్తే వెంటనే ఎల్ఆర్ఎస్ డబ్బులు చెల్లించడానికి అనుమతి ఇవ్వాలని డబ్బులు చెల్లించి తమ స్థలాలను క్రమబద్ధీకరించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. మున్సిపాలిటీలలో వార్డు అధికారులు , ఇరిగేషన్ అధికారులు ,రెవెన్యూ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు తో ఒక బృందంగా ఏర్పడి పరిశీలన జరపాలని అన్నారు. మార్చి 31 లోగా ఎల్ ఆర్ఎస్ డబ్బులు పూర్తిగా చెల్లించిన వారికి రాయితీ వర్తిస్తుందన్నారు. ఈరాయితీని సద్వినియోగం చేసుకొని దరఖాస్తుదారులందరూ ప్రయోజనం పొందేలా అధికారులు అవగాహన కల్పించాలని ,ఫోన్ ద్వారా సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులన్నీ క్షేత్ర స్థాయి పరిశీలన జరిపి ఎల్ఆర్ఎస్ డబ్బులు చెల్లించిన వారు ఎంతమంది అన్న వివరాలు ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, జెడ్పి సిఇఒ జానకి రెడ్డి, జిల్లా రిజిష్టర్ సుబ్బలక్ష్మి, డిపిఒ సాయిబాబా, ఆర్డిఓలు, మున్సిపల్ కమిషనర్లు, తాసిల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## విమానానికి తప్పిన పెను ప్రమాదం

- గాలిలో చెక్కర్లు కొట్టిన విమానం
- ఏటీసీ అధికారులు చాకచక్యంతో తప్పిన ప్రమాదం



**శంషాబాద్, మార్చి 10 (జనంసాక్షి) :** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాలకు తప్పిన పెను ప్రమాదం. రెండు విమానాలకు ఒకేసారి ల్యాండింగ్ ఇవ్వడంతో ఏటీసీ అధికారుల సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో తప్పిన పెను ప్రమాదం. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో గోవా నుంచి వచ్చిన విమానానికి పెను ప్రమాదం తప్పింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం. ఇండిగో ఎయిర్ లైన్స్ కు చెందిన 6ఇ6973 విమానం 150 మంది ప్రయాణికులతో గోవా నుంచి విశాఖపట్నం వెళ్తోంది. శంషాబాద్ నుంచి వెళ్తుండగా ఎటిసి అధికారులు ల్యాండింగ్ కు అవకాశం ఇచ్చారు. ల్యాండింగ్ చేస్తున్న క్రమంలో ఎటిసి అధికారులు హైడ్రాలిక్ గేర్ ను సిద్ధం చేశారు. ల్యాండింగ్ చేయడానికి సిద్ధంగా ఉన్న సమయంలో మరో విమానం టేకాఫ్ అవుతుండడం గమనించి వెంటనే రివర్స్ టేకాఫ్ తీసుకుని విమానం గాల్లోకి లేవడంతో పెను ప్రమాదం తప్పింది. గాల్లో పది నిమిషాలు పాటు విమానం చక్కర్లు కొట్టిన అనంతరం విమానం సురక్షితంగా ల్యాండ్ చేశారు. దీంతో ప్రయాణికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కొద్దిసేపటికి విమానం విశాఖపట్నం వెళ్లిపోయింది.

## నంగునూరులో అరుదైన 'స్థాపనాచార్య' జైన శిల్పం



**నంగునూర్, మార్చి 10 (జనం సాక్షి) :** జైనధర్మంలో విగ్రహపూజ రావడానికి ముందు చిహ్నాల ఆరాధన ఉండేది. అందులో ధర్మచక్రం, మానస్తంభం, శిలాపటం, ఆయగపట్టాలు, స్తూపాలు, పంచ పరమేష్ఠి, సిద్ధచక్రం, అష్టమంగళాలు, త్రిరత్న, చైత్యవృక్షం, నందీశ్వర ద్వీపం, చరణపాదుకలు, నిశీధులు, స్థాపనాచార్యలు ముఖ్యమైనవి. జైన సాధువు, పుస్తకం, వ్యాసపీఠం, శిష్యులున్నట్టు చెక్కిన శిల్పాన్ని స్థాపనాచార్య అంటారు. పుస్తకగచ్ఛ, సరస్వతీ గచ్ఛగా గుర్తించబడ్డ ఇటువంటి శిల్పాలు ప్రాథమికంగా 'స్థాపనాచార్య'లే. కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ తన స్వంత గ్రామం నంగునూరులో స్థాపనాచార్య శిల్పాన్ని గుర్తించాడు. గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ఉన్న శిలాస్తంభాన్ని పరిశీలించి, అది జైన శిల్పమని ప్రాథమికంగా గుర్తించాడు. శిల్పంలో జైనగురువు, అతనికి రెండు పక్కల శ్రావకులు, కింద వ్యాసపీఠానికి రెండువైపుల అతని బోధన వింటున్న శిష్యులు కనిపిస్తున్నారు. ఈ శిల్పాన్ని పరిశీలించిన చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ ఇది 11,12వ శతాబ్దాలకు చెందిన జైన శిల్పాలలో అరుదైన స్థాపనాచార్య శిల్పం అని తెలిపారు. స్థపతి, మరియు చరిత్రకారుడు డా.ఈమని శివనాగిరెడ్డి గారు కూడా ఇదే విషయాన్ని నిర్ధారించారు. గతంలో లభించిన ఆధారాలను బట్టి గ్రామం పెద్ద జైన కేంద్రంగా ఉండేదని తెలిసింది. కానీ తాజాగా లభించిన ఈ శిల్పాన్ని బట్టి గ్రామం గొప్ప జైన విద్య కేంద్రంగా కూడా వెలుగొందిదని తెలుస్తుంది.

## నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- సిపిఎం డిమాండ్



**పెబ్బేరు, మార్చి 10 (జనం సాక్షి) :** పెబ్బేరు మండల కమిటీ ఆధ్వర్యంలో గుమ్మడం గ్రామంలో గడ్డివాములు దగ్ధమై, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం బృందం దగ్ధమైన గడ్డివాముల ను పరిశీలించారు అనంతరం నష్టపోయిన రైతులతో మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి బాల్ రెడ్డి, మండ్ల రాజు మాట్లాడుతూ గుమ్మడం గ్రామంలో ఆదివారం రోజు రాత్రి 7 గంటల సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నలుగురు రైతులకు సంబంధించిన వరి గడ్డివాములు, బుడ్డ పొట్టు దాదాపు 2 లక్షల విలువైన పశు గ్రాసం దగ్ధం కావడం జరిగింది. పశుగాసం దగ్ధం చేసిన వ్యక్తిని గుర్తించి చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, వారికి నష్టపరిహారం చెల్లించాలి, పశువులకు పశుగ్రాసం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ప్రజాప్రతినిధులు స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు . ఈ కార్యక్రమంలో సిపిఎం పెబ్బేరు శాఖ కార్యదర్శి ఎండి పెద్దకాజా సిపిఎం మాజీ ఎంపీటీసీ జి బాలయ్య, గుమ్మడం సిపిఎం నాయకులు వెంకటస్వామి, గ్రామ పెద్దలు చెన్నయ్య, నాగేష్ నష్టపోయిన రైతులు కృష్ణయ్య, మాసూమ్, వెంకటేశ్వర్లు, బాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లా నూతన ఎస్పీగా పరితోష్ పంకజ్ బాధ్యతలు స్వీకరణ



**సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 10 (జనం సాక్షి) :** శాంతి భద్రతల రక్షణలో జిల్లా ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటానని సంగారెడ్డి జిల్లా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ పారితోష్ పంకజ్ పేర్కొన్నారు. గతంలో ఎస్పీగా పని చేసిన చెన్నూరి రూపేష్ బదిలీపై వెళ్లడంతో ఎస్పీ స్థానంలో పరితోష్ పంకజ్ సోమవారం భాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఎస్పీ 2020 బ్యాచ్‌కు చెందిన వారు. స్వస్థలం ఆరా పట్టణం, బోజ్పూర్ జిల్లా, బీహార్ రాష్ట్రం. గతంలో భద్రాచలం అదనపు ఎస్పీగా, భద్రాద్రి కొత్తగూడెం ఓ.యస్.డిగా భాధ్యతలు నిర్వర్తించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ డ్యూటి పరంగా లేదా పర్సనల్‌గా ఎలాంటి సమస్యలున్నా నేరుగా నా దృష్టికి తీసుకురాలని, సిబ్బంది సంక్షేమానికి కట్టుబడి ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ. సంజీవ రావ్, ఎ.ఓ ఇ. కళ్యాణి, డియస్పీ లు రవీందర్ రెడ్డి, సత్యయ్య గౌడ్, రామ్ మోహన్ రెడ్డి, వెంకట రెడ్డి, సురేందర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, ఎఆర్ డియస్పీ నరేందర్, జిల్లా ఇన్స్పెక్టర్స్, సబ్-ఇన్స్పెక్టర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## పదోన్నతి ఉత్సాహంతో పాటు బాధ్యత పెంచుతుంది



**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 10 (జనం సాక్షి) :** ఉద్యోగులకు పదోన్నతులు ఉత్సాహంతో పాటు బాధ్యతలను పెంచుతుందని జిల్లా ఎస్పి యోగేష్ గౌతం అన్నారు.ఏ ఆర్ ఎస్సై.ఎం ఎన్ మద్దయ్య జోగులాంబ గద్వాల జిల్లాలో విధులు నిర్వర్తిస్తూ ఆర్ ఎస్సై గా పదోన్నతి పొంది బదిలీపై నారాయణపేట జిల్లాకు వచ్చారు. సోమవారంజిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్, ప్రధాన కార్యాలయంలో పూల మొక్క అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ ప్రమోషన్ పొందిన మద్దయ్యకు రెండు స్టార్లను అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ప్రజలకు మంచి సేవలు అందించాలని సూచించారు.

## కలెక్టర్ కార్యాలయం ముందు రైతుల నిరసన



**గద్వాల్ రూరల్, మార్చి 10 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు ప్రభుత్వం కొనుగోలు చేసిన వడ్లకి 500 రూపాయలు బోనస్ ఇవ్వడం లేదంటూ కలెక్టర్ కార్యాలయ గేట్ ముందు బైఠాయించి రైతులు నిరసన వ్యక్తం చేశారు.జిల్లాలోని వివిధ మండల గ్రామాల రైతులకు ఇప్పటి వరకు వడ్ల బోనస్ తమ బ్యాంకు ఖాతాలకు జమ కాలేదని రైతులు ఆవేదనతో నిరసన వ్యక్తం చేపట్టి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న వడ్ల రైతులకు 33కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు 18 కోట్ల రూపాయలు మాత్రమే బోనస్ ఇచ్చారు అన్ని ఇంకా 15 కోట్ల రూపాయలు రైతులకు బోనస్ చెల్లించాల్సి ఉందని తక్షణమే ప్రభుత్వము,జిల్లా అధికారులు,నాయకులు స్పందించి రైతులకు ఇవ్వవలసిన బోనస్ వారి బ్యాంకు అకౌంట్లో జమ అయ్యే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య నాయకులు రైతులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల వల్ల పోరాట పటిమ అలవడుతుంది

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి, మార్చి 10 (జనంసాక్షి) :** క్రీడల్లో పాల్గొనడం వలన పోరాట పటిమ అలవడుతుందని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి ఉద్బోధించారు. జిల్లా కేంద్రంలోని సిల్వర్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన డిస్ట్రిక్ట్ లెవెల్ బ్యాడ్మింటన్ పోటీలలో డబుల్స్, సింగిల్స్ విభాగాల్లో విజేతలుగా నిలిచిన సయ్యద్ మరియు జీషాన్ ను మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి సోమవారం తన నివాసంలో అభినందించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి ప్రతి రోజు క్రీడల సాధన చేయడంతో శారీరక మానసిక ప్రశాంతత నెలకొంటుందని అన్నారు. రానున్న కాలంలో పాఠశాలల్లో చదువుతో పాటు ఆటలను కూడా పాఠ్యాంశాలుగా అమలు చేసే దిశగా ప్రభుత్వాలు యోచిస్తున్నాయని అన్నారు. వనపర్తి పట్టణంలోని సిల్వర్ జూబ్లీ రిక్రియేషన్ క్లబ్ అధ్వర్యంలో సామాజిక సేవలు కూడా చేపట్టాలని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి సుచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నందిమల్ల అశోక్, బండారు కృష్ణ,పెద్దింటి వెంకటేష్, జోహెబ్ హుస్సేన్,ధర్మా నాయక్, మురళీ సాగర్, నీలస్వామి, శ్రీను,చిట్యాల రాము, సల్మాన్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## నవజాత శిశువును కాపాడిన 108 సిబ్బంది



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, మార్చి 10 (జనం సాక్షి) :** మండలంలోని రాయికోడు గ్రామానికి చెందిన అఖిల తన మొదటి కాన్పు కోసం నర్వ ప్రభుత్వాసుపత్రికి వచ్చింది. తనకు మొదటి కాన్పులో మగ శిశువు ఆస్పత్రిలోనే జన్మించిన తరువాత ఆ నవజాత శిశువు కదలికలు లేకపోవడం, శ్వాస లేకపోవడం, పుట్టగానే ఏడవకపోవడం, తల్లి కడుపులోనే ఉమ్మనీరు మింగడంతో, ఆన వజాత శిశువు చనిపోయిందని అందరూ భావించారు. వెంటనే ఆసుపత్రిలో డ్యూటీ లో ఉన్న నర్సు తో పాటు బంధువులు 108 అంబు లెన్సుకి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న నర్వ అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలాన్ని చేరుకొని, శిశువును ఆసుపత్రిలో నుంచి అంబులెన్స్‌లోకి తీసుకొని, ఈఆర్‌సిపి డాక్టర్ శివ, మౌనిక సూచనలతో సిపిఆర్ చేస్తూ 108 ఈఎంటి రాజకుమార్ ప్రథమ చికిత్స చేయడం వల్ల నవజాత శిశువును బతికించారు. మహబూబ్నగర్ జిల్లా ఆస్పత్రి చిన్న పిల్లల వైద్యురాలు, డాక్టర్ మమతా,నర్వ 108 అంబులెన్స్ సిబ్బందిని బంధువులు,జీవీకే.ఈ ఎం ఆర్ ఐ సంస్థ అధికారులు, జిల్లా ఆస్పత్రి సూపర్డెంట్ సిబ్బందిని అభినందించారు.

## పోలీస్టేషన్లకు అధునాతన కంప్యూటర్లను అందజేసిన జిల్లా ఎస్పీరావుల గిరిధర్




**వనపర్తి క్రైమ్, మార్చి 10 (జనంసాక్షి) :** మారుతున్న కాలానుగుణంగా పోలీసు వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి అధునాతన కంప్యూటర్లు అవసరమని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శాంతిభతులను కాపాడే పోలీసు శాఖలో జిల్లాలోని అన్ని గ్రామాల అన్ని విభాగాల సమాచారం అందుబాటులో ఉండాల్సి ఉంటుంది కాబట్టి జిల్లా, మండల పరిధిలోని గ్రామాల వివరాలతో పాటు నేర సంబంధితమైన విషయాలు భద్ర పరచడానికి సులభంగా తెలుసుకోవడానికి సంబంధిత విషయాలను డటాను పై అధికారులకు తెలియపరచడానికి సోమవారం జిల్లా పోలీసుకార్యాలయంలో కంప్యూటర్లు,ప్రింటర్లు వివిధ అధునాతన ఎలక్ట్రానిక్ పరికరాలను జిల్లాలో అన్ని పోలీస్టేషన్ల పోలీసు అధికారులకు అందజేశారు.జిల్లా పోలీసుశాఖలో హెూంగార్డు నుండి ఆ పైస్థాయి అధికారులు వరకు ఉన్నత చదువులు అభ్యసించి ఉద్యోగులు ఉండటం వలన ఇలాంటి అనునాతన పరికరాలు, ఉపకరణాలు అందజేయడం పట్ల ఉద్యోగులు వీటి సహకారంతో ఎస్టీ రెట్టింపు ఉత్సాహంతో పనిచేసే చేస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పీ ఇన్చార్జ్ అదనపు ఎస్పి, ఉమామహేశ్వరరావు, వనపర్తి సీఐ కృష్ణ రిజర్వ్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై శివకుమార్, జిల్లా కార్యాలయం స్టోర్ సిబ్బంది,సుదర్శన్,భరత్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ప్రజావాణికి 187 ఫిర్యాదులు




**హైదరాబాద్ సిటీ, మార్చి 10 (జనంసాక్షి) :** ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమీషనర్ ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి, పరిష్కారంకై సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు.ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ... ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయరాదని, ఎప్పటికప్పుడు పరిష్కరించడం పై దృష్టి సారించాలన్నారు.జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 79 ఫిర్యాదులు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ 49, ట్యాక్స్ సెక్షన్ 12, ఇంజనీరింగ్, అడ్మినిస్ట్రేషన్ లకు మూడు చొప్పున, యుసిడి, హెల్త్, ఫైనాన్స్ లకు రెండు చొప్పున, జోనల్ ఆఫీస్ (కూకట్ పల్లి), శానిటేషన్, ఎలక్ట్రికల్, లేక్స్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా రెండు ఫిర్యాదులు అందాయి. జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 108 ఫిర్యాదులు అందగా, అందులో కూకట్ పల్లి 56, సికింద్రాబాద్ 13, శేరిలింగంపల్లి 18, చార్మినార్, ఎల్బీనగర్ 10 చొప్పున, ఖైరతాబాద్ జోన్‌లో ఒక్క ఫిర్యాదు అందింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్, గీతా రాధిక, పంకజ, వేణుగోపాల్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, సీపీ పి శ్రీనివాస్, సి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ పద్మజ, యుబిడి డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు, వెటర్నరీ చీఫ్ అబ్దుల్ వకీల్, అడిషనల్ సిసిపి గంగాధర్, జోనల్ సిపి లు, ఎస్టేట్ అధికారి ఉమా ప్రకాష్, డిప్యూటీ సీఈ పనస రెడ్డి, హౌసింగ్ ఈఈ లు పీవీ రమణ, రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# 102 మంది పిల్లలకు ప్రత్యేక ఉపకరణాలు

- భవిత కేంద్రాల ద్వారా విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి



**సంగారెడ్డి ప్రతినిధి, మర్చి 10 (జనంసాక్షి) :** జిల్లాలో వివిధ మండలాలకు చెందిన గుర్తించిన 102 మందిని పిల్లలను గుర్తించి వివిధ రకాలకు చెందిన 214 సహాయ ఉపకరణాలను అందజేయడం జరిగిందని కలెక్టర్ క్రాంతి వల్లూరి తెలిపారు. సోమవారం సంగారెడ్డి పట్టణం, సంజీవ్ నగర్ కాలనీ లోని భవిత సెంటర్ లో జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్ష పథకం, అలిమ్కో సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక పిల్లలకు ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు అన్ని రకాల అవసరాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక విద్య ఫిజియోథెరపీ ఇంటి వద్దనే విద్య సహాయ ఉపకారణాలు, ప్రత్యేక ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు జిల్లాలోని అన్ని మండలాలలో దివ్యాంగ విద్యార్థులకు అన్ని రకాల సేవలు సమగ్ర శిక్ష పతకం, విద్యాశాఖ ఆధ్వర్యంలో అందిస్తున్నట్లు తెలిపారు. మండల కేంద్రాలలోని మండల వనరుల కేంద్రంలో ప్రతి వారం ఫిజియోథెరపీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో వివిధ మండలాలకు చెందిన 102 మందికి పిల్లలకు వివిధ రకాల కు చెందిన 214 వీల్ చైర్లు ,ట్రై సైకిల్లు, చెవిటి మిషన్ , రోలాటర్, టిఎల్ఎం కిట్లు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భవిత కేంద్రాల ద్వారా విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్, కనీస స్థాయి సామర్థ్యాలు పెంపొందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశం, మండల విద్యాధికారి విద్యాసాగర్, వివిధ మండలాల సమగ్ర శిక్ష ప్రత్యేక ఉపాధ్యాయులు ,ఉపకరణాలు పొందిన విద్యార్థులు విద్యార్థులు ,తల్లిదండ్రులు అర్హత పొందిన ప్రత్యేక అవసరాలు గల పిల్లలు పాల్గొన్నారు.

# వరకట్నం, బాల్యవివాహాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం

**● జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి బ్యూరో, మార్చి 10 (జనంసాక్షి) :** వరకట్నం, బాల్యవివాహాలు లేని సమాజాన్ని నిర్మిద్దామని,అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని,జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు.

సోమవారం జిల్లా కలెక్టరేట్ లోనికి సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ వనపర్తి జిల్లాలోని మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో స్త్రీ పురుషులు ఇద్దరు సమానమేనని, లింగ సమానత్వం ప్రతి ఒక్కరి ఇంటి నుంచే ప్రారంభం కావాలని విజ్ఞప్తి చేశారు. వరకట్నం, బాల్యవివాహాలు లేని సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. గర్భిణీలకు లింగ నిర్ధారణ పరీక్షలు చేయించడం నేరమని, అటువంటి చర్యలకు సపోర్ట్ చేసేవారు కూడా నేరం చేసినట్లేనని అన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠినచర్యలు ఉంటాయని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వాలు మహిళల కోసం ఎన్నో పథకాలు అందుబాటులోకి తెస్తున్నాయని వాటిని మహిళలు అందిపుచ్చుకొని ముందుకు రాణించాలని చెప్పారు. మహిళా శక్తి ద్వారా మన రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను మహిళలకు చేరువ చేసిందని, వాటి ద్వారా మహిళలు సమాజంలో ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. బాలికల కోసం సుకన్య సమృద్ధి యోజన అనే ఒక గొప్ప పథకం అందుబాటులో ఉందని దాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.మహిళలు తమ ఆర్థిక లావాదేవీలపై తాము నియంత్రణ కలిగి ఉన్నప్పుడే ముందుకు రాణించగలరని చెప్పారు. మహిళలు ఆర్థికంగా బలంగా ఉంటే వారిని ఎవరు ఏమీ చేయలేరని చెప్పారు. అదేవిధంగా మహిళలు తమ ఆరోగ్యంపై స్వయంగా జాగ్రత్తలు వహించాలని కలెక్టర్ సూచించారు. జాగ్రత్తలు వహించడం ద్వారా రొమ్ము క్యాన్సర్ అనే మహమ్మారిని దరిచేరనీయకుండా చేయవచ్చని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో ఎంతో మంది బాలికలు, మహిళలు చదువు, క్రీడలు, వైద్యం సహా అనేక రంగాల్లో రాణిస్తున్నారని అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజంలో మహిళలని గౌరవించడం ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం మహిళల్ని కోటీశ్వరుని చేసేందుకు ఎన్నో కార్యక్రమాల్ని అందుబాటులోకి తెచ్చిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య మాట్లాడుతూ గతంతో పోలిస్తే మహిళలు ఇప్పుడు అన్ని రంగాల్లో చాలా మెరుగ్గా రాణిస్తున్నారని చెప్పారు. మన దేశానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి సహా ఎంతో మంది మహిళలు వివిధ రంగాల్లో రాణిస్తున్నారని వారిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరు అభివృద్ధి సాధించాలని చెప్పారు. అదేవిధంగా పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి సారించి, వారు తప్పుడు మార్గంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు.డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజం అభివృద్ధి చెందాలంటే మహిళల పాత్ర ఎంతో కీలకమని, అబ్బాయిలతో సమానంగా వారికి కూడా సమానమైన విద్యా అవకాశాలు కల్పించి ప్రోత్సహించాలన్నారు. మహిళల కోసం రాజ్యాంగంలో ఎన్నో చట్టాలు ఉన్నాయని వాటి పట్ల అవగాహన కలిగి ఉండాలని చెప్పారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలో వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని మోమెంటును అందజేశారు.జిల్లాలోని మహిళల అనేక కార్యక్రమాలు చేపడుతున్న జిల్లా కలెక్టర్కు జిల్లా సంక్షేమ శాఖ తరపున మొమెంటును అందజేశారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సిగ్నేచర్ క్యాంపెయిన్పై జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. అదేవిధంగా, గర్భిణీల లింగ నిర్ధారణ పరీక్షలకుకు వ్యతిరేకంగా ఆర్డీఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, ఆర్డీఎస్ అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్, వివిధ శాఖలకు చెందిన మహిళ అధికారులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఆసుపత్రిలో వైద్య సేవలను మెరుగుపరచాలి



**● జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 10 (జనం సాక్షి) :** జిల్లా ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత మెరుగుప రచాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు.ఈ వేసవికాలం ఎండలు తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, వైద్యశాఖ పరంగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని ఆమె తెలిపారు. జిల్లా జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్) సమన్వయకర్తగా ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామ్ కిషన్ ఇటీవలే బాధ్యతలు చేపట్టడంతో సోమవారం కలెక్టర్ జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఆస్పత్రి సమన్వయకర్త డాక్టర్ రామ్ కిషన్, వైద్య నిపుణులు డాక్ట ర్ మల్లికార్జున్, డాక్టర్ మోహన్తో జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలు, క్యాడర్ స్ట్రెంత్, బడ్జెట్ తదితర అంశాలపై కలెక్టర్ చర్చించారు. ఇకనుంచి మెడి కల్ కళాశాలతో పాటు జిల్లా ఆస్పత్రి పర్యవేక్షణను చూసుకోవాలని ప్రిన్సిపాల్ రామ్ కిషన్కు ఆమె సూచించారు. ఒక జూనియర్ అసిస్టెంట్, ఒక సీనియర్ అసిస్టెంట్ అవసరమని, ఎవరినైనా డిప్యూట్ చేయించాలని డాక్టర్ రామ్ కిషన్ ఈ సందర్భంగా కలెక్టర్ను కోరారు. జిల్లా ఆసుపత్రి, చిన్న పిల్లల ఆసుపత్రిలో 20 మంది శానిటేషన్ వర్కర్లు పని చేస్తున్నారని, అదనంగా అవసరం అయితే తీసుకో వాల్సి వస్తుందని ఆయన తెలిపారు.శానిటేషన్ వర్కర్లకు వేతనం ఎలా చెల్లిస్తారని కలెక్టర్ ప్రశ్నించగా, వారికి థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారానే నేరుగా వారి ఖాతాల్లోనే వేత నాలు జమ అవుతాయని ప్రిన్సిపల్ డాక్టర్ రామ్ కిషన్ తెలిపారు.

## బాలికలు ఆత్మరక్షణలో నైపుణ్యం కలిగి ఉండాలి

**● జిల్లా న్యాయ సేవఅధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వి రజని**




**ఖిల్లాఘనపూర్, మార్చి 10 (జనంసాక్షి) :** బాలికలు మహిళలు ఆత్మరక్షణ విద్యలో అత్యున్నతమైన నైపుణ్యం కలిగి ఉండాలని, సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులను ధైర్యంగా ఎదుర్కోవాలని, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి వి రజని అన్నారు. సోమవారం ఖిల్లా గణపురం మండల కేంద్రంలో నీ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం, తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడియాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యి మాట్లాడారు జిల్లా న్యాయ సేవ సంస్థ పనితీరు గురించి ,ఏ విధముగా సంస్థ సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలలో, విద్యార్థులలో చట్టాలపై అవగాహన కల్పిస్తుందో తెలియజేశారు. కార్యక్రమము ముఖ్య ఉద్దేశమైన చట్టాలను వివరించడంలో భాగంగా బాల్యవివాహాల చట్టం పోక్సో యాక్ట్ మోటార్ వెహికల్ యాక్ట్ బాల కార్మికుల చట్టం గురించి తెలియజేశారు. అదేవిధంగా పిల్లలు మొబైల్ లో వీడియో గేమ్స్ ఆడుతూ గుర్తుతెలియని లింక్స్ ను క్లిక్ చేయరాదు అని అలా చేయడం వల్ల తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బులను సైబర్ నేరగాళ్లు దోచుకుంటారని తెలియజేశారు.ఉచిత న్యాయ సలహాల కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించవచ్చు అని తెలియజేశారు.ఈ కార్యక్రమాలలో బాలికలు ప్రదర్శించిన ఆత్మరక్షణ విద్యలు నృత్య ప్రదర్శనలు, ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలలో సఖి లీగల్ కౌన్సిల్ డి కృష్ణయ్య, ఎం ఈ ఓ జయశంకర్,పారా లీగల్ వాలంటరీ అహ్మద్, ప్రధానోపాధ్యాయులు మునావర్ సుల్తానా, లలిత ప్రశాంతి, ఆత్మరక్షణ విద్య గురువులు శేఖర్ వరుణ్ శివ పాల్గొన్నారు.

# రంజాన్ మాసం.. వరాల వసంతం






**ఖమ్మం, మార్చి 10 (జనం సాక్షి) :** రమజాన్ మహామాసం వరాలు కురిపించే మాసమని, ఈ నెలలో ప్రతి ఒక్కరూ.. ఎంత వీలైతే అంత సమయం ఖురాన్ తో గడపాలని, ధాన ధర్మాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ ఖాన్ ఖాస్మీ అన్నారు. నగర శివారు గొల్లగూడెంలోని తాలిముల్ ఇస్లాం మదర్సాలో ఖత్మే ఖురాన్ వేడుక ఘనంగా జరిగింది. తరావీహ్ నమాజ్ లో కేవలం తొమ్మిది రోజుల్లోనే ఖురాన్ పఠనం పూర్తి చేసిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఖత్మే ఖురాన్ సందర్భంగా దువా చేయడానికి ముందు జరిగిన ఆధ్యాత్మిక సభలో ముఫ్తీ రవూఫ్ ఖాన్ ప్రధాన ఉపన్యాసం చేశారు. మనిషి తన జీవితంలో చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తం పొంది.. అల్లాహ్ చూపిన మార్గానికి దగ్గరయ్యేందుకు రమజాన్ కు మించిన మాసం మరొకటి లేదన్నారు. ఈ నెలలో ఒక సత్కార్యం చేస్తే.. ఏడు రెట్ల పుణ్యం లభిస్తుందని ఆయన చెప్పారు. అందుకే ఈ మాసాన్ని ప్రతి ఒక్కరూ సత్కార్యాలతో సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మనిషి ఎప్పటికీ అల్లాహ్ పై విశ్వాసం కోల్పోవద్దని, ఆయనను ప్రసన్నం చేసుకోవడం ద్వారా ఏది అడిగితే అది పొందవచ్చని అన్నారు. ఖురాన్ పఠనం మాత్రమే పూర్తయిందని.. తరావీహ్ నమాజ్ ప్రతి ఒక్కరూ రమజాన్ నెలంతా కొనసాగించాలని ఆయన సూచించారు. ఈ నమాజ్ లో ఖురాన్ వినడం ప్రతి ఒక్కరికీ.. విధిగా నిర్ణయించబడిందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ రమజాన్ ప్రాధాన్యత ను గుర్తించి మెసులుకోవాలని ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ ఖాన్ ఖాస్మీ సూచించారు. అంతకు ముందు మదర్సాలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కు నగరంలోని పలు ప్రాంతాల ముస్లింలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో అఫ్జల్ హసన్, సయ్యద్ ఇస్మాయిల్, యాకుబ్ పాష, ఖాజా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## సంగమేశ్వర ప్రాజెక్టు కోసం పోరుబాట

**● మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్**



రాయికోడ్, మార్చి 10 (జనం సాక్షి) : సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్టు నిర్మించకపోతే త్వరలో పోరుబాట ప్రారంభించనున్నట్లు అందోల్ మాజీ శాసనసభ్యులు చంటి క్రాంతి కిరణ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని రాయిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్త సిద్ధప్ప నూతన గృహప్రవేశానికి హాజరైన అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులతో రెండు లక్షల నలబై ఎకరాలకు భూమి సస్యశ్యామలం కావాలనే సదుద్దేశంతో మహత్తరమైన నటువంటి కార్యక్రమం నిర్వహించారు. ఆందోల్, జహీరాబాద్, నారాయణఖేడ్, సంగారెడ్డి నియోజకవర్గ రైతులకు ఎంతో మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్టులను ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంచారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మేలు కలిగించే ప్రాజెక్టును త్వరలో ప్రారంభం చేయకుంటే రైతులతో కలిసి పోరుబాట ప్రారంభిస్తానని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు విట్టల్ , బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శంకర్, పార్టీ ఉపాధ్యక్షులు మల్లేష్,వరం వైస్ చైర్మెన్ తుకారాం, పిఎసిఎస్ ఇందూర్ చైర్మన్ హనుమంతు, మాజీ సర్పంచులు శంకర్ ,కిష్టారెడ్డి, అడివయ్యా, ఎంపీటీసీ విష్ణువర్ధన్, నిరంజన్ నాయకులు బసవరాజ్ పటేల్ ,మల్లు పటేల్, యూత్ అధ్యక్షులు అంజి మండల నాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ప్రజావాణికి 187 ఫిర్యాదులు




**హైదరాబాద్ సిటీ, మార్చి 10 (జనంసాక్షి) :** ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమీషనర్ ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి, పరిష్కారం కై సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు.ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ... ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయరాదని, ఎప్పటికప్పుడు పరిష్కరించడం పై దృష్టి సారించాలన్నారు.జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 79 ఫిర్యాదులు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ 49, ట్యాక్స్ సెక్షన్ 12, ఇంజనీరింగ్, అడ్మినిస్ట్రేషన్ లకు మూడు చొప్పున, యుసిడి, హెల్త్, ఫైనాన్స్ లకు రెండు చొప్పున, జోనల్ ఆఫీస్ (కూకట్ పల్లి), శానిటేషన్, ఎలక్ట్రికల్, లేక్స్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా రెండు ఫిర్యాదులు అందాయి. జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 108 ఫిర్యాదులు అందగా, అందులో కూకట్ పల్లి 56, సికింద్రాబాద్ 13, శేరిలింగంపల్లి 18, చార్మినార్, ఎల్బీనగర్ 10 చొప్పున, ఖైరతాబాద్ జోన్లో ఒక్క ఫిర్యాదు అందింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్, గీతా రాధిక, పంకజ, వేణుగోపాల్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, సీపీ పి శ్రీనివాస్, సి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ పద్మజ, యుబిడి డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు, వెటర్నరీ చీఫ్ అబ్దుల్ వకీల్, అడిషనల్ సిసిపి గంగాధర్, జోనల్ సిపి లు, ఎస్టేట్ అధికారి ఉమా ప్రకాష్, డిప్యూటీ సీఈ పనస రెడ్డి, హౌసింగ్ ఈఈ లు పీవీ రమణ, రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ అభివృద్ధికి శాంతకుమారి దూబె సేవలు వెలకట్టలేనివి

**● రాష్ట్ర పిఎసి చైర్మన్ అరికెపూడి**



**శేరిలింగంపల్లి, మార్చి 10 (జనంసాక్షి) :** ఉపాధ్యాయురాలిగా దశాబ్దాల పాటు సేవలందిస్తూ ఎంతోమంది ఉత్తమ పౌరులను సమాజానికి అందించిన శాంతకుమారి దూబె... విద్యారంగ అభివృద్ధి కోసం నిర్వహించిన పాత్ర వెలకట్టలేనిదని రాష్ట్ర ప్రజా పద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధి లక్ష్మీ విహార్ కాలనీలో శాంత కుమారి దూబె నివాసంలో సోమవారం నిర్వహించిన 37వ వివాహ వార్షికోత్సవానికి శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ వాలిదాసు జగదీశ్వర్ గౌడ్, శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శాంత కుమారి దూబె మరియు ఆమె భర్త అరవింద ప్రసాద్ దూబె దంపతులను శాలువాలు కప్పి పూల బొకేలను అందించి అరికపూడి తదితరులు ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ శేరిలింగంపల్లి పరిధిలో నివాసం ఏర్పరచుకొని గత 37 సంవత్సరాలుగా ఉపాధ్యాయురాలిగా ఎంతో మంది విద్యార్థులకు కుణాత్మక విద్యను అందించి వారి జీవన నిర్మాణానికి దిశా నిర్దేశం చేస్తూ భారతీయ ఉత్తమ పౌరులను తీర్చిదిద్దిన ఘనత ఆమెకు దక్కుతుందన్నారు. ఇప్పటికే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా విద్యాధికారుల నుండి అవార్డులు అందుకున్న శాంతకుమారి ఎన్నో గౌరవ పురస్కారాలను, సన్మానాలను అందుకోవడం ఆమె ఉద్యోగ నిబద్ధతకు నిదర్శనమన్నారు. సమాజంలో ఎంతో విలువైన స్థానంలో ఉన్న ఉపాధ్యాయ వృత్తి అనునిత్యం పూజించదగినదని, అందుకే గురువును దైవంతో సమానంగా భావిస్తారని అరికపూడి తెలిపారు. దేశ భవిష్యత్తు తరగతి నాలుగు గోడల మధ్యనే నిర్మితమవుతుందన్న మహనీయుల సూక్తులను తాను విశ్వసిస్తానని, తన జీవిత ఎదుగుదలలో ఎంతో మంది గురువుల పాత్ర ఉందని ఈ సందర్భంగా అరికపూడి గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయులను గౌరవించిన రోజునే సమాజ పురోభివృద్ధి సాధ్యపడుతుందని, గురువు దిశానిర్దేశం లేని జీవితం చుక్కాని లేని నావ వంటిదని వారు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘునాథ్ రెడ్డి, కాశి రెడ్డి, భాస్కర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, గోవర్ధన్ గౌడ్ పాల్గొన్నారు.

## నేర రహిత సమాజ నిర్మాణంలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

**● జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**



**శ్రీరంగాపూర్, మార్చి 10 (జనం సాక్షి) :** సిసి కెమెరాలు నేరాలను నియంత్రించడంతో పాటు నేరస్థులను గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలకంగా నిలుస్తాయని వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ ఐపిఎస్అన్నారు. సోమవారం రోజు వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో మరియు గ్రామాలలో దాతలు, ప్రజల భాగస్వామ్యంతో పోలీసుశాఖ ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు, కంట్రోల్ పాయింట్లను శ్రీరంగాపూర్ పోలీస్ స్టేషన్లో జిల్లా ఎస్పీరావుల గిరిజన ఐపిఎస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతతో సిసి కెమెరాలు అందుబాటులోకి వస్తున్నాయని, వీటిని ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయడం ద్వారా నేర రహిత సమాజాన్ని నిర్మించడంలో సిసి కెమెరాలు కీలకంగా మారుతున్నాయని చెప్పారు. అనేక కేసులును ఛేదించడంలో, దొంగతనాలు జరిగినప్పుడు సిసి కెమెరాల ద్వారా నిందితులను గుర్తించినట్లు ఆయన తెలిపారు. ప్రతి గ్రామంలో సిసి కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని అప్పుడే గ్రామీణ ప్రాంతాలలో నేరాలను నియంత్రించడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రశాంత వాతావరణం కల్పించేలా చేయడంలో సిసి కెమెరాలు ఉపయోగపడతాయని ఆయన చెప్పారు. అంతే కాకుండా రోడ్డు ప్రమాదాలు జరిగే సందర్భంలో చాలా కేసులలో గుద్ది పారిపోయే వాహనాలను గుర్తించే అవకాశం సైతం సిసి కెమెరాలతో కలుగుతుందన్నారు. శ్రీరంగాపూర్ మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు పోలీసుశాఖ తీసుకుంటున్న చర్యలను సహకరిస్తూ ప్రతి గ్రామంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసేలా చూడాలని ఆయన కోరారు. శ్రీరంగాపూర్ ఎస్సై. రామకృష్ణ.చొరవ, ప్రత్యేక కృషితో పాటు గ్రామస్తులకు సిసి కెమెరాల ఏర్పాటు పట్ల.అవగాహన కల్పించి చైతన్యం చేయడం ద్వారా ప్రజలు ముందుకు రావడం అభినందనీయమని ఎస్పీ చెప్పారు. అనంతరం సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించి ఆర్థిక సహాయం చేసిన దాతలను జిల్లా ఎస్పీ గారు శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో కొత్తకోట సిఐ,రాంబాబు, శ్రీరంగాపూర్ ఎస్సై రామకృష్ణ, స్నేహ ఫౌండేషన్, రామేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, సింగల్ విండో చైర్మన్ జగన్నాథం నాయుడు, రైస్ మిల్ ఓనర్స్ వెంకటేశ్వర్ రెడ్డి భాను ప్రకాష్ రెడ్డి ప్రభాకర్ నారాయణ వివిధ పార్టీల నాయకులు శ్రీహరి రాజు, మహిరుద్దీన్, మాజీ ఎంపీటీసీ ఎల్లస్వామి, రామేశ్వర్ రెడ్డి, రాముడు, గంగాధర్, రాధాకృష్ణ, గ్రామ ప్రజలు, యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# పారమిత విద్యాసంస్థలలో విద్యార్థుల సృజనాత్మకతకు పట్టం

**•ఘనంగా ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్ ఎగ్జిబిషన్, అవార్డుల ప్రదానోత్సవం**

కరీంనగర్ బ్యూరో, మార్చి 10 (జనంసాక్షి)

స్థానిక మంకమ్మతోట లోని పారమిత ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాస ప్రదర్శన ఇంటర్ పి. బి. ఎల్ ముగింపు వేడుకలలో శాతవాహన విశ్వవిద్యాలయ ఉప కులపతి యు.ఉమేష్ కుమార్ ముఖ్య అతిథి గా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు 275 మంది విద్యార్థులు పాల్గొన్న 55 ఉత్తమ ఇన్నోవేటివ్ గ్రూప్ ప్రాజెక్టులు ప్రదర్శించబడ్డాయి. పరిశోధన, సామాజిక శాస్త్రాల అనుసంధానం, సేకరణ వంటి వివిధ విభాగాల్లో ఈ ప్రాజెక్టులు విద్యార్థుల నైపుణ్యాలను, జ్ఞానాన్ని, ప్రతిభను చాటి చెప్పాయి. ఈ 55 ప్రాజెక్టులు ఈ నెల ప్రారంభంలో జరిగిన ఇంట్రా ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్ స్కూల్ ఎగ్జిబిషన్ నుండి ఎంపిక చేయబడ్డాయి, ఇందులో 1500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తెలంగాణ మహారాష్ట్రలోని ప్రముఖ విద్యాసంస్థల నుండి వచ్చిన నిపుణుల బృందం ఈ ప్రాజెక్టులను మూల్యాంకనం చేసింది. ప్రతి తరగతి నుండి మొదటి మూడు ప్రాజెక్టులను వారి సృజనాత్మక విధానం, అత్యుత్తమ పనితీరు, వినూత్న పరిష్కారాల ఆధారంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఉమేష్ కుమార్ విజేతలకు అవార్డులు, సర్టిఫికేట్లు అందజేశారు. విద్యార్థుల సృజనాత్మకతను, కృషిని ఆయన ప్రశంసించారు. ఈ యువ మనసులు సమర్పించిన వినూత్న ఆలోచనలు, పరిష్కారాలు నన్ను ఆకట్టుకున్నాయని డాక్టర్ ఉమేష్ కుమార్ అన్నారు. ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్ ద్వారా పారమిత పాఠశాల తన విద్యార్థులకు పరిశోధన ఆధారిత విద్యను అందిస్తోంది, ఇది ప్రస్తుత సామాజిక సవాళ్లకు వినూత్న మైన పరిష్కారాలను కనుగొనడానికి వారిని సిద్ధం చేస్తుంది. ఈ ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసన ద్వారా గత 9 సంవత్సరాలుగా దాదాపు 30 వేలకు పైగా విద్యార్థులు 500 కు పైగా ఉపాధ్యాయులు ప్రయోజనం పొందారని పి.బి.ఎల్ హెడ్ లలిత్ మోహన్ సాహు తెలిపారు. ఈ సందర్భంగా పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాద్ రావు మాట్లాడుతూ... విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కారం, సహకారం వంటి ముఖ్యమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేశ్, ప్రాచీ, టి.యస్.వి.రమణ, వినోదరావు, వి.యు.ఎం.ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, శ్రీకర్, శర్మిష్ఠ, ప్రశాంత్, కవితాప్రసాద్, గోపీకృష్ణ, పి.బి.ఎల్ హెడ్ లలిత్ మోహన్ సాహు, పి.బి.ఎల్ సమన్వయకర్తలు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# రామగుండం సీపీగా అంబర్ కిషోర్ ఝా ఐపిఎస్

(ప్రత్యేక ప్రతినిధి/ జనంసాక్షి)



: రామగుండం పోలీస్ కమిషనరేట్ నూతన కమిషనర్ గా అంబర్ కిషోర్ ఝా ఐపిఎస్., డిఐజి ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ కమీషనర్ గా బాధ్యతలు చేపట్టిన అంబర్ కిషోర్ ఝా ఐపిఎస్., డి ఐ జి పోలీస్ కమీషనరేట్ చేరుకొని సాయుధ పోలీసులు వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనరేట్ కార్యాలయమునకు చేరుకున్న నూతన పోలీస్ కమిషనర్ గారు పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్., ఐజి నుండి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ ఐపిఎస్., , పెద్దపల్లి డీసీపీ కర్ణాకర్ మరియు పోలీస్ కమిషనరేట్ కు చెందిన ఇతర పోలీస్ అధికారులు నూతన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గారిని మర్యాదపూర్వకంగా కలుసుకోని పుష్పాగుచ్చాలను అందజేసి అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.... రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం 24 గంటల పాటు పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సత్ప్రవర్తన, మంచి నడవడిక కలిగిన వారికీ, ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేయడంతోపాటు చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తాము. నూతన టెక్నాలజీని నేరాల నియంత్రణకు కృషి చేస్తాము. ల్యాండ్ మాఫియా, డ్రగ్స్, గంజాయి రవాణా పట్ల ఉక్కు పాదం మోపుతాం. కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ ల ప్రజల సహకారంతో ముందుకెళ్తాము. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజల సమస్యలను త్వరిత గతిన పరిష్కరిస్తూ , చట్ట పరిధి లో కామన్ మ్యాన్ కు న్యాయం జరిగేలా చూస్తామని , ఏవైన ఇబ్బందులు ఎదురైతే నేరుగా అందుబాటులో వున్న డీసీపీలతో పాటు తనను కూడా నేరుగా కలువ వచ్చని వారికీ అండగా పనిచేస్తాం అన్నారు. 2009 ఐపిఎస్ బ్యాచ్ కు చెందిన అంబర్ కిషోర్ ఝా 2011లో మొదటగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎ.ఎస్పీగాను 2012 వరంగల్ ఓఎస్ డి గా, అదనపు ఎస్పీగా పనిచేయడంతో పాటు 2014లో వరంగల్ ఎస్పీగా పనిచేసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం భద్రాద్రి కొత్తగూడెం తోలి ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. అలాగే 2018లో హైదరాబాద్ సౌత్ జోన్ డిసిపిగాను ఇదే సంవత్సరంలో కేంద్ర సర్వీసుల్లో విధులు నిర్వహించారు. గతేడాది ఫిబ్రవరిలో డీఐజీగా పదోన్నతి పొంది రాచకొండ జాయింట్ సీపీగా పనిచేశారు. అనంతరం వరంగల్ సీపీగా పనిచేశారు. ప్రస్తుతం రామగుండం పోలీస్ కమీషనర్ గా నియమించబడ్డారు. నూతన సిపిని మర్యాదపూ ర్వకంగా అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు, మంచిర్యాల డీసీపీ ఏ.
భాస్కర్ ఐపిఎస్, పెద్దపల్లి డీసీపీ పి . కరుణకార్, పెద్దపల్లి, మంచిర్యాల జోన్ ఎసిపిలు, ఇన్స్పెక్టర్లు, ఏ ఆర్ ఏసీపీ లు, ఆర్.ఐలు ఇతర విభాగాలకు చెందిన అధికారులు సిబ్బంది ఉన్నారు.

# సత్వర ఆరోగ్య సేవలకు ప్రత్యేక యాప్

## ప్రారంభించిన ఎండీ అశోక్ రెడ్డి

హైదరాబాద్ (జనంసాక్షి)




జలమండలి ఉద్యోగుల ఆరోగ్య సేవల కోసం ప్రత్యేక యాప్ రూపొందించారు. బోర్డు పరిధిలో హెల్త్ కార్డు ఉన్నవాళ్లకు ఆరోగ్య సేవల్ని మరింత సులభతరం చేసేందుకు మెడ్ ఫ్లాష్ అనే మొబైల్ అప్లికేషన్ తయారు చేశారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్ రెడ్డి.. ఈ అప్లికేషన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జలమండలి ఉద్యోగుల కోసం ఇలాంటి యాప్ తయారు చేసినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ యాప్ ను అర్హులైన వారు వినియోగించాలని తెలిపారు. డివిజన్లలో ఆరోగ్య సేవలకు సంబంధించిన పనిచేసే వాళ్లకు.. ఈ యాప్ వినియోగం గురించి ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. హెల్త్ కార్డు ఉన్న ఉద్యోగులకు సత్వర ఆరోగ్య సేవలు అందించేందుకు ఈ యాప్ తీసుకొచ్చారు. ఏదైనా మెడికల్ ఎమర్జెన్సీ తలెత్తినప్పుడు ఈ యాప్ ఉపయోగించి సేవల్ని పొందవచ్చు. యాప్ ద్వారా ఆ వివరాలు నమోదు చేసుకుంటే ఏజెన్సీ వాళ్లు వెంటనే స్పందించి.. ఆరోగ్య వివరాలు, మంచి వైద్యం అందించే ఆసుపత్రులను కూడా సూచిస్తారు. అవసరమైతే.. అంబులెన్స్ ను కూడా ఇంటి దగ్గరకు పంపించే సౌకర్యాన్నీ కల్పించారు. హెల్త్ కార్డులు ఉన్న ఉద్యోగులకు ఇలాంటి క్యాష్ లెస్ సర్వీస్ అందించడం దేశంలోనే మొదటి సారి కావడం విశేషం. జలమండలిలో ఉద్యో గులు, పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్స్ దాదాపు 6685 మందికి హెల్త్ కార్డులు ఉన్నారు. వీరితో పాటు వీరి మీద ఆధారపడిన వారందరు.. దీని ద్వారా సంవత్సరానికి రూ. 3 లక్షల వరకు ఉచిత సేవలను పొందవచ్చు. ఈ కార్యక్రమంలో ఈఎన్సీ, డైరెక్టర్ ఆపరేషన్స్-2 వీఎల్. ప్రవీణ్ కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ. శ్రీధర్, పీ అండ్ ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ప్రావిడెన్స్ ఇండియా ఇన్సూరెన్స్ బ్రోకింగ్ కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెండ్ జ్యోతి బాల, పాల్గొన్నారు.

# పోలీసు వ్యవస్థను ప్రజలు గౌరవించేలా పనిచేయండి

## భూపాలపల్లి ఎస్పి కిరణ్ ఖరే ఐపీఎస్

భూపాలపల్లి, మార్చి 10 (జనం సాక్షి )



పోలీస్ వ్యవస్థను ప్రజలు గౌరవించేలా సేవలు అందించేందుకు కృషి చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఐపీఎస్ అన్నారు.జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా దివాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 22 మంది ఫిర్యాదుదారుల పిటిషన్ లను స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు.సామాన్య ప్రజలకు పోలీసులు అండగా ఉండాలని, వారితో స్నేహభావంతో మెలుగుతూ వారి పిర్యాదులను స్వీకరించి సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పి ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు, సంఘవ్యతిరేక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉంటూ, పోలీసులకు తెలుపాలని ఎస్పి పేర్కొన్నారు.

# సంగీత అకాడమీ ఆధ్వర్యంలో నారిశక్తి అవార్డుల ప్రధానోత్సవం

నిర్మల్ బ్యూరో, మార్చి 10 (జనంసాక్షి)



పాటే మా ప్రాణం సంగీత అకాడమీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించినందుకు గాను నారీశక్తి అవార్డుల ను అందజేశారు. ఆదివారం రాత్రి స్థానిక టీఎన్జీవో భవన్ లో ఏర్పాటు చేసిన ఈకార్యక్రమంలో ముఖ్య అతిథి డాక్టర్ యు కృష్ణంరాజు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని మహిళ లేకపోతే ఈ సృష్టి లేదు, తల్లిగా, చెల్లిగా, అలిగా ఒక మగవానికి తోడుగా నిలుస్తుందని. అన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారిని సన్మానించుకోవడం అదృష్టమని అన్నారు. కార్మిక శాఖ అధికారి ముత్యం రెడ్డి మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేకమైన చట్టాలు, పనిచేసే ప్రాంతాల్లో సరైన భద్రత వంటి వివరాలను తెలియజేశారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎంసీ లింగన్న మాట్లాడుతూ స్త్రీలు ఎక్కడైతే పూజింపబడతారో అక్కడ దేవతలు నడియాడతారని, స్త్రీ లేనిదే లోకం లేదు. ప్రతి ఒక్క మహిళ తనకు తాను ముందుకు సాగుతూ ,తన కాళ్ళ పై నిలబడుతూ అందరికీ ఆదర్శంగా నిలవాలని అన్నారు. విశిష్ట సేవలందించిన పలువురు మహిళలకు సేవపురస్కారాలు ,మెమోంటోలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాటే మా ప్రాణం సంగీత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు చెనిగారపు నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ నవ్య, కార్యదర్శి శ్రీకాంత్ సభ్యులు వాణిశ్రీ, కవిత, మమత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి...

## జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్.

ములుగు ప్రతినిధి, మార్చి 10 (జనంసాక్షి)



తెలంగాణ రాష్ట్ర గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రా, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, డీఎస్పీ రవీందర్ లతో కలిసి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పర్యటన జిల్లాలో ఉన్న సందర్భంగా ఏర్పాట్లపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం తెలంగాణ గవర్నర్ దత్తత తీసుకున్న జిల్లాలోని తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామమునకు వస్తున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, అనంతరం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ తల్లులను దర్శించుకుంటారని అన్నారు. గవర్నర్ పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు జరగకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని విజయవంతం చేయాలని ఆదేశించారు. షెడ్యూలు ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పరిశుద్ధ పనులు చేపట్టాలని, అతిథి గృహంలోని గదులను శుభ్రంచేయాలని, శానిటేషన్ చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. గవర్నర్ పర్యటన ఏర్పాట్లను కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య ఎటువంటి లోటు పాట్లు లేకుండా పకడ్బందీగా చేయాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, అన్ని శాఖల జిల్లా అధికారులు, ములుగు, తాడ్వాయి మండలం ఎంపిడిఓలు, తహసీల్దార్లు, ఎంపీ లు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

ఆదిలాబాద్ ప్రతినిది (జనంసాక్షి) :



జిల్లాలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సోమవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాను క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ కు పూల మొక్క అందించి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లాలో ఉన్న సమస్యలపై కొద్దిసేపు చర్చించారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన



అర్హులందరికీ ఇందిరమ్మ పథకంలో ఇళ్లు : ఎమ్మెల్యే జీఎస్సార్

శాయంపేట, మార్చి10,( జనం సాక్షి):

శాయంపేట మండలం గట్లకానిపర్తి గ్రామంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ, ఇళ్లు లేని అర్హులందరికీ ఇందిరమ్మ పథకంలో ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారులకు దశల వారీగా బిల్లులను అందించడం జరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారు అయిన దొడ్డి జమున - శంకర్ లకు ఎమ్మెల్యే శాలువా కప్పి అభినందించగా, ఎమ్మెల్యే జీఎస్సార్ కు ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారుడు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ నేతలు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

**•సాంకేతిక పరిజ్ఞానం అధిక దిగుబడి**

**•ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి**

బిజినపల్లి మార్చ్ 10 (జనం సాక్షి)




పల్లెలో ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా దిగుబడిని పెంచి పర్యావరణానికి మేలు చేయవచ్చు అనిఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు.పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రంలో కిసాన్ మేళాను ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందించాలన్నారు.పంట జీవన దశలు, తెగుళ్లు, పురుగుల నివారణ, పోషకలో పాలు తదతర అంశాలను రైతులకు తెలిపితే సకాలంలో అవసర మైన చర్యలు తీసుకునే ఆవకాశం ఉంటుంద న్నారు.ఇందుకోసం రైతులను చైతన్యవంతులను చేయాలన్నారు. ఇలాంటి కిసాన్ మేళా కార్యక్రమాలు రైతులకు ఆధునిక సాంకేతికత పరిచయం కల్పించి, వ్యవసాయ రంగంలో నూతన మార్పులు తీసుకురావ టానికి ఎంతోఉపయోగపడుతాయని తెలిపారు. ఏడిఆర్ డాక్టర్ సి సుధాకర్ మాట్లాడుతూ పత్తిలో అధిక సాంద్రత సాగు యాజమాన్యం ఎంతో లాభదాయకమని చెప్పారు . సాధారణ పత్తి సాగుకు కిలోవిత్తనం సరిపోతే అధిక సాంద్రత పత్తి సాగుకు 2: 30 కిలోల పత్తి విత్తనం అవసరమన్నారు. సాధారణ పత్తి సాగులో ఎనిమిది నుంచి పది క్వింటాళ్లు ఎకరానికి దిగుబడి వస్తే, అధిక సాంద్రత పద్ధతి వల్ల 10 నుంచి 12 క్వింటాళ్లు ఎకరానికి దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు .వివిధ వ్యవసాయ అంశాలపై నమూనాల ప్రదర్శనలు, ఆధునిక వ్యవసాయ యంత్రాల డెమో స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి . కిసాన్ మేళాలో యాసంగి, వేరుశనగ, వరి మరియు మొక్కజొన్న పంటలపై అవగాహన కార్యక్రమాలు, అధిక సాంద్రత పత్తి సాగు

పై రైతులు, శాస్త్రవేత్తలతో వివరణాత్మక చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో కెవికె కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, శాస్త్రవేత్తలు శైల, రామకృష్ణ, రాజశేఖర్, ఆదిశంకర్, సి ప్రభాకర్, ఆర్ ఏ ఆర్ ఎస్ శాస్త్రవేత్తలు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు 150 పని దినాలు కల్పించాలి

శంకరపట్నం మార్చి 10 (జనంసాక్షి):



కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని కాచాపూర్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. పని చేసిన పాత బకాయిలు రావడం లేదని, పనిచేసే చోట కనీస సౌకర్యాలు కరువాయాయని కూలీలు వాపోయినట్లు రాజు పేర్కొన్నారు. పని ప్రదేశాల్లో వాటర్ టెంట్ మెడికల్ కిట్లు సదుపాయాలు కల్పించాలని అధికారులను రాజు కోరారు. కూలీలకు 150 దినాల పని దినాలు కల్పించాలని కల్పించాలని పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీలకు రు.800 రోజువారీ కూలి చెల్లించాలని, కోరిన ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు అందించాలని, కూలీలకు కూలి అందించే సమయంలో పేస్లిప్పు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఏఐతో విద్యాబోధన విద్యార్థుల పాలిట వరం

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



**బూర్గంపహాడ్, మార్చి 10 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:- ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) తో విద్యాబోధన విద్యార్థులకు వరంగా మారుతుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం మండలంలోని అంజనాపురం ఎంపీపీఎస్ పాఠశాలలో ఏఐతో విద్యాబోధన తరగతులను ఆయన పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన మరింత ఆకర్షణీయంగా, ఇంట్రాక్టివ్ గా నిర్వహించడానికి ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ మెరుగ్గా సహకరిస్తుందన్నారు. దీంతో విద్యార్థుల స్థాయిని అంచనా వేస్తూ అందుకు తగినట్లు అభ్యాస కృత్యాలు జనరేట్ చేయడంతో విద్యాభ్యాసం పట్ల పిల్లల్లో మరింత ఉత్సాహం పెంచేలా బోధన చేయవచ్చున్నారు. విద్యార్థుల కంప్యూటర్ ల్యాబ్ లో కలెక్టర్ ముచ్చటిస్తూ చిన్నారులకు ఉత్సాహమే ప్రేరణగా ఆధారిత విద్యాబోధనను జిల్లాలో ప్రారంభించామన్నారు. పిల్లలందరూ నిరంతరం ప్రతిరోజూ కంప్యూటర్ ల్యాబ్ ను వినియోగించుకోవాలన్నారు. బూర్గంపహాడ్ మండలంలో అంజనాపురం, మోరంపల్లి బంజర్, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, సారపాక గాంధీనగర్ పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఏఐ ఆధారిత బోధనలో భాగంగా మండలం నుంచి ఒక ఉపాధ్యాయుడిని హైదరాబాద్ కు ఏఐ విద్యాబోధనలో శిక్షణకు పంపడం జరుగుతుందని ఆయన తెలిపారు విద్యాబోధనలో ఉపాధ్యాయుల పనితీరును సంబంధిత ఎంఈవోలు పర్యవేక్షిస్తూ కార్యక్రమాన్ని రోజువారీగా సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం బూర్గంపహాడ్ ఆశ్రమ పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో తరగతిగదులు, మరుగుదొడ్లు, కిచెన్, పాఠశాల ఆవరణను క్షుణ్ణంగా పరిశీలించారు. కలెక్టర్ తరగతిగదిలో విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధిస్తున్న విద్యాతరగతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ వారికి ఉన్న ఆసక్తి పాఠశాలలో విద్యాబోధన, అమలుచేస్తున్న మెనూపై ఆరాతీశారు. విద్యార్థుల సంఖ్య, పాఠశాలలో రోజువారీ అమలుచేస్తున్న మెనూ ప్రకారం లెసన్ ప్రణాళికలు, టాయిలెట్స్ నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో చదవడానికి వీలుగా అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్ధమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని ఆదేశించారు పాఠశాల ఆవరణలో నీటినిల్వలు లేకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించి నివేదికలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే మోరంపల్లిబంజర్ లో నూతన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి వేపలగడ్డలో నాలుగు ఎకరాల భూమిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్థలం చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ తహాశీల్దార్ రాంనరేష్, ఎంఈవో యదుసింహరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తేజావత్ కిషన్ రావు, పాఠశాలల సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ప్రజావాణికి 73 దరఖాస్తులు
- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 10 (జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యమిస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులకు సూచించారు.సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 73 ఫిర్యాదులు అందజేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ పి.రాంబాబుకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించే విధంగా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. గ్రీవెన్స్ డే అనంతరం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ తీవ్రమైన వడదెబ్బకు ప్రజల గురి కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఆరోగ్యశాఖ సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. ఎండాకాలంలో తీవ్ర ఉష్ణోగ్రతల పెరిగే అవకాశం ఉన్నందున ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అత్యవసరం అయితేనే తప్ప బయటకు రాకూడదని అన్నారు.ముఖ్యంగా 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు బయటకు వెళ్లకూడదని సూచించారు. గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వాళ్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాలలో కూలీలకు షేడ్ నెట్స్ ఏర్పాటు చేయాలని, త్రాగునీటి సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా సిద్ధంగా ఉంచాలని తెలిపారు.జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో తగినన్ని మందులు, ఓఆర్ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉండాలని తెలిపారు. జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అన్ని పాఠశాలల్లో, హాస్టల్స్ లో ఫ్యాన్స్ వాడుకునేలా సిద్ధం చేయాలన్నారు. మహిళా ఉద్యోగులు క్యాప్స్, గొడుగులు తప్పక వాడాలన్నారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులు త్రాగునీటి ఎద్దడి రాకుండా ఎల్లప్పుడూ పరిశీలిస్తూ చిన్నచిన్న మరమ్మత్తులను వెంటనే పూర్తి చేయాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలవకుండా చూడాలని తెలిపారు.వైద్య ఆరోగ్యశాఖ అధికారులు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆరోగ్యంపై వేడి ప్రమాదం, వేడి సంబంధిత అనారోగ్యాలు గోడ పత్రికలను, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ స్టేట్ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ సభ్యులు తల్లిదండ్రుల వయోధికుల పోషణ, సంక్షేమ చట్టం, నియమావళి తెలిపే గోడపత్రికలను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వివి అప్పారావు, డీఎఫ్ఓ సతీష్ కుమార్, సిపిఓ ఎల్.కిషన్, డిఎంహెచ్ఓ డాక్టర్ కోటా చలం, డిఈఓ అశోక్ , డిటిడిఓ శంకర్, ఎస్సీ అభివృద్ధి అధికారి లత, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, మైనార్టీ అధికారి జగదీశ్ రెడ్డి, పిడి ఎస్సి కార్పొరేషన్ శ్రీనివాస్ నాయక్ ,జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల అధికారి సీతారాం నాయక్, డిఎస్ఓ రాజేశ్వరరావు, డిసిఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో సుదర్శన్ రెడ్డి, మెప్మా పీడీ రేణుక, జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

- విధుల్లో నిర్లక్ష్యం వహించిన మున్సిపల్ సిబ్బంది సస్పెన్షన్
- బిల్ కలెక్టర్లు ఖుర్షీడ్ హమ్మద్ , శ్రీకాంత్
- 17 మంది సిబ్బందికి శోకాజ్ నోటీసులు
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి

**సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 10 (జనం సాక్షి) :** వీధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి అధికారులకు హెచ్చరించారు. ఇంటి పన్నులు, కుళాయి బిల్లులు వసూలులో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు మున్సిపల్ సిబ్బందిని సస్పెన్షన్ చేశారు. అలాగే 17 మందికి శోకాజ్ నోటీసులు జారీ చేస్తూ జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ సిబ్బంది రివ్యూ మీటింగ్ లో మున్సిపల్ సిబ్బంది బిల్ కలెక్టర్లు ఆయా వార్డులలో నిర్ణీత టార్గెట్ను రీచ్ అయ్యేలా ప్రణాళిక ప్రకారం బిల్లులు వసూలు చేయాలని ఆదేశించారు. అలాగే వంద శాంతం ఇంటి పనులు, కులాయి బిల్లులు వసూలు చేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మున్సిపల్ సిబ్బందికి, కమిషనర్లకు ఆదేశించారు. జిల్లాలో మున్సిపల్ సిబ్బంది బిల్ కలెక్టర్ల పనితీరులు మార్పు రాకపోవడంతో కలెక్టర్ సిబ్బందిపై కఠిన చర్యలు చేపట్టారు. జిల్లాలోని ఇద్దరు బిల్ కలెక్టర్లను సస్పెన్షన్ చేస్తూ మరో 17 మందికి షోకాజ్ నోటీసులను కలెక్టర్ జారీ చేశారు. జహీరాబాద్ మున్సిపాలిటీకి చెందిన బిల్ కలెక్టర్ ఖుర్షీడ్ హమ్మద్, సదాశివపేట మున్సిపాలిటీ బిల్ కలెక్టర్ శ్రీకాంత్ లను సస్పెన్షన్ చేస్తూ, జిల్లాలోని పలు మున్సిపాలిటీలకు చెందిన 17 మందికి షోకాజు నోటీసులను జారీ చేశారు. షోకాజు నోటీసులు అందుకున్న వారిలో సదాశివపేట మున్సిపల్ మేనేజర్ ,బిల్ కలెక్టర్ అనిల్, జైరాబాద్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ సంజీవ్, బిల్ కలెక్టర్ సాయి స్వరాజ్, సంగారెడ్డి మునిసిపల్ కమీషనర్, మున్సిపాలిటీ ప్రశాంత్, బిల్ కలెక్టర్ షోహెల్, హరి, ఇక్బాల్ , తెల్లాపూర్ మున్సిపాలిటీ బిల్ కలెక్టర్ రామకృష్ణ లకు షోకాస్ నోటి జారీ చేశారు. సిబ్బంది పనితీరులో మార్పు రాకుంటే కఠిన చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ మున్సిపల్ సిబ్బందికి హెచ్చరించారు. ఈ నెలాఖరులోగా వంద శాంతం ఇంటి పనులు, కులాయి బిల్లులు వసూలు చేసేలా మున్సిపల్ కమిషనర్లు ప్రతిరోజు సిబ్బందితో రివ్యూ నిర్వహిస్తూ పన్నులు వసూలు వేగవంతం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారి చేశారు.

## గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు





**కరీంనగర్ బ్యూరో, మార్చి 10 (జనంసాక్షి) :** సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని సోమవారం రోజు కరీంనగర్ కళాభారతిలో ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమాన్ని సర్వాయి పాపన్న జిల్లా మహిళా అధ్యక్షురాలు తాళ్లపెల్లి సంధ్య గౌడ్, సర్దార్ సర్వాయి పాపన్న రాష్ట్ర అధ్యక్షులు కోడూరు పరుశురాములు గౌడ్ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్దార్ సర్వాయి పాపన్న రాష్ట్ర అధ్యక్షులు కోడూరు పరుశురాములు గౌడ్ హాజరై నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కొడూరు పరశురాములు గౌడ్ మాట్లాడుతూ... మహిళలు కుటుంబ బాధ్యతలతో పాటు ఉద్యోగ బాధ్యతలు విజయవంతంగా నెరవేరుస్తున్నారని కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో 250 మంది మహిళ కళాకారులకు ప్రశంసా పత్రం, సాలువాలతో సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్వాయి పాపన్న రాష్ట్ర మాజీ అధ్యక్షులు కలర్ సత్తన్న గౌడ్, సర్వాయి పాపన్న రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సంపునూరి మల్లేశం గౌడ్, రాష్ట్ర నాయకులు సింగం సత్తన్న గౌడ్, గోపగాని సారయ్య గౌడ్, కర్భుజ తిరుపతి గౌడ్, కోల లక్ష్మణ్ గౌడ్, సర్వాయి పాపన్న జిల్లా అధ్యక్షులు ముత్యం శంకర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు బుర్ర పరుశు రాములు గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మటి రాజమల్లు గౌడ్, చిగురు మామిడి మండల అధ్యక్షుడు బొమ్మగాని వెంకటేశం, ముంజ శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యేలు



**నిర్మల్ రూరల్, మార్చి 10 (జనంసాక్షి) :** నర్సాపూర్ మండల కేంద్రంలోని కేజీబీవి (కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం)లో ఆకస్మిక తనిఖీ చేసిన బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్. అనంతరం ఎమ్మెల్యేలు పాఠశాలలోని సౌకర్యాలను, ఇబ్బందులను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకొని ఉన్నత స్థాయిలో ఎదగాలని సూచిస్తూ, ఏటువంటి ఇబ్బందులు ఉన్నా తమ ధృషికి తీసుకురావాలని కోరారు. అనంతరం పాఠశాల ఆవరణను మొత్తం సందర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు సత్యనారాయణ గౌడ్, మండల అధ్యక్షులు నరేందర్, నాయకులు సవీన్, దత్తురాం, సుధాకర్, శ్రీకాంత్ రెడ్డి, రాజేందర్, రాజు, గంగారాంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన వరంగల్ సీపీ



**స్టేషన్ ఘన్పూర్, మార్చి 10 (జనం సాక్షి) :** ఈ నెల 16 న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం లో పర్యటన నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సోమవా రం డీసీపీ రాజ మహేంద్ర నాయక్ ఘన్ పూర్ డివిజినల్ పోలీస్ అధి కారులతో కలిసి పాలకుర్తి రోడ్డు లోని శివుని పల్లిలో సభ స్థలాన్ని పర్యటన ఏర్పాట్లను సందర్శించారు. ఈ సందర్భంగా పబ్లిక్ మీటింగ్ సంబంధించి పోలీస్ పార్కింగ్ స్థలాలు, హెలిప్యాడ్, పరిశీలించడంతో పాటు సిఎం కు కల్పించాల్సిన భద్రత ఏర్పాట్లు,పోలీస్ బందో బస్త్ పై పోలీస్ కమిషనర్ క్షేత్రస్థాయిలో సమీక్షా జరిపా రు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా డిసిపి రాజమహేంద్ర నాయక్,స్టేషన్ ఘన్పూర్ ఏసీపీ భీమ్ శర్మ, సీఐ వేణు, సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సై వినయ్ కుమార్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని నిలిపివేసే వరకు ఉద్యమం కొనసాగిస్తాం..

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ యాదవ్**



**నర్సాపూర్, మార్చి 10 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారా నగర్ గ్రామ సమీపంలో నిర్మిస్తున్న డంపింగ్ యార్డ్ ను నిలిపివేసి ఎంతవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ యాదవ్ , ప్రముఖ వ్యాపారవేత పైడి శ్రీధర్ గుప్తాలు అన్నారు . డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా చేపడుతున్న రిలే నిరాహార దీక్షలో భాగంగా సోమవారం నర్సాపూర్ పట్టణంలోని 10 వ వార్డు మాజీ కౌన్సిలర్ వనముల బుచ్ఛేష్ యాదవ్ ఆధ్వర్యంలో 10 వ వార్డుకు చెందిన కాలనీవాసులు దీక్షలో కూర్చున్నారు. ఈ దీక్షకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ యాదవ్ ప్రముఖ వ్యాపారవేత పైడి శ్రీధర్ గుప్తాలు హాజరై మద్దతు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చని అడవిలో పల్లెల్లో విషపూరిత కాలుష్యాన్ని వెదజల్లే ఈ డంపింగ్ యార్డ్ ఈ ప్రాంతంలో నిర్మించవద్దని వారు అన్నారు ఈ డంపింగ్ యార్డ్ వల్ల నీటి కాలుష్యం వాయు కాలుష్యం అవుతుందని ఈ ప్రాంతంలోని ప్రజలకు అనేక రూపాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం పొంచి ఉంది అన్నారు ఈ డంపింగ్ యార్డ్ ను వ్యతిరేకించేందుకు ఈ ప్రాంతానికి చెందిన ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉద్యమం చేయాలని వారు పిలుపునిచ్చారు ఈ దీక్షలో పాల్గొన్న వారు చౌటి జగదీష్ రమణారావు మిరియాల అశోక్ చక్రవర్తి యాదగిరి సుబ్బులు కిరణ్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయం

- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి



**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 10 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ను మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి, కంప్యూటర్ శిక్షణపై విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యార్థులకు చేయూత అభినందనీయమని అన్నారు.ప్రస్తుత సమాజంలో చదువుతోపాటు టెక్నాలజీ అవసరమని అన్నారు. అవసరాల మేరకే టెక్నాలజీని వినియోగించుకోవాలని, కంప్యూటర్, సెల్ ఫోన్ ను చదువుకు అనుగుణంగా వాడాలని సూచించారు.ప్రతి విద్యార్థి లక్ష్యంతో ఉన్నత చదువులతో ముందుకు సాగాలని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసిన బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.క్రీడల్లో రాణించిన విజేతలకు బహుమతులు, మెడల్స్ అందజేసి అభినందించారు.

# ప్రణయ్ హత్య కేసు తీర్పు కులదురహంకారులకు చెంపపెట్టు

- ప్రణయ్ కుటుంబానికి రక్షణ కల్పించాలి
- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీస్కైలాబ్ బాబు



**సూర్యాపేట, మార్చి 10 (జనంసాక్షి) :** మిర్యాలగూడలో కుల దురహంకార హత్యకు బలైన పెరుమాళ్ళ ప్రణయ్ హత్య కేసు తీర్పు కుల దురహంకారులకు చెంపపెట్టు లాంటిదని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పేట్ల స్కైలాబ్ బాబు అన్నారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఎంవిఎన్ భవన్ లో ప్రణయ్ తీర్పుపై చర్చ గోష్టి కార్యక్రమం కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతతూ నల్గొండ జిల్లా మిర్యాల గూడలో 2018లో వైశ్య కులానికి సంబంధించిన అమృతను కులాంతర వివాహం చేసుకున్నాడనే పేరిట పెరుమాండ్ల ప్రణయ్ అనే దళిత యువకుడిని అత్యంత కిరాతకంగా కోటి రూపాయలు ఇచ్చి హత్యగావింపజేశారని అన్నారు. ఈ కేసులో ప్రధాన ముద్దాయిగా ఉన్న మారుతి రావు 2020లో ఆత్మహత్య చేసుకున్నాడని మిగిలిన ఏడుగురు నిందితులలో ఏ2 శర్మకు ఉరిశిక్షతోపాటు మరో ఆరుగురికి జీవిత ఖైదు విధించి ఇచ్చిన తీర్పును కెవిపియ సంపూర్ణంగా స్వాగతిస్తుందన్నారు. కోర్టులపై ప్రజలకు నమ్మకం కలిగే విధంగా ప్రణయ్ తీర్పు ఉందన్నారు.ఈ తీర్పు తర్వాత ప్రణయ్ కుటుంబానికి అమృత బాలస్వామికి పూర్తిస్థాయి రక్షణ కల్పించాలని వారు కోరారు. రాష్ట్రంలో 128 కుల దురహంకార హత్యలు జరిగాయన్నారు.నల్గొండ జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పు మిగిలిన చోట జరిగిన కుల దురహంకారులకు కనువిప్పు కలగాలన్నారు కుల దురహంకారులను పౌర సమాజం ప్రజా సంఘాలు రాజకీయ పార్టీలు తీవ్రంగా ఖండించాలని అన్నారు. ఇటీవల సూర్యాపేటలో కూడా వడ్లకొండ కృష్ణను అతి కిరాతకంగా హత్య చేశారని ఈ కేసును పాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు తల్లమళ్ళ హస్సన్, సీనియర్ జర్నలిస్ట్, గోల్డ్ మెడలిస్ట్ బంటు కృష్ణ, కందుకూరి యాదగిరి, ప్రముఖ కార్టూనిస్ట్ పల్లె మనిబాబు, శిరంషెట్టి ఆనంద్, పి ఎన్ ఎం జిల్లా కార్యదర్శి వేల్పుల వెంకన్న, టిపిటిఎల్ఎఫ్ జిల్లా అధ్యక్షులు జె.నరసింహారావు, నవ తెలంగాణ ఇన్చార్జి వెంకట్ రెడ్డి,నాగయ్య, మాల మహానాడు జిల్లా నాయకులు దాసరి దేవయ్య,కాశిమల్ల వెంకటనరసయ్య,బోయిల్ల అఖిల్ కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు టేకుల సుధాకర్ ప్రజా నాట్య మండల జిల్లా నాయకులు నందిపాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# గుడిసెవాసులకు తాగునీరు, కరెంట్ సౌకర్యాలు కల్పించాలి

- తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్



**వాజేడు, మార్చి 10 (జనంసాక్షి) :** వాజేడు మండల కేంద్రంలోని గుడిసెవాసులకు త్రాగు నీరు,విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, సోమవారం తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం వాజేడు మండల కమిటీ ఆధ్వర్యంలో ఐటీడీఏ పాలన అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జెజ్జరీ దామోదర్ మాట్లాడుతూ, గత సంవత్సరన్నర కాలం నుండి వాజేడు మండల కేంద్రం మండపాక సమీప ప్రభుత్వ భూమిలో, మండలానికి చెందిన వివిధ గ్రామాల నుండి, గోదావరి వరద ముంపు ప్రాంతాల బాధితులైన ఆదివాసీ లు ఇతర పేద,నిరుపేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని, వారికి త్రాగేందుకు నీరు లేక చెలిమల నీరే దిక్కైందని, కరెంటు సౌకర్యం లేక చిమ్మ చీకట్లో విషపురుగుల తో సహవాసం చేస్తూ జీవిస్తున్నారని, వారికి కనీస అవసరాలైన త్రాగునీరు, కరెంటు సమస్యలు పరిష్కరించాలని, పలుమార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల అధికారులు గుడిసవాసుల్ని మనుషులుగా కూడా చిత్రీకరించడం లేదని, ప్రజల కనీస అవసరాలు తీర్చాల్సిన బాధ్యత కలిగిన అధికారులు, వారిని చిన్నచూపు చూస్తూ వారి అవసరాలు తీర్చకుండా వెళ్ళగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, అందులో భాగంగానే వారికి ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదని ఆరోపించారు. సంవత్సరన్నర కాలం నుండి అనేక ఇబ్బందులు పడుతూ, నివాసం ఉంటున్న వారిని పాలక ప్రభుత్వాలు,ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. గుడిసె వాసుల అవసరాలు తీర్చాలని ఆందోళనలో వినతి పత్రాలు ఇచ్చిన అధికారులలో చలనం లేదని, తక్షణమే గుడిసేవాసులకు కనీస అవసరాలు అయినా త్రాగునీరు, కరెంటు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనియెడల గుడిసె వాసులందరినీ ఏకం చేసి పాదయాత్ర ద్వారా ఐటీడీఏ ను ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గ్రామ సంఘం మండల నాయకులు బొగ్గుల రామలక్ష్మి,నాగమణి, శారద, సోనియా పాల్గొన్నారు.

## విపణి




# ఐపీఓ మరింత కఠినతరం..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** స్టాక్ మార్కెట్‌లో నిధుల సమీకరణ కోసం క్యూకడుతున్న స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఐపీఓలకు చెక్ పెట్టేందుకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నడుం బిగించింది.పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు కొన్ని నిబంధనలను నిర్దేశించింది. లాభదాయకత, 20 శాతానికి మించని ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) వంటి పరిమితులను పెట్టింది. రిటైల్ ఇన్వెస్టర్ల ప్రయోజనాలను కాపాడే ఉద్దేశంతో సెబీ ఈ నిబంధనలను తీసుకొచ్చింది. ఇటీవల కాలంలో ఎస్‌ఎంఈ ఐపీఓల్లో పెట్టుబడులకు ఇన్వెస్టర్లు ఉత్సుకత చూపిస్తున్న వేళ సెబీ ఈ నిబంధనలను కట్టుదిట్టం చేస్తూ తాజాగా ఓ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎస్‌ఎంఈ విభాగంలో ఏదైనా కంపెనీ ఐపీఓకు రావాలంటే గడిచిన మూడేళ్లలో కనీసం రెండేళ్ల పాటు రూ.1 కోటి నిర్వహణ లాభాలను సాధించి ఉండాలి.ఈ ఐపీఓల్లో ఆఫర్ ఫర్ సేల్ ద్వారా షేర్ హోల్డర్లు 20 శాతానికి మించి వాటాను విక్రయించడానికి వీల్లేదు. ప్రస్తుత వాటాదారులెవరూ 50 శాతానికి మించి వాటాను విక్రయించడానికి అవకాశం లేదు.కనీస వాటా పరిమితికి మించి అదనంగా ఉన్న షేర్ హోల్డింగ్‌కు లాక్-ఇన్ వ్యవధి ఉంటుంది. ఏడాది తర్వాత అదనంగా ఉన్న వాటా; రెండేళ్ల తర్వాత మిగిలిన 50 శాతం వాటా వదులుకోవడానికి వీలవుతుంది.నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు షేర్ల అలకేషన్‌కు సంబంధించి మెయిన్ బోర్డు ఐపీఓ నిబంధనలే ఎస్‌ఎంఈ ఐపీఓలకూ వర్తిస్తాయి.ఎస్‌ఎంఈ ఐపీఓల సబ్‌స్క్రిప్షన్‌కు కనీసం రెండు లాట్లు కొనగోలు చేయాల్సి ఉంటుంది.పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలు పేరు చెప్పి ఎడాపెడా వినియోగించుకోవడానికి లేదు.

# బీమాతో ధీమా..

**జనంసాక్షి:**తల్లిదండ్రులు పిల్లల ఆర్థిక భవిష్యత్ గురించి ఆలోచించేటప్పుడు పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన, రికరింగ్ డిపాజిట్ వంటి పథకాలతో పాటు పిల్లలకు జీవిత బీమా తీసుకుంటే ఎలా ఉంటుంది అని కూడా ఆలోచిస్తారు.కొంత మంది బీమా ఏజెంట్ల మాట విని చాలా మంది తల్లిదండ్రులు..పిల్లలకు జీవిత బీమా అవసరమని అనుకుంటారు. ఆర్థికపరమైన విషయాల్లో పిల్లలకు సంబంధించి ఏది సరైంది/కాదు అనే విషయాన్ని తల్లిదండ్రులు తప్పక పరిశీలించాలి. ఇందుకు గానూ పిల్లల బీమా గురించి తెలుసుకోవడంతో పాటు సంపాదించే కుటుంబ పెద్ద పేరుపై టర్మ్ బీమా ఉండడం వల్ల ప్రయోజనమేంటో కూడా ఇక్కడ తెలుసుకోవడం అవసరం.చైల్డ్ లైఫ్ ఇన్సూరెన్స్ అనేది పిల్లలకు పూర్తి జీవిత బీమాను అందించే పాలసీ. భారత్‌లో చాలా బీమా సంస్థలు పిల్లల గురించి అనేక జీవిత బీమా పాలసీలను అందిస్తున్నాయి. పిల్లల పేరుపై ఈ పాలసీని తీసుకోవడం ద్వారా వారి జీవితానికి ఆర్థిక భద్రత పొందొచ్చని బీమా సంస్థలు పేర్కొంటాయి. పిల్లలు చిన్నతనంలోనే జీవిత బీమా పాలసీని పొందడం ద్వారా, వారు బీమా కాలవ్యవధిలో బీమా కవరేజీ రక్షణలో ఉంటారు. చిన్న వయసులో ఉండే వారికి చెల్లించే బీమా ప్రీమియంలు కూడా తక్కువగానే ఉంటాయి. దీంతో అధిక మొత్తంతో కూడిన బీమా పథకాన్ని ఎంచుకోవచ్చు. పెద్దలు పిల్లల జీవిత బీమాను కొనుగోలు చేయడం వల్ల పిల్లలు జీవిత బీమా రక్షణ పొందడమే కాకుండా భవిష్యత్ కోసం వారికి కొంత డబ్బు కూడా సమకూరుతుందని భావిస్తుంటారు.బీమా తీసుకోవాలనే ఆశయం మంచిదే అయినప్పటికీ, జీవిత బీమా గురించి కొన్ని ముఖ్యమైన విషయాలను తెలుసుకోవడం అవసరం. ముఖ్యంగా..బీమా, పెట్టుబడితో కూడిన పిల్లల బీమా పథకాలలో రాబడి సరిగ్గా ఉండదు. సాధారణంగా, వీటిపై వార్షిక రాబడి గరిష్ఠంగా 4-5% వరకు ఉంటుంది. ఈ రాబడి..పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని బట్టి చూస్తే చాలా తక్కువ. ఈ రోజు మీ పిల్లల కోసం జీవిత బీమా పాలసీని కొనుగోలు చేశారని అనుకుందాం. ప్రస్తుత మీ ఆదాయ సానుకూలతను బట్టి జీవిత బీమా మొత్తాన్ని ఎంచుకుంటారు. అయితే, కాలక్రమేణా ద్రవ్యోల్బణం పెరిగే కొద్ది కవర్‌కు సంబంధించిన వాస్తవ విలువ గణనీయంగా తగ్గుతుంది. కొన్ని ఏళ్లలో పిల్లలు దురదృష్టవశాత్తు మరణిస్తే వారి నామి నీకి బీమా మొత్తం అందుతుంది. బీమాయే కాకుండా ఏ మదుపు పథకంలో పెట్టుబడి పెట్టినా అది పిల్లల భవిష్యత్తు గురించే కదా. కానీ, ఈ బీమా విషయంలో పిల్లలకు ఏమైనా జరిగితే ఆర్థిక ప్రయోజనాన్ని పెద్దలు పొందుతారు. ఎంతో భవిష్యత్ ఉండే పిల్లలు ఈ బీమాలో ఎటువంటి ఆర్థిక ప్రయోజనాన్ని ప్రత్యక్షంగా పొందలేరు. కాబట్టి, మీ పిల్లల ఆర్థిక భవిష్యత్తును సురక్షితంగా ఉంచాలను కుంటే, మీరు ఇతర



పెట్టుబడి అవకాశాలను పరిశీలించడం కూడా చాలా అవసరం.పిల్లలకు బీమా కొన్ని సందర్భాల్లో మాత్రమే అర్థవంతంగా ఉంటుంది. వారి కుటుంబంలో జన్యుపరమైన ఆరోగ్య సమస్యల చరిత్ర ఉన్నప్పుడు, వీలైనంత త్వరగా పిల్లలకు బీమాను కొనుగోలు చేయడం అర్థవంతంగా ఉంటుంది. కొంతమంది పిల్లలు ఆదాయం సంపాదించే వృత్తుల్లో ఉండొచ్చు. ఉదాహరణకు, కొన్ని క్రీడా విభాగాల్లో పిల్లలు పాల్గొనడం, కళాకారులుగా, స్క్రీన్ ప్రజేంటషన్ ద్వారా మంచి ఆదాయం సంపాదించే వృత్తుల్లో కూడా పిల్లలు ఉంటారు. ఇలాంటప్పుడు కొన్నిసార్లు వీరికి రిస్క్ ఉండొచ్చు. మరికొన్ని సార్లు ప్రయాణాల్లో ఉన్నప్పుడు వీరికి దురదృష్టవశాత్తు ఏమైనా జరగొచ్చు. ఇలాంటప్పుడు వీరి ద్వారా ఆదాయాన్ని, భవిష్యత్ ఆర్థిక ఫలాలను తల్లిదండ్రులు కోల్పేయే అవకాశం ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో పిల్లల పేరు మీద ఉన్న జీవిత బీమా తల్లిదండ్రులకు ఆర్థిక ప్రయోజనాన్ని ఇస్తుంది.

# స్విగ్గీలో 'ఫాస్టింగ్ మోడ్'

## నోరూరించే నోటిఫికేషన్లకు బ్రేక్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**మన స్మార్ట్‌ఫోన్‌లో ఫుడ్ డెలివరీ యాప్స్ ఉన్నాయంటే చాలు.. నిత్యం నోటిఫికేషన్లు వస్తూనే ఉంటాయి. వివిధ రకాల ఆహార పదార్థాలతో నోరూరిస్తుంటాయి.అయితే, ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ కొత్తగా 'ఫాస్టింగ్ మోడ్'ను తీసుకొచ్చింది. దీన్ని ఆన్ చేసుకుంటే మీరు ఉపవాస దీక్షలో ఉన్నంతసేపూ ఆహారానికి సంబంధించి ఎలాంటి నోటిఫికేషన్లూ ఫోన్‌కు రావు.స్విగ్గీ యాప్ ఓపెన్ చేసి ఫాస్టింగ్ మోడ్‌ను ఎప్పుడైనా ఆన్/ ఆఫ్ చేసుకోవచ్చని కంపెనీ తెలిపింది. ఒకసారి ఆన్ చేసుకుంటే నిర్దేశిత సమయం వరకు ఎలాంటి నోటిఫికేషన్లూ రావని కంపెనీ తెలిపింది. ఉపవాస సమయం పూర్తయ్యాక ఎప్పటిలానే నోటిఫికేషన్లు మొదలవుతాయి. ఏడాది పొడవునా ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందని కంపెనీ తెలిపింది.




## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.10 | ₹ 4.12 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹80,500 | ₹87,820 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,08,000



# ఆఖర్లో అమ్మకాలతో బేజారు

## 22,500 దిగువకు నిఫ్టీ

**ముంబయి(జనంసాక్షి):**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో కదలాడిన సూచీలు మధ్యాహ్నం తర్వాత నష్టాల్లోకి జారుకున్నాయి. అమెరికా ఫ్యూచర్స్ నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో మదుపర్లు ఆఖర్లో అమ్మకాలకు దిగారు. దీంతో ఇంట్రాడే గరిష్ఠాల నుంచి సెన్సెక్స్ 700 పాయింట్ల మేర పతనం కాగా.. నిఫ్టీ 22,500 దిగువకు చేరింది. ఇన్ఫోసిస్, హిందుస్థాన్ యూనిలీవర్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు సూచీలకు దన్నుగా నిలవగా.. ఎల్అండ్‌టీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ సూచీలను దిగువకు లాగాయి. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ షేర్లలోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది.సెన్సెక్స్ ఉదయం 74,474.98 పాయింట్ల వద్దలాభాల్లో ప్రారంభమైంది. ఉదయమంతా లాభాల్లో కదలాడింది. ఇంట్రాడేలో 74,741.25 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. మధ్యాహ్నం తర్వాత నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 74,022.24 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 217.41 పాయింట్ల నష్టంతో 74,115.17 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 22,474.95 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 38 క్షీణించి 87.33గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్, జొమాటో, ఎల్అండ్‌టీ, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టాల్లో ముగిశాయి.

# పాయింట్ బ్లాంక్‌లో తుపాకీ గురిపెట్టి..

- రూ.25 కోట్ల విలువైన నగల చోరీ!
- బిహార్‌లో చోటు చేసుకున్న ఘటన

**పట్నా(జనంసాక్షి)**బంగారు ఆభరణాల షోరూంలో చోరీ జరిగింది. కొందరు దుండగులు సిబ్బందిపై తుపాకీ గురిపెట్టి నగలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన బిహార్‌లో చోటు చేసుకొంది. దాదాపు రూ.25 కోట్ల విలువైన ఆభరణాలు చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. ఆరాలో ఉన్న షోరూమ్‌ను రోజూలాగే సోమవారం ఉదయం 10 గంటలకు తెరిచారు. కాసేపటికే ఎనిమిది, తొమ్మిది మంది దుండగులు తుపాకులతో లోనికి ప్రవేశించారు. వారిలో పలువురు ముఖాలకు హెల్మెట్, మంకీ క్యాప్‌లు ధరించారు. సెక్యూరిటీ వద్ద ఉన్న తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. వారి వద్దనున్న ఆయుధాలతో సిబ్బందిని బెదిరించి షోరూంలోని నగలను అపహరించారు. సిబ్బందిలో ఒకరిపై దాడి చేశారు. ఈ దృశ్యాలు అక్కడున్న సీసీటీవీ ఫుటేజ్‌లో రికార్డు అయ్యాయి. అనంతరం పోలీసులకు సమాచారం అందడంతో ఘటనాస్థలానికి చేరుకున్నారు. అప్పటికే నిందితులు పరారయ్యారు. వారిని వెంబడిస్తూ వెళ్లిన పోలీసులు నిందితులపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులకు గాయాలయ్యాయి. "ఆభరణాలే కాకుండా నగదుతో నిందితులు పరారయ్యారు. ఎంత డబ్బు కాజేశారో తెలియాల్సి ఉంది" అని షోరూం మేనేజర్ తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



# ఆ రెండు బహుమతులు వద్దు

## అతిథులకు ఎంపీ తేజస్వీ సూర్య

బెంగళూరు: దేశంలోనే అత్యంత పిన్న వయసు ఎంపీలలో ఒకరిగా గుర్తింపుపొందిన తేజస్వి సూర్య చెన్నైకు చెందిన ప్రముఖ గాయని, శాస్త్రీయ సంగీతం, భరతనాట్య కళాకారిణి అయిన శివశ్రీ స్కంద ప్రసాద్‌ను వివాహం చేసుకున్న విషయం తెలిసిందే.వీరి రిసెప్షన్ బెంగళూరులో ఆదివారం ఘనంగా జరిగింది. అయితే దీనికి ముందు తమ రిసెప్షన్‌కు వచ్చే అతిథులకు తేజస్వి ఓ విజ్ఞప్తి చేశారు. పూలు, డ్రై ఫ్రూట్స్ కానుకగా ఇవ్వొద్దని కోరారు. ఇందుకు సంబంధించిన పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. తమ వివాహ సమయంలో అతిథులు పెద్ద మొత్తంలో పూలు, బొకేలను బహుమతులుగా తీసుకువచ్చారని.. అయితే పెళ్లి తర్వాత 24 గంటల్లోపు వాటిలో 85 శాతం పూలను పారవేయాల్సి వచ్చిందని తేజస్వి అందులో పేర్కొన్నారు. ప్రతి ఏడాది వివాహాల సమయంలో దాదాపు 3,00,000 కిలోల డ్రై ఫ్రూట్స్ మిగిలిపోతున్నాయని.. వాటిపై రూ.315 కోట్లు ఖర్చు చేస్తున్నారని ఓ సర్వేలో తేలినట్లు వివరించారు. కాబట్టి వృథా ఖర్చులను నివారించడానికి తమ రిసెప్షన్‌కు వచ్చే అతిథులు బొకేలు, డ్రై ఫ్రూట్స్ తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు.

# సమ్మెపోటు..

**జర్మనీ ఎయిర్‌పోర్టుల్లో 3400 విమానాలు రద్దు!**

**బెర్లిన్(జనంసాక్షి):** జర్మనీలోని విమానాశ్రయాల్లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మిక సంఘాలు ఒకరోజు సమ్మెకు పిలుపునిచ్చాయి. దీంతో ఫ్రాంక్‌ఫర్ట్, మ్యూనిక్ సహా ప్రధాన నగరాల్లోని ఎయిర్‌పోర్టుల్లో విమాన సర్వీసులపై ప్రభావం పడింది. వేలాది విమాన సర్వీసులు రద్దయ్యాయి. మొత్తంగా 5 లక్షల మంది ప్రయాణికులపై ప్రభావం పడనున్నట్లు అంచనా.ఒక్క ఫ్రాంక్‌ఫర్ట్ ఎయిర్‌పోర్టు నుంచి 1116 విమానాలు రాకపోకలు సాగిస్తుండగా ఇందులో 1054 సర్వీసులు రద్దయినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. బెర్లిన్ నుంచి నడిచే విమానాలన్నీ రద్దయ్యాయి. హాంబర్గ్‌లోనూ అదే పరిస్థితి. విమాన సర్వీసులు రద్దైనట్లు కొలోన్ ఎయిర్‌పోర్టు ప్రకటించగా.. సమ్మె కారణంగా విమాన సర్వీసుల సంఖ్య భారీగా తగ్గినట్లు మ్యూనిక్ విమానాశ్రయ అధికారులు ప్రయాణికులకు తెలిపారు. మొత్తంగా 3400 విమాన సర్వీసులు రద్దయ్యే అవకాశం ఉందని జర్మనీ ఎయిర్‌పోర్టు ఆపరేటర్స్ అసోసియేషన్ అంచనా వేసింది. దాదాపు 5లక్షల మంది ప్రయాణికులపై ఇది ప్రభావం చూపనున్నట్లు పేర్కొంది.వేతనాలు పెంచాలని ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్ చేస్తుండగా.. పని ప్రదేశంలో షరతులు సహా అదనపు సమయానికి ఎక్కువ మొత్తంలో బోనస్ ఇవ్వాలని కోరుతూ విమానాశ్రయాల్లో పనిచేసే సిబ్బంది, కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అయితే, వారి డిమాండ్లను పరిష్కరించలేమంటూ ఆయా యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవల జరిపిన చర్చలు విఫలం కావడంతో ఉద్యోగ, కార్మిక సంఘాలు ఒకరోజు సమ్మెకు దిగాయి.



# అస్సాంకు సొంత శాటిలైట్..!

## ఇస్రోతో చర్చలు జరుపుతున్నామన్న సీఎం హిమంత

గువహాటి: రాష్ట్ర అవసరాల కోసం సొంతగా ఉపగ్రహాన్ని ఏర్పాటు చేసుకోనున్నట్లు అస్సాం ప్రభుత్వం ప్రకటించింది. సరిహద్దులపై నిఘా ఉంచడంతోపాటు సామాజిక ఆర్థిక ప్రాజెక్టుల అమలుకు అవసరమైన సమాచారాన్ని సేకరించేందుకు దోహదం చేస్తుందని తెలిపింది. దీంతో దేశంలో సొంత ఉపగ్రహం కలిగిన తొలి రాష్ట్రంగా అస్సాం నిలువనుంది. "ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ అథరైజేషన్ సెంటర్ సహకారంతో రాష్ట్రం కోసం ప్రత్యేకంగా ఉపగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవాలని భావిస్తున్నాం. కీలకమైన ప్రాజెక్టుల అమలుకు అవసరమైన సమాచారాన్ని సేకరించేందుకు ఇదెంతో దోహదం చేస్తుంది" అని ఆర్థికమంత్రి అజంతా నియాగ్ వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆమె.. వ్యవసాయం, విపత్తు నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సరిహద్దు నిర్వహణ, పోలీస్ ఆపరేషన్లలో కీలక సేవలు అందిస్తుందని చెప్పారు.ఇదే అంశంపై ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ మాట్లాడుతూ.. రాష్ట్రానికి సొంతగా ఉపగ్రహం ఉంటే విదేశీయుల అక్రమ చొరబాట్లను అడ్డుకోవచ్చన్నారు. వాతావరణ నివేదిక ద్వారా రాబోయే వరదల గురించి ముందుగానే తెలుసుకోవచ్చన్నారు. ఇటీవల ఉమ్రాంగ్సోలో చోటుచేసుకున్న బొగ్గు గని ప్రమాదాన్ని ప్రస్తావించిన ఆయన.. ఉపగ్రహ సమాచారాన్ని పొందేందుకు నెలన్నర సమయం పట్టిందన్నారు. సొంతగా ఉపగ్రహం ఉండటం వల్ల అది మన ప్రాంతంపైనే పూర్తి నిఘా ఉంచుతుందన్నారు. దీని కోసం ఇస్రోతో చర్చలు మొదలుపెట్టామని సీఎం హిమంత వెల్లడించారు.



## జాతీయం అంతర్జాతీయం

# ఆంక్షల వలయంలోకి ట్రంప్ ప్రైవేటు విమానం



**జనంసాక్షి:**అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ సమీపంలో ఇటీవల ఓ అనుమానితుడి కదలికలు కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. దాంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిబ్బంది భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ క్రమంలో తాజాగా మరోసారి భద్రతా వైఫల్యం చోటుచేసుకోవడం గమనార్హం. ఆదివారం (అమెరికా కాలమానం ప్రకారం) ఫ్లోరిడాలోని ట్రంప్ నివాసం సమీపంలో అమల్లో ఉన్న ఆంక్షలు ఉల్లంఘనకు గురైనట్లు తెలుస్తోంది. ఆ భవనం దిశగా ఒక పౌర విమానం దూసుకొచ్చింది. దానిని గమనించిన వైమానిక దళం అడ్డుకుంది.ట్రంప్ తన వెస్ట్ పామ్ బీచ్‌లో గోల్ఫ్ ఆడుతున్నప్పుడు ఈ ఘటన జరిగిందని నార్త్ అమెరికన్ ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్ ఒక ప్రకటనలో తెలిపింది. ఆంక్షలు ఉన్న ప్రాంతంలోకి వచ్చిన ప్రైవేటు విమానాన్ని ఎఫ్-16 విమానాలు అడ్డుకున్నాయి. శనివారం ఉదయం కూడా ఇలాగే మరో పౌర విమానాన్ని జెట్స్ నిలువరించాయి. ఈ పరిణామాల వేళ ప్రైవేటు విమానాల పైలట్‌లు ఆంక్షలను పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలాఉంటే.. వైట్‌హౌస్ సమీపంలో అనుమానితుడి కదలికల గురించి స్థానిక పోలీసులు సీక్రెట్ సర్వీస్‌కు సమాచారం అందించారు. దాంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అధ్యక్ష భవనానికి కొంత దూరంలో పార్క్ చేసిన ఒక వాహనాన్ని గుర్తించారు. సమీపంలో ఓ వ్యక్తి నడిచి వెళుతుండగా.. అతడి వద్దకు చేరుకునేందుకు ప్రయత్నించారు. అధికారులు రావడాన్ని గమనించిన అతడు వెంటనే తన వద్ద ఉన్న తుపాకీ బయటకు తీశాడు. అతడిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తుండగా వారి మధ్య ఘర్షణ చోటుచేసుకొంది. అతడు కాల్పులు జరిపేందుకు యత్నిస్తుండగా.. సిబ్బంది నిందితుడిపై కాల్పులు జరిపారు. ఆ సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫ్లోరిడాలో ఉన్నారు. గాయపడిన నిందితుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది.



# రష్యా- బ్రిటన్ మధ్య భగ్గుమన్న విభేదాలు

## గూఢచర్యం ఆరోపణలపై ఇద్దరు బ్రిటన్ దౌత్యవేత్తలను బహిష్కరించిన మాస్కో

**జనంసాక్షి:**రష్యా-బ్రిటన్ మధ్య విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. తాజాగా గూఢచర్యం ఆరోపణలపై ఇద్దరు దౌత్యవేత్తలను తమ దేశం నుంచి బహిష్కరిస్తున్నట్లు మాస్కో ప్రకటించింది.వారు రెండు వారాల్లోగా తమ దేశం వదిలి వెళ్లిపోవాలని పేర్కొంది. ఓ పక్క అమెరికాతో సంబంధాలను బలోపేతం చేసుకొనేందుకు చర్చలు మొదలుపెట్టిన రష్యా.. మరో వైపు ఐరోపాతో విభేదాలు తీవ్రం కావడం గమనార్హం. ఫెడరల్ సెక్యూరిటీ సర్వీసెస్ అధికారులు మాత్రం ఈ ఇద్దరు దౌత్యవేత్తలు తప్పుడు సమాచారం ఇచ్చి రష్యాలోకి ప్రవేశించారని చెబుతున్నారు. వీరు గూఢచర్య కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. వారు రష్యా భద్రతకు ప్రమాదకరంగా పరిణమించినట్లు పేర్కొన్నా రు. ఈ నేపథ్యంలో తమ విదేశాంగశాఖ బ్రిటన్ దౌత్యకార్యాలయానికి సమన్లు పంపినట్లు పేర్కొంది.మరోవైపు ఈ పరిణామాలపై తక్షణమే స్పందించేందుకు బ్రిటన్ దౌత్యకార్యాలయం నిరాకరించింది. గతంలో కూడా ఈ దేశ దౌత్యవేత్తలపై మాస్కో ఇటువంటి ఆరోపణలే చేసింది. నాడు వీటిని లండన్ ఖండించింది. .మరోవైపు ఈ పరిణా మాలపై తక్షణమే స్పందించేందుకు బ్రిటన్ దౌత్యకార్యాలయం నిరాకరించింది. గతంలో కూడా ఈ దేశ దౌత్యవేత్తలపై మాస్కో ఇటువంటి ఆరోపణలే చేసింది. నాడు వీటిని లండన్ ఖండించింది అమెరికాతో చర్చలు మొదలుపెట్టిన తర్వాత రష్యా బహిష్కరించిన పశ్చిమ దేశాలకు చెందిన తొలి దౌత్యవేత్తలు వీరే. మరోవైపు ఉక్రెయిన్ యుద్ధం మొదలుకాగానే చాలా పశ్చిమ దేశాల్లో మాస్కో దూతలు బహిష్కరణలకు గురయ్యారు. దీంతో ఆయా దేశాల్లో రష్యా దౌత్యకార్యాలయ పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపింది.

# 33 జిల్లాల్లో భారీ రక్తదాన శిబిరాలు

**● పోస్టర్‌ను ఆవిష్కరించిన శాతవాహన యూనివర్సిటీ విసి ఉమేష్ కుమార్**

**కరీంనగర్ బ్యూరో, మార్చి 10 (జనంసాక్షి)**



ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు , యువ వీరకిశోరాల బలిదాన దినోత్సవం సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల 94వ వర్ధంతిని పురస్కరించుకొని నిఫా ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా 33 జిల్లాల్లో ఈనెల 16 నుండి 23వ తేదీ వరకు చేపట్టనున్న రక్తదాన శిబిరాల నిర్వహణ పోస్టర్ ను సోమవారం రోజున శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యు. ఉమేష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ఉమేష్ కుమార్ మాట్లాడుతూ... ఆనాడు దేశం కోసం, బ్రిటిష్ పాలన కబంధహస్తాల నుండి దేశాన్ని రక్షించుకోవడానికి ప్రాణాలర్పించి , త్యాగదనులైన ఎందరో మహానుభావులు ఉన్నారని , వారు దేశం కోసం చేసిన త్యాగాలు మరవలేవన్నారు. వారి స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అలాగే దేశ సమైక్యత , సమగ్రతను కాపాడుతూ సాంస్కృతి క సాంప్రదాయాలను రక్షించుకోవాల్సిన బాధ్యత యువతపైనే ఉందన్నారు. నిఫా అధ్యక్ష, కార్యదర్శులు కే యాదవ రాజు, కోలగని శ్రీనివాస్ లు స్వాతంత్ర సమరయోధులు సర్దార్ భగత్ సింగ్ , రాజ్ గురు , సుఖ దేవ్ ల 94వ వర్ధంతినిపురస్కరించుకొని అంతర్జాతీయ స్థాయిలో 20 దేశాలలో , భారతదేశంలో 28 రాష్ట్రాలు, 6 కేంద్రపాలిత ప్రాంతాలు, 800 జిల్లాలలో మార్చి 16 నుండి 23 వరకు అంతర్జాతీయ రక్తదాన శిబిరాల నిర్వాహనకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నేషనల్ యూత్ ప్రాజెక్ట్ , నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరం ఆఫ్ ఆర్టిస్ట్ అండ్ ఆక్టివిటీస్, వివిధ కళాశాలల జాతీయ సేవా పథక బాధ్యులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్స్, వివిధ స్వచ్ఛంద సంఘాలు, యువజన సంఘాల సహకారంతో 150 రక్తదాన శిబిరాలను తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాలలో భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్టర్ జె.రవికుమార్, ఓఎస్డి.డి.ఆర్. హరికాంత్ , ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ గోపికృష్ణ , నిఫా కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గొల్లె తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# మహిళా స్వాలంబనకు మద్దతుగా మరో అడుగు



**● మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**

**● ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభించిన మేయర్, డిప్యూటీ మేయర్**

**హైదరాబాద్, మార్చి 10 (జనంసాక్షి)**

మహిళలు ఆర్థికంగా స్వాలంబన సాధించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి లతో కలిసి ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాంటీన్ ఏర్పాటు చేసుకున్న స్నేహిత సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు మహిళలను వ్యాపారవేత్తలు గా రాణించేలా ప్రోత్సహిస్తుందన్నారు. అందులో భాగంగా ఇందిరా మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ఆసక్తి గల స్వయం సహాయక సంఘాల మహిళలచే ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ లను ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందేలా చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. మహిళా సాధికారితను ప్రోత్సహిస్తూ స్వయం ఉపాధికి ఊతం ఇచ్చే లక్ష్యంతో ప్రారంభించిన ఈ క్యాంటీన్ల ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా నగర ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన అల్పాహారం, భోజనం అందుబాటులోకి వస్తుందన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ క్యాంటీన్ వేగవంతంగా అభివృద్ధి చెందాలని ఆమె కోరారు.

డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న అన్ని అవకాశాలను అందిపుచ్చుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకాన్ని స్వయం సహాయక సంఘాల మహిళలందరూ వినియోగించుకొని తమ నైపుణ్యత,

ఆసక్తి మేరకు రాణించాలన్నారు. జీహెచ్ఎంసీ కార్యాలయానికి వచ్చే ప్రజలకు, కార్యాలయ ఉద్యోగులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని సరసమైన ధరలకు అందించాలని సూచించారు. జూబ్లీహిల్స్ సర్కిల్ కు చెందిన స్నేహిత స్వయం సహాయక సంఘానికి చెందిన ఐదు మంది మహిళలు రూ. 5 లక్షల ఆర్థిక సహాయంతో

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద ఇట్టి క్యాంటీన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యు.సి.డి అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్ రెడ్డి, డి.సి ప్రశాంతి, అమీర్పేట్ ఎస్.బి.ఐ బ్రాంచ్ మేనేజర్, డి.పి.ఓ ఆశ, స్నేహిత స్వయం సహాయక సంఘం సభ్యులు, పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ అశోక్ కుమార్**



**భూపాలపల్లి, మార్చి 10 (జనం సాక్షి)**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 45 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అదనపు కలెక్టర్ స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. దరఖాస్తులు పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాల్లో వికలాంగులకు వాటా కల్పించాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 10 (జనం సాక్షి)**



విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో ప్రజావాణి లో కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భం గా వ్యవస్థాపక అధ్యక్షులు చిప్ప దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు అవుతున్న పథకాల్లో 5% అవకాశం కల్పించాలని. ప్రభుత్వం ఇచ్చిన మాట 6000 పెన్షన్ ఉచిత రావాణ సౌకర్యం బ్యాక్ లాగ్ ఉద్యోగాల భర్తీ ఉన్నత విద్య ఉద్యోగాల రిజర్వేషన్లు 2016 దివ్యాంగుల చట్టం పూర్తిస్థాయిలో అమలు,అదేవిధంగా అమలు అవుతున్న ఇందిరా మహిళా శక్తి ద్వారా కోటి మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కనిపిస్తున్న ప్రభుత్వం దివ్యాంగుల మహిళలకు 5% కెటాయించలని, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిరంతర ప్రక్రియలో భాగంగా దివ్యాంగుల దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరు చేయాలని చేసుకోలేని దివ్యాంగులకు మండలాల వారీగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అవకాశం కల్పించాలి అని కోరారు ఈ కార్యక్రమంలో సబ్ కమిటీ చైర్మన్ పంగ ఈశ్వర్, వైస్ చైర్మన్ నితీష్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గాడి నర్సింలు పాల్గొన్నారు,

## అట్రాసిటీ కేసులలో పరిహారం పంపిణీ

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 10 (జనంసాక్షి)**

**46 మందికి రూ 36,87,500 లు బ్యాంక్ ఖాతాల్లో జమ కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ**

: రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు అట్రాసిటీ కేసుల కింద నష్టపరిహారం పంపిణీ చేసినట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆయా మండలాల్లో నమోదైన ఎస్సీ,ఎస్టీలకు అట్రాసిటీ కేసుల ఆధారంగా మొత్తం 46 మందికి రూ 36,87,500 పరిహారం వారి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.ఎస్సీ, ఎస్టీలకు అట్రాసిటీ చట్టం ప్రకారం ముస్తాబాద్ మండలంలో 3, కోనరావుపేట మండలంలో 6,వేములవాడ అర్బన్,రూరల్ మండలంలో 12,సిరిసిల్ల మండలంలో 5, చందుర్తి మండలంలో 3, బోయినపల్లి మండలంలో 4, తంగళ్లపల్లి మండలంలో 5, గంభీరావుపేట మండలంలో 2, ఎల్లారెడ్డిపేట మండలంలో 2, ఇల్లంతకుంట మండలంలో 3, జగిత్యాల జిల్లాలో ఒకరికి పరిహారం పంపిణీ చేసినట్లు ప్రకటనలో తెలిపారు.

## మధ్యాహ్నం భోజనం దొడ్డు రకం

**అన్నం తినలేకపోతున్న విద్యార్థులు**

**గంభీరావుపేట్, మార్చి 10 (జనంసాక్షి)**





: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మధ్యాహ్న భోజనం పథకంలో, సన్నరకం బియ్యాన్ని ఇస్తామని దొడ్డు రకం బియ్యాన్ని పిల్లలకు పెడుతున్నారు. ఆ బియ్యం కొత్తబియ్యం కావడం వల్ల అన్నం మెత్తగా ముద్దను ముద్దలుగా, అవుతుందని పిల్లలు తినలేక పోతున్నారని చెబుతున్నారు. కేజీ టు పీజీ ఆవరణలో ఉన్నటువంటి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో అన్నం ముద్దలు ముద్దలుగా అవుతుందని పిల్లలు తినలేక పోతున్నామని చెబుతున్నారు. అధికారు పట్టించుకోని నాణ్యమైన బియ్యాన్ని అందజేసి అన్నం మంచిగా పెట్టమని విద్యార్థులు కోరుకుంటున్నారు.... ఇంతకుముందే ఈ విషయంపై జనం సాక్షి కథనం రాసిన విషయం తెలిసిందే కానీ అధికారులు పట్టించుకోవడం లేదు, ఇప్పటికైనా అధికారులు పట్టించుకోని నాణ్యమైన బియ్యాన్ని పంపిణీ చేసి మంచి అన్నం విద్యార్థులకు అందించాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. జనం సాక్షి రిపోర్టర్ ఎమ్మార్వో ను వివరణ కోరగా, వాటిని పంపించి నాణ్యమైన బియ్యాన్ని పంపిణీ చేస్తానని చెప్పారు,

# ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తాం

**● వరంగల్ నూతన పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**

**వరంగల్ ప్రతినిధి, మార్చి 10 (జనంసాక్షి)**



నిరంతరం ప్రజలకు సేవలదిస్తూ అన్ని వేళలలో ప్రజలకు అందుబాటులో వుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. రాష్ట్ర ఉత్తర్వుల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కమిషనరేట్ కార్యాలయమునకు చేరుకున్న నూతన పోలీస్ కమిషనర్‌కు డిసిపిలు,అదనపు డిసిపిలు పుష్పాగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సాయుధ పోలీసు గౌరవవందనం స్వీకరించిన అనంతరం నూతన పోలీస్ కమిషనర్‌గా పూర్వ సిపి అంబర్ కిషోర్ ఝూ నుండి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్బంగా అంబర్ కిషోర్ ఝూ నూతన పోలీస్ కమిషనర్ పుష్ప గుచ్చాలను అందజేసి అభినందనలు తెలియజేసారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నూతన పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వంద శాతం శాంతి భద్రతలను కాపాడుతామని, ప్రజలకు పోలీసులపై నమ్మకం కలిగే విధంగా ఇరువై నాలుగు గంటలు ప్రజల కొసం పనిచేస్తామని, ప్రధానంగా నేరాల నియంత్రణతో పాటు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకై కృషి చేస్తామని, ప్రస్తుతం పోలీసులు ఎదుర్కోంటున్న సవాళ్ళు అయిన సైబర్ క్రైం, మత్తు పదార్థాల కట్టడితో పాటు మత్తు పదార్థాల వినిగయోగించేవారు, విక్రయించేవారి పట్ల కఠినంగా వ్యవహరించ బడుతుందని, ముఖ్యంగా మహిళల భద్రత పై ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుందని. రాబోవు రోజుల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసులను మరింత బలోపేతం చేయడం జరుగుతుందని నూతన పోలీస్ కమిషనర్ తెలిపారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన వరంగల్ పోలీస్ కమీషనర్ సన్‌ప్రీత్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకోని పుష్పాగుచ్చాలను అందజేసి అభినందనలు తెలియజేసిన వారిలో డీసీపీ లు షేక్ సలీమా, రాజమహేంద్ర నాయక్, అంకిత్ కుమార్, ఏ. ఎస్పీ చైతన్య, అదనపు డీసీపీ లు రవి, సురేష్ కుమార్ తో పాటు వరంగల్ పోలీస్ కమిషనరేట్ చెందిన ఏసిపిలు, ఇన్స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఆర్.ఎస్.ఐలు ఇతర విభాగాలకు చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ లేకుండా పరిష్కరించాలి..

**● వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్ ప్రతినిధి, మార్చి10 (జనంసాక్షి)**



ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖ అధికారులు సత్వరమే పరిష్కరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి తెలిపారు. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, వరంగల్ ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి,డిఆర్డిఓ కౌసల్య దేవి, జెడ్పీ సీఈవో రామ్ రెడ్డి, హౌసింగ్ పీడీ గణపతి పాల్గొని ప్రజల సమస్యల పైన వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణి లో మొత్తం దరఖాస్తులు 103 రాగా వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎక్కువగా భూ సంబంధిత సమస్యల పై 53 దరఖాస్తులు రాగా, డిఆర్డిఓ 3, విద్య శాఖ 6, వ్యవసాయ శాఖ 5 దరఖాస్తులు వచ్చాయని,మిగతావి వివిధ శాఖలకు సంబంధించిన సమస్యల పైన దరఖాస్తులు వచ్చాయని అన్నారు.ఎక్కువగా భూ సమస్యల పై దరఖాస్తుల వచ్చాయని వాటిని వరంగల్ తాసిల్దార్ కు ఎండార్స్ చేస్తూ బాధితులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజావాణి అనంతరము జిల్లా ఇన్చార్జి మంత్రి జిల్లా కలెక్టర్ల తో సమీక్షించిన తీరును జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్ డబ్ల్యు ఎస్, ఇరిగేషన్, అగ్రికల్చర్ , మిషన్ భగీరథ, ఎలక్ట్రిసిటీ శాఖ అధికారులు ప్రత్యేకంగా ఎండాకాలంలో త్రాగునీటి సమస్య కరెంట్ సమస్ లు రాకుండా ఆయా శాఖల సంబంధిత అధికారులు బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ అన్నారు.ఇరిగేషన్,మిషన్ భగీరథ,ఎలక్ట్రిసిటీ శాఖల అధికారులు సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారుచేసి ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టవలసిందిగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు ఫేస్ 1 గ్రామాలలో మంజూరు అయిన వాటికి మార్కౌట్ ఇచ్చుటకు మరియు మిగిలిన గ్రామాల నుండి వచ్చిన దరఖాస్తులను 3 కేటగిరిలో ఎంపిక చేసిన ఇండ్ల దరఖాస్తులు పరిశీలించుటకు తగు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పిడి గణపతిని ఆదేశించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రబీ సీజన్ లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని కొనుగోలు మండలాల ప్రత్యేక అధికారులు సెంటర్ల ఇన్చార్జిలతో మరియు సంబంధిత అధికారులతో మీటింగ్ ఏర్పాటు చేసి రవి సీజన్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి మండలాల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. అకాల వర్షాలు వచ్చినప్పుడు ధాన్యం స్టోరేజ్ కి తారపల్లిలో అందుబాటులో ఉండేలా చూసుకోవాల్సిందే వారు పేర్కొన్నారు.

వారి ధాన్యాన్ని రోడ్లపైన ఆరబెట్టడం వలన ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున రైతులు గమనించి వాటికోసం నిర్దేశించిన స్థలాలలో మాత్రమే దాన్ని ఆరబోయాల్సిందిగా సూచించారు. డాడీ క్లీనర్స్, హార్వెస్టర్స్, మీటింగ్ ఏర్పాటు చేసి వరి కోత వచ్చే సమయానికి మాత్రమే వరి కోతను కోయాలని రైతులకు అవగాహన కల్పించాల్సిందిగా ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ డి సి ఓ నీరజ డిపిఓ కల్పన వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్, కలెక్టరేట్ ఏవో విశ్వప్రసాద్ సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు

# మీలో ఒకడినై ఉంటా..

**జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్ ప్రతినిధి, మార్చి 10 (జనంసాక్షి) :**



మీలో ఒకడినై ఉంటూ ఆదిలాబాద్ జిల్లాలోశాంతి భద్రతలను మరింత కట్టు దిట్టం చేస్తానని నూతనంగా వచ్చిన ఎస్పీ అఖిల్ మహజన్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లాకు నూతనంగా వచ్చిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్తమ బాధ్యతలను చేపట్టారు. ఈమేరకు కరీం నగర్ పోలీసు కమిషనర్ గౌస్ ఆలం ఎస్పీకి పూల మొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన ఎస్పీ కరీంనగర్ సిపి గౌస్ ఆలం వద్ద నుండి ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ మీలో ఒకడిగా ఉంటూ ఆదిలాబాద్ జిల్లాలో శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానని తెలిపారు.జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఉన్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కట్టడి చేస్తామని అన్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా క్రిమినల్ యాక్టివిటీస్ లేకుండా నేరాలను నియంత్రించి, శాంతి భద్రతల పరిరక్షణ మా ప్రధాన ధ్యేయం అని తెలిపారు. జిల్లాలో గంజాయి మరియు మాదకద్రవ్యాల పై ప్రత్యేక దృష్టి సారించి వాటిని అరికట్టేందుకు ప్రత్యేక నిఘా పెడతామన్నారు. రౌడీలు, గ్యాంగ్ స్టర్స్ లేకుండా చూస్తామన్నారు. అదేవిధంగా పటంలోని ట్రాఫిక్ సమస్యపై ఇంకా జిల్లాలో ఎలాంటి సంఘ విద్రోహ శక్తుల సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తామని తెలిపారు. ప్రజలు పోలీసులు అందరూ కలిసికట్టుగా ఉంటూ ఆదిలాబాద్ జిల్లా ఉన్నత స్థానానికి ఎదిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పి బి సురేందర్రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, సిహెచ్ నాగేందర్, హసీబుల్లా, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# విదేశాల్లో ఉద్యోగాల పేరుతో ఎర



సైబర్ నేరగాళ్ల వలలో థాయ్ లాండ్ లో బందీగా యువత

కేంద్ర మంత్రి బండి సంజయ్ జోక్యం.. 540 మంది బందీలకు విముక్తి

ప్రత్యేక విమానంలో భారత్ కు రాక

ఏపీ, తెలంగాణకు చెందిన పలువురికి సైతం విముక్తి

హైదరాబాద్ (జనంసాక్షి)

ఉద్యోగాల కోసమని వెళ్లి థాయ్‌లాండ్ కేంద్రంగా సైబర్ ఫ్రాడ్ కేఫ్ లో బందీలుగా మారి బలవంతంగా సైబర్ వెట్టిచాకిరికి గురవుతున్న వందలాది మంది భారతీయ యువతకు విముక్తి లభించింది. కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జోక్యంతో వీరందరినీ స్వదేశానికి రప్పించే ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. మొత్తం 540 మంది బందీలను గుర్తించగా వీరిలో తెలంగాణ, ఏపీకి చెందిన 42 మందిని గుర్తించారు. వీరందరినీ 270 మంది చొప్పున రెండు విమానాల్లో తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. తొలుత వీరిని థాయ్‌లాండ్‌లోని మై సోట్ పట్టణానికి తరలించిన అక్కడి అధికారులు అక్కడి విమానాశ్రయం నుంచి ఢిల్లీకి తరలిస్తున్నారు. ఈరోజు(సోమవారం) 270 మందితో కూడిన తొలి విమానం థాయ్‌లాండ్‌లోని మై సోట్ నుంచి ఢిల్లీకి బయల్దేరింది. మంగళవారం మరో 270 మందితో రెండో విమానం ఇండియాకు రానుంది. ప్రస్తుతం వీరంతా మయన్మార్‌లోని మేవాడీ జిల్లాలో ఆర్మీ పరిరక్షణలో ఉన్నారు. వీరందరినీ మంగళవారం ఉదయం మయన్మార్ ఆర్మీ ట్రక్కుల్లో తొలుత థాయ్‌లాండ్ లోని మైసోట్‌కు, అక్కడ ప్రత్యేక ఆర్మీ విమానంలో ఇండియాకు తీసుకురానున్నారు. వాస్తవానికి వీరంతా విదేశాల్లో ఉద్యోగాలు చేసేందుకు వెళ్లి అక్కడ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్నారు. థాయ్‌లాండ్ కేంద్రంగా వీరందరికీ ఉద్యోగాలిప్పిస్తామని స్థానిక ఏజెంట్ల ద్వారా సైబర్ నేరగాళ్లు ఆయా యువతకు ఆశ చూపారు. వారికి ఉద్యోగాలు ఖరారయ్యాయని నమ్మబలికిన ఏజెంట్లు థాయ్‌లాండ్‌తోపాటు పొరుగున్న కంబోడియా, లావోస్, మయన్మార్‌లలో పలు సైబర్ ఫ్రాడ్ కేఫ్‌లో వీరిని విక్రయించారు. అక్కడికి వెళ్లాక వారితో బలవంతంగా ఆన్‌లైన్ నేరాలు చేయిస్తున్నారు. ఒకవేళ సైబర్ నేరాలు చేయకపోతే యువతీ, యువకులకు కరెంటు షాకులిచ్చి హింసిసా _రు. కరీంనగర్ జిల్లా మానకొం దూరు మండలం రంగపేట గ్రామానికి చెందిన మధుకర్‌రెడ్డి అనే యువకుడు ఇలాగే కొలువు కోసం వెళ్లి బందీగా మారిన విషయం మీడియాలో వచ్చింది. వెంటనే స్పందించిన కేంద్ర హెూంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ వారిని రప్పించేందుకు చర్యలు తీసుకున్నారు. భారత విదేశాంగశాఖకు స్వయంగా లేఖ రాశారు. మయన్మార్, థాయ్‌లాండ్ దౌత్యకార్యాలయాలను అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలో మయన్మార్ ప్రభుత్వం తన ఆర్మీని పంపి సైబర్ ఫ్రాడ్ కేఫ్‌లలో బంధీలుగా ఉన్న భారతీయులను రక్షించింది. అనంతరం బండి సంజయ్ చొరవతో కేంద్రం వారందరినీ స్వదేశానికి రప్పిస్తుండటం గమనార్హం.

# రేషన్ షాప్‌పై టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడి

- న్యాల్ కల్ రేషన్ డీలర్ విధుల నుండి బహిష్కరణ
- ఆకస్మికంగా తనిఖీ చేసిన హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ బృందం



న్యాల్ కల్, మార్చి 10 (జనంసాక్షి)

: హైదరాబాద్, సంగారెడ్డి పౌర సరఫరాలకు చెందిన టాస్క్ ఫోర్స్ అధికారుల బృందం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పౌర సరఫరాల డిఎస్పి వెంకటేశం, సిఐ పండరి, ఎస్సై వెంకటేశ్వర్లు, జిల్లా పౌర సరఫరాల అధికారి బసవరాజ్ లు సోమవారం ఉదయం సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ లోని పౌర సరఫరాల కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. దాదాపు రెండు గంటలకు పైగా విచారణ చేపట్టారు. న్యాల్ కల్ లో 1096 రేషన్ కార్డుల్లో తెల్ల రేషన్ కార్డులు 970, అంత్యోదయ రేషన్ కార్డులు 126 గాను విచారణ



చేపట్టారు. 1096 రేషన్ కార్డులకు గాను రేషన్ బియ్యం పంపిణీ కేంద్రంలో 188 క్వింటాళ్లలకు గాను 202 క్వింటాళ్ల బియ్యం ఉండటంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మరింత లోతుగా విచారణ చేపట్టారు. ఈ మేరకు14 క్వింటాళ్ల బియ్యం అదనంగా ఉండడంతో సదరు రేషన్ డీలర్ జమీల్ హైమద్ పై టాస్క్ ఫోర్స్ అధికారుల బృందం ప్రశ్నించారు. అనంతరం జిల్లా పౌర సరఫరాల అధికారులకు నివేదికను పంపారు. రేషన్ లబ్ధిదారులకు అసౌకర్యం కలుగకుండా ప్రస్తుతం పౌర సరఫరాలను పంపిణీ చేస్తున్న రేషన్ డీలర్ జమీల్ హైమద్ తాత్కాలికంగా విధుల నుండి తొలగించి మండలంలోని కాకిజనవాడ గ్రామానికి చెందిన పౌర సరఫరాల డీలర్ జలీల్ హహ్మద్ కు అదనపు బాధ్యతలు అప్పగించారు. పంపిన నివేదిక ఆధారంగా జిల్లా పౌర సరఫరాల అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టిన అనంతరం రేషన్ డీలర్ పై అవసరమగు చర్యలు తీసుకోనున్నట్టు సమాచారం. జిల్లా, మండల పౌర సరఫరాల అధికారుల అనుమతితో త్వరలోనే న్యాల్ కల్ కు తాత్కాలికంగా ఇన్చార్జి రేషన్ డీలర్ ను నియమించనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

# అభివృద్ధి నిరోదకుడు ఎమ్మెల్యే మహేశ్వరెడ్డి

## మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్ బ్యూరో, మార్చి10 (జనంసాక్షి)



తన హయాంలో మంజూరైన అభివృద్ధి పనులను అడ్డుకుంటూ,వసూళ్ళ దందాకు ఎగబడ్డాడని,ప్రతీ పనికి వాటా కావాలని అభివృద్ధిని అడ్డుకుంటున్నాడని. ఎమ్మెల్యే మహేశ్వరెడ్డి పై మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ముందు రైతులతో కలిసి పెద్దఎత్తున ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా రైతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ. సొన్ మండలం పాకుపట్ల గ్రామం వద్ద నిర్మించ తలపెట్టిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ,అమృత్ స్కీం, చెక్ డ్యామ్ నిర్మాణ పనులకు అడ్డంకులు సృష్టిస్తూ,అభివృద్ధి నిరోదకుడుగా మారాడని ఆరోపించారు.జిల్లాలో పదహారు వందలమంది రైతులు ఆయిల్ ఫామ్ తోటలు సాగు చేసుకుంటున్నారని,మరికొద్ది రోజుల్లో పంట చేతుకు వచ్చే సమయం ఆసన్నమైందని రైతులు ఆందోళన చెందుతున్నారు.ఫ్యాక్టరీ ఏర్పాటుకు గత ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, ఎమ్మెల్యే మహేశ్వరెడ్డి ఎన్వోసి ఇవ్వకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు.ఆయన గెలిచి పదిహేను మాసాలు గడుస్తున్నా నియోజకవర్గంలో చిల్లిగవ్వ పనులు కూడా చేయలేదని,తాను మంజూరు చేసిన అభివృద్ధి పనులకు కొబ్బరికాయ, భూమిపూజలు చేస్తూ కాలయాపన చేస్తున్నాడని ఆరోపించారు, గతంలో సండే ఎమ్మెల్యే అనేవారు.కానీ ఇప్పుడు నెల ఎమ్మెల్యే అంటున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్లో ఉంటూ బిజెపి ఫ్లోర్ లీడర్ నంటూ వసూల్ రాజుగా మారాడని ఆరోపించారు.ప్రజలను రెచ్చగొడుతూ,తన కుటుంబంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ కు ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీకి అనుమతి ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ కొరకు తాను రైతుల పక్షాన పోరాడుతునాని,అవసరమైతే హైదరాబాద్ వెళ్లి అధికారులను,మంత్రులను కలుస్తానని తెలిపారు.. ఈకార్యక్రమంలో నాయకులు, పాకాల రామచందర్,మురళీధర్ రెడ్డి,క్రిష్ణ ప్రసాద్ రెడ్డి,వినోద్,అప్పాల మహేష్,నారాయనరెడ్డి,మేడారం ప్రదీప్, నాలం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

# జికె ఒలంపియాడ్‌లో అల్ఫోర్స్ ప్రతిభ

కరీంనగర్ బ్యూరో, మార్చి 10 (జనంసాక్షి)



: విద్యార్థులకు సామాజిక అవగాహన చాలా అవసరమని, దానిద్వారా సమాజం గురించి అవగాహన పెరుగుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా వి. నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో నిర్వహించినటువంటి విద్యార్థుల అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు పలు పోటీ పరీక్షలలో జనరల్ నాలెడ్జ్ చాలా కీలకంగా వ్యవహరిస్తుందని వాటిలో విజయాలు సాధించడానికై ఎంతగానో ఉపకరిస్తుందని వారు అభిప్రాయ పడ్డారు. ప్రతి విద్యార్థి సమాజంలోని విషయాలను సమగ్రంగా సముచితంగా తెలుసుకోవాలని, ఇందులోని విషయాలు కేవలం ఇప్పటికే కాకుండా రాబోయే రోజులకు చాలా ఉపయోగపడుతుందని చెప్పారు. విద్యార్థులు జి.కె.లోని విషయాలను క్రమం తప్పకుండా పుస్తకపఠనం, వార్తా పత్రికలను చదవడం ద్వారా పెంపొందించుకోవాలని, వివిధ సంస్థల వారు నిర్వహించేటువంటి పలు ప్రతిభా పరిక్షలలో ఘన విజయాలు సాధించి ఇతరులకు దీటుగా నిలవాలని తెలిపారు. ఈ క్రమంలో గత నెలలో న్యూఢిల్లి కి చెందిన పోటీ పరీక్షల సంస్థ అయిన గ్లోబల్ ఇండియా ఫౌండేషన్ వారు నిర్వహించినటువంటి పాఠశాల స్థాయి జి.కె ఒలంపియాడ్లో పాఠశాలకు చెందిన టువంటి 10 మంది విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. పతకాలు సాధించిన విద్యార్థుల వివరాలు ఎ. మయాంక్ రెడ్డి, 4వ తరగతి, ఎ. మాన్యశ్రీ పటేల్, 5వ తరగతి, ఎ. అక్షిత నాయక్, 6వ తరగతి, కె. భువనశ్రీ, 6వ తరగతి, యం. శివెన్ రెడ్డి, 7వ తరగతి, కె. సాయి వర్షిత్, 7వ తరగతి, యన్. కృష్ణప్రతీక్, 9వ తరగతి, జి. హెమంత్ జాదవ్, 9వ తరగతి, కె. విశ్వక్సేన్, 9వ తరగతి, కాంస్య పతకాలు, ప్రశంసాపత్రాలు సాధించారని యస్.పి. కృష్ణచైతన్య, 7వ తరగతి, రజత పతకం, ప్రశంసాపత్రాలు సాధించారని సంతోషం వ్యక్తం చేశారు.



# 62.5 కోట్ల కేంద్రప్రభుత్వ నిధులతో అమృత్ పథకానికి శంకుస్థాపన

## బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ బ్యూరో, మార్చ్10 (జనంసాక్షి)

నిర్మల్ జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకం ద్వారా రూ. 62.5 కోట్ల రూపాయలతో త్రాగునీటి పథకానికి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి. శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలకు సురక్షిత మంచినీరు అందించడమే లక్ష్యంగా దేశ వ్యాప్తంగా ఈ పథకం కింద అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గత పాలకులు పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని ఎన్నికలు వచ్చినప్పుడల్లా భూటకపు హామీలు ఇచ్చి ఓట్లు దన్నుకున్నారని, భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా తనని ఆశీర్వదించిన వెంటనే కేంద్ర ప్రభుత్వం ద్వారా పట్టణంలో ఎస్టిపి ప్లాంట్ల ఏర్పాటుకు 42 కోట్ల రూపాయలు మంజూరుకు కృషి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, సత్యనారాయణ గౌడ్, మెడిసెమ్మ రాజు, ఆకుల కార్తీక్, సుంకరి సాయి, సాధం అరవింద్, నవీన్, నరేందర్, శంకర్ పతి, సూరి తో పాటు తదితరులు పాల్గొన్నారు

# బీసీల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 10 (జనంసాక్షి)



: బీసీల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని బీసీ,రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. సోమవారము వేముల వాడలో గౌడ చారిటబుల్ ట్రస్ట్ భవనము ప్రారంభ కార్యక్రమం లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ ఆదేశాలతో దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కుల గణన సర్వే చేపట్టిదన్నారు.సర్వే ఎఫెక్ట్ తోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముగ్గురు బీసీలకు ఎమ్మెల్సీలుగా అవకాశం లభించినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్,సీపీఐ, బిఆర్ఎస్ పార్టీ ఏదైనా ఎస్సి ఎస్టిలతో పాటు బీసీలకు ఐదు ఎమ్మెల్సీలుగా రావడంపై బీసీ మంత్రిగా స్వాగతం తెలుపుతునన్నారు.అందరూ ఐక్యంగా ఉండి 42 శాతం రిజర్వేష్లన్ తో పాటుగా సామాజికముగా ఆర్థికంగా,రాజకీయ అంశాల్లో ఎదగాలన్నారు. పేద విద్యార్దులు చదువుకునే ఎస్సి ఎస్టీ, బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టలలో ఒక్కో హాస్టల్ కు 200 కోట్లతో 55 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు 11 వేల కోట్లతో మంజూరు చేయడం సంతోషమ న్నారు.ఇది విప్లవాత్మకమైన నిర్ణయమని, సిఎం,ఉప ముఖ్యమంత్రి, మంత్రులకు ధన్యవాదములు తెలిపారు.బలహీన వర్గాలకు ఎమ్మెల్సీ సీట్లు కేటాయించడం పై అన్ని పార్టీల నాయకత్వాలకు కూడా ధన్యవాదాలు తెలిపారు.

# ఇద్దరు కేజీబీవీ ఉపాధ్యాయుల సస్పెండ్

సంగారెడ్డి ప్రతినిధి, మార్చి10, (జనం సాక్షి) :



కంగ్టి కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయురాలను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వ ర్లు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థినీ లపై గణిత శాస్త్రం బోధించే ఉపాధ్యాయురాలు సురేఖ, పిఈటి రేణుకలు చితకబాదిన కారణంగా విధుల నుండి తొలగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాళ్లు విద్యార్థునులపై అకారణంగా చేయి చేసుకుంటే చర్యలు తప్పవని సంగారెడ్డి జిల్లా డిఇఓ వెంకటేశ్వర్లు హెచ్చరించారు.

# జోగిపేటలో పేకాట రాయుళ్ల అరెస్ట్

## రూ.16.250 నగదు స్వాధీనం

జోగిపేట, మార్చి10( జనం సాక్షి):

జోగిపేట మున్సిపల్ పట్టణంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్ సమీపం వద్ద పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు జోగిపేట ఎస్ఐ పి. పాండు తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు సోమవారం శ్రీరామ ఫంక్షన్ హాల్ ప్రాంతం వద్ద ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించగా రహస్యంగా చింతచెట్టు కింద పేకాట ఆడుతున్న పట్టణానికి చెందిన కటికే భగవాన్, కటికే సాయి, బుసిరెడ్డిపల్లి శివ శంకర్ అనే ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 16,250 నగదును, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పాండు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎక్కడైనా రహస్య ప్రాంతంలో పేకాటలు ఆడినట్టు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలిపారు.

# కౌడిపల్లిలో కరాటే బెల్ట్ టెస్ట్



కౌడిపల్లి మార్చి10,(జనంసాక్షి)

మెదక్ జిల్లా కౌడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం కరాటే బెల్ట్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. కౌడిపల్లి కొల్చారం మండలకు చెందిన సుమారు 130 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగింది.ఈ బెల్ టెస్ట్ కు ఎగ్జామినల్ గా ప్రతాప్ సింగ్ రాథోడ్,వ్యవ హరించగా ఎగ్జామ్ అబ్జర్వర్లుగా కౌడిపల్లి కొల్చారం మండలాలకు చెందిన కరాటే మాస్టర్ తునికి కి చెందిన కరాటే మాస్టర్ ప్రసన్న, రైలాపూర్ కు చెందిన భూపాల్,రంగంపేట కు చెందిన గణేష్, పైతరకు చెందిన కరాటే మాస్టర్ మల్లేష్, వ్యవహరించారు. వీల్లు గత సంవత్సరంగా ఆయా గ్రామాలలో శిక్షణ పొందుతున్నారు. కరాటే లో బెల్ట్ ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు స్థానిక హై స్కూల్ హెచ్ఎం పద్మజ చేతుల మీదుగా సర్టిఫికెట్ ప్రధానం చేయడం జరిగింది. ప్రముఖ పీడీ కరాటే మాస్టర్ రాథోడ్ ప్రతాప్ సింగ్, మాట్లాడుతూ... నేటి యువత పెడదారిన పట్టకూడదంటే కరాటే లాంటి విద్యలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు అలాగే స్థానిక కౌడిపల్లి హెచ్ఎం పద్మజ మాట్లాడుతూ... అబ్బాయిలతో పాటు అమ్మాయిలకు సమానత్వంగా కరాటే ఎంతగానో ఉపయోగపడు తుందని అన్నారు అనంతరం కరాటే లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు.

# ఎస్సీ వర్గీకరణ అయ్యేవరకు అన్నిరకాల ఉద్యోగ ఫలితాలు నిలిపివేయాలి

బోధన్, మార్చి 10 ( జనంసాక్షి ) :



ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరణ పూర్తయ్యే వరకు అన్ని రకాల ఉద్యోగ ఫలితాలను నిలిపివేయాలని కోరుతూ సోమవారం మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సోమవారం రెంజల్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో రిలే నిరసన దీక్షలు కిన్నెర మోహన్ మండల ఎమ్మార్పీస్ అధ్యక్షులు ఆధ్వర్యంలో చేపట్టడం జరిగింది. సుప్రీం కోర్ట్ తీర్పు వచ్చిన రోజే నిండు శాసన సభలో మాటిచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు వర్గీకరణ ప్రకారమే ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు పెడుతాం అని చెప్పి.. దానికి విరుద్ధంగా ఫలితాలు ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వర్గీకరణ పూర్తయ్యేవరకు అన్ని రకాల ఉద్యోగ నియామకాలను ఆపాలని, మాదిగలకు తీవ్ర అన్యాయం చేసేలాగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. షమీమ్ అక్తర్ నివేదికలో అనేక లోపాలున్నాయని అవి మాదిగ కులాలకు శాపంగా మారనున్నాయని అందువల్ల లోపాలను సరిచేయాలన్నారు. ఈరోజు నుంచి అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యే వరకు మండల కేంద్రాల్లో దీక్షలు కొనసాగుతాయన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంతవరకు అన్ని రకాల ఉద్యోగాల భర్తీ నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లసింగారి భూమయ్య మాదిగ, ఎమ్మార్పీ జిల్లా సహాయ కార్యదర్శి బండారి పోశెట్టి మాదిగ, ఎమ్మెస్పి నాయకులు జాధవ్ ఫకిర నాయక్, బండారి భూమన్న, బంటు సాయిలు, బండారి సాయిలు, బొమ్మ పోశెట్టి, బొమ్మ వడ్డెన్న, డప్పు గంగారాం, తాడెం అబ్బయ్య, బండారి అశోక్, బండారి రాములు, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

# మౌంటేన్ బైసైక్లింగ్ లో రాణిస్తున్న పేదింటి గిరిజన యువతి

బెల్లంపల్లి, మార్చి 10, (జనంసాక్షి) :




మౌంటెన్ బైసైక్లింగ్ లో పేదింటి గిరిజన యువతి రాణించి రాష్ట్రానికి బంగారు పతకాలు సాధించి పెట్టింది. రంగారెడ్డి జిల్లా కోయడ వేదికగా ఈనెల 7 నుంచి 9వరకు జరిగిన 9వ రాష్ట్ర స్థాయి మౌంటెన్ బైసైక్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించింది. బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం నర్వాయి పేట గ్రామానికి చెందిన కున్సోత్ రవి - తార గిరిజన దంపతుల కూతురు కున్సోత్ స్నేహా బైసైక్లింగ్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రెండు బంగారు పతకాలను సాధించింది. బంగారు పతకాలను సాధించిన స్నేహను తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ సెక్రెటరీ భూలోకం విజయ కాంతారావు, ఒలంపిక్ అసోసియేషన్ మల్లారెడ్డి, వెంకట నరసయ్య, సిద్దిపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఖేలో ఇండియా సైక్లింగ్ సెంటర్ కోచ్ సంజీవ్, పిటి హారిక పలువురు అభినందించారు.

# పాసు పుస్తకాలతో పాత లేఔట్ల కబ్జా

- హైడ్రా ప్రజావాణికి 63 ఫిర్యాదులు



**హైదరాబాద్, మార్చి 10 (జనంసాక్షి) :** తండ్రులు అమ్మారు.. తనయులు వచ్చి పాసు పుస్తకాలు తమ పేరిట సృష్టించుకుని పాత లే ఔట్లను చెరిపేసి పంట పొలాలుగా సాగు చేసేస్తున్నారని హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదులందాయి. సోమవారం హైడ్రా నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 63 ఫిర్యాదులందాయి. ఇందులో పాతలేఔట్ల ఆక్రమణలే ఎక్కువగా ఉన్నాయి. ఇందులో రహదారులు, పార్కులు కూడా ఉన్నాయని.. వీటిని కాపాడాలని పలువురు ఫిర్యాదులు ఇచ్చారు. లే ఔట్లలో రహదారులను కబ్జాచేయడం, పార్కులు కలిపేయడం వంటివి జరుగుతున్నాయని అన్నారు. అలాగే మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, వార్డు మెంబర్లు అధికారాన్ని అడ్డం పెట్టుకుని కబ్జాచేస్తున్నారని.. వారిపై ఫిర్యాదు చేసినా స్థానిక అధికారుల నుంచి స్పందన ఉండటంలేదని పలువురు వాపోయారు. తుర్కయాంజల్ చెరువులోకి వెళ్లే వాన నీటికి అడ్డంగా గోడ కట్టేయడంతో వరద మా కాలనీని ముంచెత్తుతోందని ఏవీనగర్-2కు చెందిన నివాసితులు ఫిర్యాదు చేశారు. ఘట్‌కేసర్ మండలం, ప్రతాప్ సింగారంలో మొత్తం 25.17 ఎకరాల్లో 390 ప్లాట్లతో 1989లో లే ఔట్ వేయగా.. అందులో 88 ప్లాట్లు కబ్జాకు గురయ్యాయి. మొత్తం 6.14 ఎకరాల భూమి తనదంటూ ధరణి ద్వారా పాసు పుస్తకాన్ని సృష్టించి కబ్జా చేశారంటూ.. ప్లాట్లు కోల్పోయిన వారు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. తండ్రి అమ్మగా అతని కుమారుడు ఇప్పుడు కబ్జాచేశారని.. రైతు బంధు పథకం కింద డబ్బులు కూడా తీసుకున్నారని వాపోయారు. తాము ఫిర్యాదు చేయగా.. అధికారులు రైతుబంధును వాపసు చేయాలని నిర్ణయించారు. అయినా కబ్జా నుంచి వైదొలగడంలేదంటూ అక్కడి ప్లాట్ల యజమానులు ఫిర్యాదు చేశారు. మొత్తం లే ఔట్లలో రహదారులు, పార్కులు చెరబట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దేవేందర్‌నగర్ కాలనీ సర్వే నంబరు 63/1లఓని 1200 గజాల ప్రభుత్వస్థలాన్ని కబ్జా చేసేస్తున్నారని.. పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలకు ఆ స్థలాన్ని కేటాయిస్తే మంచి క్రీడామైదానం సమకూరుతుందని దేవేందర్‌నగర్ కాలనీ వీకర్ సెక్షన్ సొసైటీ ప్రతినిధులు హైడ్రాకు వినతి పత్రం అందజేశారు. రంగారెడ్డి జిల్లా తుర్కయాంజల్ మున్సిపాలిటీలోని శ్రీరంగాపురంలోని 24వ వార్డులో 1050 గజాల పార్కు స్థలాన్ని అక్కడి మాజీ ప్రజాప్రతినిధి కబ్జా చేశారని, శ్రీరంగాపురం కాలనీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. అక్కడ 6 కాలనీలకు వెళ్లే దారిని కూడా కబ్జా చేయడంతో దారి లేకుండా పోయిందని వాపోయారు.

# ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

- సహాయక చర్యలపై ఉన్నతాధికారులతో సమీక్ష
- ప్రగాఢ సంతాపం ప్రకటించిన ఉన్నతాధికారులు







**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, మార్చి 10(జనంసాక్షి):** ఎస్ ఎల్ బిసి టన్నెల్ లోపల సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.ఎస్ ఎల్ బిసి టన్నెల్ కార్యాలయంలో సోమవారం డిజాస్టర్ అండ్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ టీం, ర్యాట్ మైనర్స్, దక్షిణ మధ్య రైల్వే, కేరళకు చెందిన కడావర్ డాగ్స్ స్క్వాడ్, సహాయక చర్యల్లో పాల్గొంటున్న విభాగాల అధికారులు హాజరయ్యారు.ఈ సమావేశంలో ఆదివారం జరిగిన సహాయక చర్యలను సమీక్షించి, పంజాబ్ రాష్ట్రానికి చెందిన గురుప్రీత్ సింగ్ మృతదేహాన్ని వెలికితీసిన సహాయక బృందాలను అభినందించారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన సహాయక చర్యలను మరింత వేగంగా, సమర్థవంతంగా కొనసాగించాలని సూచించారు. సహాయక బృందాలు పూర్తిస్థాయిలో పాల్గొని పనులను వేగంగా ముగించాలని ఆదేశించారు.ఈ దుర్ఘటనలో గురుప్రీత్ సింగ్ మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు , గురుప్రీత్ సింగ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ప్రభుత్వం మృతుని కుటుంబానికి 25 లక్షల రూపాయల నష్టపరిహారం ప్రకటించారని తెలియజేశారు.ఎస్ ఎల్ బి సి సొరంగం లో కొనసాగుతున్న సహాయక చర్యల నిర్వహణ కోసం అవసరమైన అన్ని రకాల వనరులను సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. టన్నెల్ ప్రాంతానికి సహాయక బృందాలు సులభంగా చేరుకునేందుకు వాహన సౌకర్యాలను విస్తృతంగా ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. సహాయక చర్యల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది నిరంతరాయంగా పని చేయడానికి అవసరమైన వసతులను అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న అధికారులకు, సిబ్బందికి పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. టన్నెల్ వద్ద సహాయక సిబ్బంది అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. సహాయక చర్యల్లో పాల్గొనే బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని వివరించారు.



## యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



**యాదగిరిగుట్ట, మార్చి10 (జనంసాక్షి) :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దర్శించుకున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా యాగశాలలో నిర్వహిస్తున్న మహాపూర్ణాహుతికి హాజరయ్యారు. అదేవిధంగా చక్రతీర్థ స్నానంలో పాల్గొన్నారు. అంతకుముందు కొండపైన వీవీఐపీ అతిథి గృహ వద్దకు చేరుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అక్కడి నుంచి బ్యాటరీ వాహనంపై స్వామివారి మాడ వీధుల గుండా స్వయంభు పంచనరసింహస్వామి వారి దర్శించుకునేందుకు ఆలయంలోకి ప్రవేశించారు. ఆలయ ఉత్తర దిశలో ఏర్పాటు చేసిన యాగశాలలకు వెళ్లి పూర్ణాహుతిలో పాల్గొన్నారు. అనంతరం గర్భగుడిలో స్వయంభు నారసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

## వెంకట్రావుపేటలో కళ్లంలో మిర్చిని తగులబెట్టిన దండగులు

- సుమారు 11 లక్షల రూపాయల నష్టం



**కొత్తగూడెం, మార్చి 10 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం వెంకట్రావుపేటలో కళ్లంలో ఆరబెట్టిన మిర్చిని తగలబెట్టారు గుర్తుతెలియని దుండగులు. ఈ ఘటనలో సుమారు 70 క్వింటాల మిర్చి దగ్ధమైనట్లు రైతు పురుషోత్తం చెప్తున్నారు. ఇది ఎవరు చేశారో.. ఎందుకు చేశారో తెలియదని, ఆరుగాలం కష్టపడి పండించిన పంట అగ్నికి ఆహుతి అయిందని రైతు పురుషోత్తం కన్నీటి పర్యంతం అవుతున్నారు. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం.. సుమారు 11 లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపారు. ఘటన జరిగిన వెంటనే అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు అదుపులోకి తెచ్చారు. భారీగా మిర్చి దగ్ధం అవడంతో ఆ ఘాటుకి ఊర్లో జనం కొన్ని గంటల పాటు అతలాకుతులమయ్యారు. దేశానికి అన్నం పెట్టే రైతును ఇలా చేయడం ఏంటి..ఎవరు చేశారో ఆ దుండగులను కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

# మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి

- సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డాక్టర్ హరీష్



**హైదరాబాద్, మార్చి 10 (జనంసాక్షి) :** మహిళా సాధికారిత కోసం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని, మహిళలు అన్ని రంగాలలో ముందుకు వెళ్లడానికి సముచిత స్థానం కల్పించడానికి ప్రయత్నిస్తున్నారని సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డాక్టర్ హరీష్ అన్నారు. ఆదివారంనాడు నాంపల్లి, చాపెల్ రోడ్డు, తెలంగాణ మీడియా అకాడమి భవనం లో మహిళా జర్నలిస్టుల కోసం నిర్వహించిన 'ఆన్‌లైన్ జర్నలిజం – మహిళా జర్నలిస్టుల సాధికారిత" ఒక్క రోజు శిక్షణా తరగతులకు ఆయన గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ, మీడియా అకాడమీ ఛైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ఏర్పడిన జర్నలిస్టుల అక్రిడిటేషన్ అధ్యయన కమిటీ మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక సిఫారసులు చేశారని, దీని వలన మహిళా జర్నలిస్టులకు తగిన ప్రాతినిధ్యం లభిస్తుందని ఆశిస్తున్నానన్నారు. మహిళా జర్నలిస్టులు జర్నలిజం వృత్తిలోనే కాక అన్ని రంగాలలో రాణించాలని, దీనికి ప్రముఖ మహిళా సైంటిస్టు మేరీ క్యూరీ ఫిజిక్స్, కెమిస్ట్రీ రెండు విభాగాలలో నోబెల్ బహుమతి పొందిన మొదటి మహిళను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అద్యక్షతన ఈ తరగతులు జరిగాయి. "ఆన్లైన్ జర్నలిజం మెళుకువలు – సోషల్ మీడియా ప్రణాళికా' అనే అంశం పై ఐ.ఎస్.బి. డేటా సైన్స్ కళాశాల ప్రొఫెసర్ మధు విశ్వనాథం, 'వార్తల మూలం – విషయ పరిజ్ఞానం' అనే అంశం పై కృత్రిమ మేధస్సు నిపుణులు రాకేశ్ దుబ్బుడు, 'ఆన్లైన్ జర్నలిజం, నావిగేషన్, విశ్వసనీయత, కృత్రిమ మేధస్సు' అనే అంశం పై హైదరాబాద్ యూనివర్సిటీ సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మాధవి రవి కుమార్, 'ఫేక్ న్యూస్ – గంధరగోళ పరిచే వార్తలు' అనే అంశం పై ఐ.ఎస్.బి. డేటా సైన్స్ కళాశాల అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ శృతి మంత్రి ప్రసంగించారు. రాష్ట్రం లోని పలు జిల్లాలు, హైదరాబాద్ నగరం నుండి మొత్తం 50 మంది మహిళా జర్నలిస్ట్ లు శిక్షణా తరగతులకు హాజరయ్యారు. హాజరైన జర్నలిస్టులకు వృత్తి పరంగా ఉపయోగ పడే అంశాల పై 10 పుస్తకాలు, సర్టిఫికెట్లు అకాడమీ అందచేసింది. కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వేంకటేశ్వర రావు, మహిళా జర్నలిస్టుల సమన్వయ కర్త రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సిబ్బందిపై దాడి చేసిన రైతులపై కేసు

**పెద్దవంగర, మార్చి 10(జనం సాక్షి) :** రైతులకు, విద్యుత్ సిబ్బందికి మధ్య జరిగిన తోపులాటలో నలుగురు రైతులపై కేసు నమోదైన సంఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం రామచంద్రుతండాలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రు తండాకి చెందిన జాటోత్ మహేందర్, జాటోత్ యాకన్న, జాటోత్ యాకు, జాటోత్ సురేష్ అనే నలుగురు రైతులు రామచంద్రు తండాలోని స్థానిక ట్రాన్స్ఫార్మర్ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా విద్యుత్ కనెక్షన్ తీసుకుని ఎస్సారెస్పీ కాల్వకు మోటార్లు బిగించి ఆ నీటితో వ్యవసాయ పనులకు ఉపయోగించుకుంటున్నారు. దీంతో అధిక లోడు పడుతుందని విద్యుత్ వినియోగదారులు అందించిన సమాచారంతో విద్యుత్ అధికారులు అసిస్టెంట్ లైన్మెన్ పవన్ కళ్యాణ్, విద్యుత్ కాంట్రాక్ట్ సిబ్బంది కేశ బోయిన అశోక్, చిన్నసాని పుల్లయ్య ముగ్గురు కలిసి ఎస్సారెస్పీ కాల వద్దకు చేరుకొని రైతులు అక్రమంగా బిగించిన విద్యుత్తు లైన్లను తొలగిస్తున్న క్రమంలో రైతులకు విద్యుత్ సిబ్బందికి మధ్య ఘర్షణ జరిగింది. విద్యుత్ సిబ్బంది చిన్నసాని పుల్లయ్యకు ఒక్కొక్క రైతు రూపాయలు రెండు వేలు ఇచ్చామని, మొత్తం 12 మంది రైతులు డబ్బులు సమర్పించామని డబ్బులు తీసుకుని మా విద్యుత్తులన్ని తొలగించడం ఏంటని రైతులు వాపోయారు. ఈ నేపథ్యంలో విద్యుత్ సిబ్బందికి స్వల్ప గాయాలు కావడంతో అసిస్టెంట్ లైన్మెన్ పవన్ కళ్యాణ్ ఫిర్యాదు మేరకు రైతులపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి

**ఆదిలాబాద్, మార్చి10 (జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. బజార్ హత్నూర్ మండలంలోని మోర్‌కండి గ్రామానికి చెందిన రాజేశ్వర్ కూతురు లాలిత్య చక్రం 9వ తరగతి చదువుతున్నది. ఆదివారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి భోజనం చేసి నిద్రపోయింది. ఉదయం విద్యార్థులంతా నిద్రలేచినప్పటికీ ఆమె.. మేల్కొనకపోవడంతో ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. దీంతో విగతజీవిగా మారిన లాలిత్యను చూసిన ఉపాధ్యాయులు పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ భీమేష్ వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బోథ్ దవాఖానకు తరలించారు. కాగా, లాలిత్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. అయితే అనారోగ్యంపై పాఠశాల సిబ్బంది తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

## కాంగ్రెస్ పార్టీలో ఓ పద్ధతి ఉంటుంది

- ఎప్పుడు ఎవరికైనా అవకాశం వస్తుంది: విజయశాంతి

**హైదరాబాద్, మార్చి 10 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీలో ఓ పద్ధతి ఉంటుందని, పనిచేసే వారికి ఎప్పుడో ఒకప్పుడు ఎవరికైనా అవకాశం వస్తుందని నటి విజయశాంతి అన్నారు. ఒక ఆలోచన.. ముందుచూపుతో రాష్ట్ర ప్రజల కోసం పలు సంక్షేమ పథకాలను కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందని ఎమ్మెల్సీ అభ్యర్థి విజయశాంతి అన్నారు. ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా ప్రభుత్వం నెరవేర్చుతుందని అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు.'నేను గతంలోనూ కాంగ్రెస్‌లో పనిచేశాను. కానీ, ఏనాడూ ఇది కావాలని పార్టీని అడగలేదు. పార్టీ హైకమాండ్ నాకు అవకాశం ఇచ్చినా.. నాకు వద్దు.. నేను ముందు పనిచేస్తా అని అన్నాను. గతంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా పనిచేశాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చాను. పార్టీ హైకమాండ్ ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటుందో ఎవరికీ తెలియదు. ఎవరికి ఏ బాధ్యత ఇవ్వాలనుకుంటుందో అదే ఇస్తుంది. పార్టీలో ఉన్నవారందరూ కాస్త ఓపిక పట్టాలి. పార్టీ నాకు ఎప్పుడు బాధ్యతలు అప్పగిస్తుందో.. అప్పుడే మాట్లాడాలి.. పని చేయాలి అని అనుకున్నాను. అవకాశం కోసం ఎదురు చూశాను. కాంగ్రెస్ పార్టీలో ఒక సిస్టమ్ ఉంది. అది మీరకుండా ప్రతిఒక్కరూ పనిచేయాల్సి ఉంటుంది. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపించే దిశగా పోరాడుతాం' అని అన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి వచ్చేలోపు నిధులు కేటాయించాలి

- ఎండిపోయిన వరి పంటకు ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



**పాలకుర్తి, మార్చి 10(జనంసాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 16న స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గానికి వచ్చేలోపు పాలకుర్తి రిజర్వాయర్‌కు నిధులు కెటాయించి పనులు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని నిలిచిన రిజర్వాయర్ పనులను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పాలకుర్తి రిజర్వాయర్‌కు గత ప్రభుత్వం రూ.66 కోట్లు నిధులు కెటాయించిందని అయితే రూ.18 కోట్లు ఖర్చు చేసిందని అన్నారు. ఇంత వరకు పనులు జరుగలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్టిమేషన్ చేసి రూ. 100 కోట్లకు పెంచిందని అన్నారు. గతంలో చెరువులు కట్టను తొలగించడంతో నీరు వృదాగా పోయిందని దీంతో ఒక్క కారు కూడా పంట పండడం లేదని అన్నారు. పాలకుర్తి రిజర్వాయర్ పూర్తయితే 7500 ఎకరాలకు సాగునీరు అందుతుందని స్పష్టం చేశారు, పాలకుర్తి రిజర్వాయర్ తో పాటు జిల్లాలో మరో 7 రిజర్వా యర్లకు నిధులు కేటాయించి, పనులు త్వరితగతిన జరిపించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరి పంటలకు నీరు అందక రైతులు తీవ్రంగా నష్ట పోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి వచ్చేలోపు నిధులు కెటాయించి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.



తెలంగాణ శరీర అవయవ దాతల సంఘం, సావిత్రిబాయి పూలే ఎడ్యూకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో విశిష్ట మహిళా పురస్కారాలు ప్రధానం చేశారు. తులసి చందు తల్లి చెన్నూరి అనసూయమ్మ, ఉమెన్ ఆర్మీ కాలీగ్రాఫ్‌లో గోల్డ్‌మెడలిస్ట్ షేక్‌షబానకు పురస్కారాలు అందించారు. అలాగే సావిత్రిబాయి పూలే మార్గంలో సీతా మహాలక్ష్మి, స్వీక్ట్ వాయిస్ అనే పుస్తకాలను ఆవిష్కరించారు.

*- హైదరాబాద్, మార్చి 10 (జనంసాక్షి)*

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370